www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
22-02-2025
సంపుటి : 01 | సంచిక : 291 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## జర్నలిస్టులకి
# ఆరోగ్య, జీవిత బీమా..

- ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్లో తగిన నిధులు కేటాయిస్తాం
- ఇళ్ల స్థలాల సమస్యను ఏం చేయాలనే దానిపై ఆలోచనలు చేస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్ :** జర్నలిస్టులకి హెల్త్ ఇన్సూరెన్సు కల్పించడంతో పాటు జీవిత బీమా కల్పించే అంశంపై ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్ లో తగిన నిధులు కేటాయిస్తామన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను ఏం చేయాలనే దానిపై ఆలోచనలు చేస్తున్నామన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రెటేరియేట్ లో హైదరాబాద్ యూనియన్ అఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజేటీడబ్ల్యూజేఎఫ్ ) 2025 డైరీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్ , జగదీష్ జర్నలిస్టుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు... మిగతా2లో...



## ప్లేస్, డేట్ చెప్పండి చర్చకు
# నేను సిద్ధం

- ఓడిపోతే అక్కడే ముక్కు నేలకు రాస్తా..
- బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు సీఎం రేవంత్ సవాల్
- ప్రజలు కేసీఆర్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారు..
- కేసీఆర్‌కు పాలమూరు ప్రజలే రాజకీయ భిక్ష పెట్టారు
- అక్కడి ప్రజలనే కేసీఆర్ గోస పెట్టారు..
- పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు
- మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దు
- అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం..
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాం
- ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ, చారిత్రాత్మక కులగణన చేసి చూపించాం



గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే.. ఏ నాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదన్నారు. 2

## లైంగిక సమానత్వాన్ని సిలబస్‌లో
# చేర్చాలి

- పిల్లలకు పాఠశాలల్లో ఈ కాన్సెప్ట్ బోధించాలి
- స్త్రీ, పురుష సమానత్వం ఇంట్లోనే ప్రారంభం కావాలి
- సుప్రీంకోర్టు కీలక సూచనలు

2



## కేసీఆర్‌కు యాదగిరిగుట్ట పూజారుల
# ఆహ్వానం

- మహా కుంభాభిషేకం, బ్రహ్మోత్సవాలకు రావాలి
- ఎర్రవెల్లి నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేత

2



## బీఆర్ఎస్ హయాంలో
# రూ.1.81 లక్షల కోట్లు వృథా


కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలం
దక్షిణ తెలంగాణకు కరువు తెచ్చారు..
సాగునీటి సంక్షోభానికి ముగింపు పలికేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు
రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

2



# రేవంత్‌రెడ్డి 14 నెలల పాలనపై చర్చకు సిద్ధం

- ఆయన చెప్పిన చోటుకు, చెప్పిన సమయానికి వస్తా
- ఆరు గ్యారంటీలతో సహా అన్ని అంశాలపైనా చర్చ చేద్దాం
- నిందలు వేయడం మాని నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి 14 నెలల పాలనపై చర్చకు సిద్ధమని.. సీఎం సవాలును స్వీకరిస్తున్నట్టు మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. రేవంత్‌రెడ్డి చెప్పిన చోటుకు, చెప్పిన సమయానికి వస్తానన్న ఆయన.. కొడంగల్ నియోజకవర్గం అయినా రేవంత్‌రెడ్డి ఇంట్లో అయినా చర్చకు సిద్ధమన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో పాటు అన్ని.. మిగతా2లో...

## శ్రీశైలం, సాగర్ నుంచి
# నీటిని తరలించొద్దు..

- కేఆర్ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు
- బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించిన రాహుల్ బొజ్జా



**విశ్వంభర, హైదరాబాద్:** ఇప్పటికే వాటాకు మించి నీటిని ఉపయోగించుకున్న ఆంధ్రప్రదేశ్.. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీరు తీసుకోకుండా నిలువరించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డును తెలంగాణ ప్రభుత్వం మరోమారు.. మిగతా2లో...

## అంతేగా!



## మిర్చికి రూ.11,600కు పైగా మద్దతు ధర ఇవ్వాలని
# కేంద్రాన్ని కోరాం

మిర్చి ఎగుమతులు, ఏపీ మిర్చికి అంతర్జాతీయ మార్కెట్ కల్పించే అంశంపై భేటీలో చర్చించాం
కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

2





## ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా..
# శాంతియుతంగా నిర్వహించాలి

అధికారులు పకడ్బందీ ఏర్పాట్లను చేయాలి
మండలి ఎన్నికలపై సీఈవో కీలక ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, శుక్రవారం జిల్లా కలెక్టర్లలతో ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ నిజామాబాద్ఆదిలాబాద్కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం, మెదక్నిజామాబాద్ఆదిలాబాద్కరీంనగర్, వరంగల్ఖమ్మంనల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలు, మెదక్నిజామాబాద్ఆదిలాబాద్కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని.. మిగతా2లో...

## ఆలస్యంగా రావడం వల్లే ఓడిపోయాను..

- 20 ఏళ్ల ముందే వచ్చి ఉండాల్సింది
- భాష కోసం తమిళులు ప్రాణాలు కోల్పోయారు
- భాషతో ఆటలాడుకోవద్దు
- మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధినేత కమల్ హాసన్



**చెన్నై:** తమ భాష కోసం ఎంతో మంది తమిళులు ప్రాణత్యాగాలు చేశారని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధినేత కమల్ హాసన్ అన్నారు. భాషతో ఆటలాడుకోవద్దని హెచ్చరించారు. ఎంఎన్ఎం 8వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చెన్నైలోని పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి కమల్ హాసన్ మాట్లాడారు. తమిళ భాష ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. కమల్ మాట్లాడుతూ.. భాష విషయంలో... మిగతా2లో...

## జర్నలిస్టులకి ఆరోగ్య, జీవిత బీమా..

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా, జర్నలిస్టుల హెల్త్ కార్డులు పనిచేయడం లేదని చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాలకి ప్రతి ఏడాది రూ.10 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీం లో జర్నలిస్టుల హెల్త్ స్కీం కలిపి అన్ని ప్రయివేట్ , కార్పొరేట్ హాస్పిటల్స్ లో జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం రైతు బీమా అమలు చేస్తున్నట్లు.. అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బీమా కింద జీవిత బీమా అమలు చేయాలని కోరారు. ఏదైనా కారణాలతో జర్నలిస్ట్ లు మరణిస్తే వారి కుటుంబాలకు... పరిహారం కింద రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలు అందేలా ప్రభుత్వం జర్నలిస్టు బీమా పథకం తీసుకురావాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం ... జర్నలిస్టుల ఆరోగ్య బీమా, జీవిత బీమా, హెల్త్ కార్డులపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ట్రీట్మెంట్ తీసుకుని ఇంటి దగ్గర రెండు మూడు నెలలు రెస్ట్ లో ఉండే జర్నలిస్టులకూ కుటుంబ పోషణ కోసం ఆర్థిక సహకారం అందించే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఇళ్ల సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున, ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై నిపుణులతో చర్చిస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో హెచ్ యూ జే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ బట్టిపాటి రాజ శేఖర్, నాయకులు రామకృష్ణ, చిట్యాల మధుకర్, క్రాంతి, ప్రశాంత్ , కొడవలిగంటి నవీన్, సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు యాదగిరిగుట్ట పూజారుల ఆహ్వానం



**విశ్వంభర, యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన స్వర్ణ విమాన గోపురానికి ఈనెల 23న మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆలయ పూజారులు ఆహ్వానించారు. అనంతరం మార్చి 1 నుంచి 11వ తారీఖు వరకు జరిగే యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ మేరకు యాదగిరి గుట్ట దేవస్థానం ప్రధాన పూజారి, ఆలయ కార్యనిర్వహణ అధికారులతో కూడిన బృందం శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రాలతో కేసీఆర్‌కు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు, డీఈఓ భాస్కర్, ముఖ్య అర్చకులు నరసింహమూర్తి, కిరణ్ కుమారాచార్యులు, పీఆర్ఓ రాజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం, సాగర్ నుంచి నీటిని తరలించొద్దు..

### బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించిన రాహుల్ బొజ్జా

(మొదటి పేజీ తరువాయి)

కోరింది. శుక్రవారం తలపెట్టిన బోర్డు ప్రత్యేక సమావేశం వాయిదా పడిన తరుణంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్.. జలసౌధలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిశారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహుల్ బొజ్జా.. బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించారు. ఏపీ ఇప్పటికే వాటాకు మించి నీటిని వాడుకొందన్న తెలంగాణ అధికారులు.. ఇక నుంచి ఉమ్మడి జలాశయాల నుంచి ఏపీ నీటిని తీసుకోరాదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్ చేశారు. మే నెల వరకు తెలంగాణకు 107 టీఎంసీల నీరు ఇవ్వాలని బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. ఇవాళ జరగాల్సిన ప్రత్యేక సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరినందున, ఆ రోజు సమావేశంలో చర్చించే వరకు శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా చూడాలని తెలంగాణ అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ బోర్డు తగిన విధంగా స్పందించడం లేదని తెలంగాణ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేంద్ర మంత్రి నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు చేయడం లేదని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

## మిర్చికి రూ.11,600కు పైగా మద్దతు ధర ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం

### - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**ఢిల్లీ:** ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మిర్చికి రూ.11,600 పైగా మద్దతు ధర ఇవ్వాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశామన్నారు. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ''మిర్చి ఎగుమతులు, ఏపీ మిర్చికి అంతర్జాతీయ మార్కెట్ కల్పించే అంశంపై భేటీలో చర్చించాం. సమస్య చెప్పిన వెంటనే కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందించారు. ఎగుమతిదారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చుకు మధ్య తేడా పరిశీలిస్తామన్నారు. ఏపీలో మిర్చి రైతులు కష్టాల్లో ఉన్నారని చెప్పాం. రాయలసీమ, గుంటూరు, పల్నాడు జిల్లాల మిర్చి రైతులకు లబ్ధి కలిగేలా అన్ని చర్యలు తీసుకుంటాం'' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## రేవంత్‌రెడ్డి 14 నెలల పాలనపై చర్చకు సిద్ధం

### - మాజీమంత్రి హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపైనా చర్చ చేద్దామని తెలిపారు. నిందలు వేయడం మాని నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని సూచించారు. అబద్ధాల కోసం కాకుండా పది మందికి ఉపయోగపడేలా పాలన అందించడానికి ప్రయత్నించాలని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు అలవాటైన పైశాచిక భాషలో పాలమూరు ప్రగతిపై పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఆక్షేపించారు. కృష్ణా జలాలను ఏపీ యథేచ్ఛగా తరలించుకుపోతుంటే ఆపడం చేతగాక.. తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలమూరును ఎడారిగా మార్చిన తెలుగుదేశం, కాంగ్రెస్‌లతో అంటకాగి తీరని ద్రోహం చేసింది రేవంత్ రెడ్డి అని విమర్శించారు. 14 నెలల్లో ఒక్క చెక్ డ్యాం కూడా కట్టని వారు కేసీఆర్ గురించి మాట్లాడతారా అని ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి.. కాంగ్రెస్ పాలనలో వలసలకు, ఆకలి చావులకు నిలయంగా మారిన పాలమూరు తలరాతను మార్చింది కేసీఆర్ అని హరీశ్ రావు తెలిపారు.

# ప్లేస్, డేట్ చెప్పండి చర్చకు నేను సిద్ధం

### బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు సీఎం రేవంత్ సవాల్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం నారాయణపేట్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పదేళ్లు అధికారంలోకి ఉండి కేసీఆర్ తెలంగాణకు ఏం చేశారో.. పన్నెండేళ్లుగా కేంద్రంలోని బీజేపీ, ఏడాదిలోనే తామేం చేశామో చర్చించడానికి తాను సిద్ధమని కీలక ప్రకటన చేశారు. చర్చలో తాను ఓడిపోతే అక్కడే ముక్కు నేలకు రాస్తా అన్నారు. ఏడాదిలో తాము చేసిన అభివృద్ధి దేశంలో ఏ రాష్ట్రం చేయలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం.. పదేళ్లలో ఏ ఒక్కరికైనా కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలమూరు వలసలు ఆపేందుకు ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు తాము ప్రయత్నిస్తుంటే.. మళ్లీ ప్రభుత్వాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

**బీఆర్ఎస్, బీజేపీ పాలనపై చర్చకు సిద్ధం..**

'తాను బీజేపీ, బీఆర్ఎస్‌కు సూటిగా సవాల్ విసురుతున్నా.. పన్నెండేళ్ల మోడీ పాలనపై, పదేళ్ల బీఆరెస్ పాలనపై, పన్నెండు నెలల మా పాలనపై చర్చకు మేం సిద్ధం.. బీజేపీ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ఎవరొస్తారో రండి.. బీఆర్ఎస్ నుంచి కేసీఆర్ వస్తారో కొడుకును, అల్లుడిని పంపిస్తారో రండి.. ప్లేస్, డేట్ చెప్పండి చర్చకు నేను సిద్ధం' అని సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏ ఊర్లో తాము ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామో ఆ ఊర్లో మేం పోటీ చేస్తాం.. ఏ ఊర్లో మీరు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చారో అక్కడే మీరు పోటీచేయాలని సూచించారు. కొందరు కడుపులో కత్తులు పెట్టుకుని బయలుదేరి మనపై కుట్రలు చేస్తున్నారు.. అలాంటి వారికి మీరు సరైన గుణపాఠం చెప్పాలి.. పనులు చేసే బాధ్యత నాది.. నన్ను కాపాడుకునే బాధ్యత మీది అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**ప్రజలు కేసీఆర్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారు..**



ప్రజలు కేసీఆర్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారని.. ఆ పదేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపూర్తి చేసి ఉంటే.. ఇవాళ ఏపీతో గొడవ ఉండేదే కాదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్ట్ పనులు మొదలు పెట్టామని అన్నారు. తాము పాలమూరు పచ్చబడేలా పనులు చేస్తుంటే కేసీఆర్ ఓర్వలేకపోతున్నాడని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్‌కు పాలమూరు ప్రజలే రాజకీయ భిక్ష పెట్టారని.. అయినా ఏమాత్రం విశ్వాసం లేకుండా పదేళ్లు పాలమూరును ఎండబెట్టారని సీరియస్ అయ్యారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది కాంగ్రెస్సే.. పూర్తి చేసేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అని కీలక ప్రకటన చేశారు.

**పాలమూరు ప్రజలను కేసీఆర్ గోస పెట్టారు..**

ఈ ప్రాజెక్ట్ డిజైన్ మార్చి ఏడాది పాటు పాలమూరు ప్రజలను కేసీఆర్ గోస పెట్టారని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చెప్పులు మోసి పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీళ్లు వెళ్లేలా చేసింది కేసీఆరే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్డీఎస్ ద్వారా అదనపు జలాలు తరలించినప్పుడు హరీష్ రావు వైఎస్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. ముచ్చుమర్రి కడుతుంటే కేసీఆర్ కళ్లు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా కొట్టడం కాదు.. ముందు ఈ కార్ రేసులో అవినీతికి పాల్పడ్డ నీ కొడుకు కేటీఆర్, కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో దోచుకున్న నీ అల్లుడు హరీష్ రావును, లిక్కర్ కుంభకోణంతో తెలంగాణ పరువు తీసిన నీ కూతురు కవితను కొట్టు ముందు అని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కేసీఆర్ పాపాలే పాలమూరు ప్రజలకు శాపంగా మారాయని అన్నారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారు. మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దు. భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత నాది'' అని సీఎం అన్నారు.

**అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం..**

తాము అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50 వేల ఉద్యోగాలు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, రుణమాఫీ, ఆర్టీసీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ఇలా చెప్పుకుంటూ పోతే ఏడాదిలోనే ఎన్నో పనులు చేశామని అన్నారు. దీనిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఏ గ్రామంలో అయినా చర్చకు సిద్ధమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ, చారిత్రాత్మక కులగణన చేసి చూపించామని అన్నారు.

**ప్రతి జిల్లాలో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకులు: సీఎం రేవంత్‌రెడ్డి**

మహిళా సమాఖ్య సభ్యులకు ఏడాదికి రెండు చీరలు అందజేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నారాయణపేట జిల్లా పర్యటనలో భాగంగా అప్పక్‌పల్లెలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్యలో మొత్తం 67లక్షల మంది ఉన్నారు. ఈ సభ్యులకు ఇకపై రూ. 1000 కోట్ల ఖర్చుతో ఏడాదికి రెండు మంచి చీరలు ఇస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. శిల్పారామం వద్ద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఏర్పాట్లు చేశాం. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటును మహిళలు నిర్వహించబోతున్నారు. తొలుత ప్రతి జిల్లాలో ఒక చోట ప్రభుత్వ భూముల్లో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తాం. ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కటైనా ఉండేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో స్కూళ్ల నిర్వహణ బాగుండేలా మహిళలు చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులు లేకపోయినా, వసతులు సరిగా లేకపోయినా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లండి. నిధులు నేనిస్తా.. నిర్వహణ మీ చేతుల్లో ఉంటుంది. నిధులు ఇచ్చినా నిర్వహణ బాగాలేకపోతే ప్రయోజనం ఉండదు. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహిస్తున్నామో బడి కూడా అలాగే నిర్వహించాలి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో రూ.1.81 లక్షల కోట్లు వృథా

### - రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** నీటిపారుదల శాఖలో గత బీఆర్ఎస్ పాలనలో విపరీతమైన అవకతవకలు జరిగాయని, రూ.1.81 లక్షల కోట్లు వెచ్చించినా కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమైందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దీంతో నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 103 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం నిరుపయోగంగా ఉందని ప్రకటనలో పేర్కొన్నారు.


'ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకుంది. తెలంగాణకు హక్కుగా ఉన్న కృష్ణా బేసిన్ వాటాను కోల్పోయాం. కేసీఆర్ పాలనలో అవినీతి, దుర్వినియోగంతో రైతులు నష్టపోయారు' అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కీలక ప్రాజెక్టులను పూర్తిచేయడంలో విఫలం కావడంతో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా చేజారిపోయిందని పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్‌ల నుంచి నీటి లభ్యత ఉన్నా, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు సగంలో నిలిచిపోవడంతో సరిపడా నీటిని నిల్వ చేసుకోలేకపోయిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి విషయంలో సీరియస్‌గా ఉండి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి ఉండేది కాదని మండిపడ్డారు. రూ.1.81 లక్షల కోట్లు ఎక్కడికి పోయింది? రిజర్వాయర్లు ఎందుకు అసంపూర్తిగా ఉన్నాయి? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నష్టాన్ని శుభ్రం చేసి ఫలితాలను అందజేస్తుందని హామీ ఇచ్చారు. గత పాలనలో అతిపెద్ద వైఫల్యాలలో పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఉందని తెలిపారు. అంజనగిరి, వీర్లంపల్లి, వెంకటాద్రి, కురుమూర్తిరాయ, ఉదండాపూర్, కేపీ లక్ష్మీదేవిపల్లి పోతిరెడ్డిపల్లి, సింగరాజ్‌పల్లి, గొట్టిముకల, ఇర్విన్, యర్రాపల్లిగోకవరం, డిండి, చింతపల్లి, కిస్తారంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు, బీఆర్ఎస్ వైఫల్యాల వల్ల ఏర్పడిన సాగునీటి సంక్షోభానికి ముగింపు పలికేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు రావాల్సిన కృష్ణా బేసిన్ వాటా వృథా అయిందని, కృష్ణా బేసిన్ ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత లేదని సూచించారు. అవినీతి, మోసాల రోజులు పోయాయని.. బీఆర్ఎస్ హయాంలో ధ్వంసమైన వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్ర రైతాంగానికి అన్యాయం జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత నిస్తున్నదని మంత్రి తెలిపారు.

**దక్షిణ తెలంగాణకు కరువు తెచ్చారు..**

నల్గొండ జిల్లాలోని ఎస్ఎల్బీసీ సొరంగం ద్వారా నిండే రిజర్వాయర్స్ కెపాసిటీ 10 టీఎంసీలు, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ రిజర్వాయర్స్ కెపాసిటీ 25 టీఎంసీలు, పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రిజర్వాయర్స్ కెపాసిటీ 65 టీఎంసీలు అని.. ఈ మూడు ప్రాజెక్టులే కాకుండా కృష్ణా బేసిన్‌లోని వివిధ దశలలో ఉన్న ఇతర ప్రాజెక్టులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదని తెలిపారు. ఫలితంగా దక్షిణ తెలంగాణలో కరువు పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. గత పదేళ్లుగా వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ కూడా చేయకుండా నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. కృష్ణా బేసిన్‌లోని కొన్ని ప్రాజెక్ట్ లలో కాలువలు, డిస్ట్రిబ్యూటర్స్ నిర్మాణం అసంపూర్తిగా ఉన్న విషయం వాస్తవం కాదా? అని పేర్కొన్నారు. బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడానికి కేసీఆర్, హరీశ్‌రావు ప్రధాన కారణమని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే మూడు సంవత్సరాలలో కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్ట్ లన్నింటినీ పూర్తిచేస్తామని తెలిపారు.

## లైంగిక సమానత్వాన్ని సిలబస్‌లో చేర్చాలి



**ఢిల్లీ :** లైంగిక సమానత్వం అనే భావనను పాఠశాల సిలబస్‌లో భాగంగా చేయాలి. మహిళలో పురుషులు ఎలా ప్రవర్తించాలనే నైతికతను పాఠశాల శిక్షణలో భాగం చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. 'నైతిక శిక్షణ, మర్యాదలను పాఠశాల సిలబస్‌లో భాగం చేయాలి. చాలా చిన్న వయసు నుంచే పాఠశాలలో దీనిని బోధించడానికి సరైన మాడ్యూల్ ఉండాలి. ఇప్పుడు పాఠశాలల్లో నైతిక విద్యను బోధించడం లేదు. కొన్ని పాఠశాలల పాఠ్య పుస్తకాల్లో ఇలాంటి సబ్జెక్ట్ ఉండి ఉండొచ్చు. కానీ వేరే సబ్జెక్ట్ బోధించడానికి ఒక్కసారి దీన్ని రద్దు చేస్తుంటారు' అని జస్టిస్ బివి నాగరత్న అభిప్రాయపడ్డారు. కూతుళ్లు, కొడుకుల మధ్య సమానత్వం ఇంట్లనే ప్రారంభం కావాలి. కానీ స్త్రీ,పురుషుల మధ్య వివక్షను తల్లిదండ్రులే ఇంట్లో ప్రారంభిస్తారని చెప్పారు. తల్లిదండ్రులు తమ కొడుకుల కంటే కూతుర్లను నియంత్రించడం పైనే ఎక్కువ దృష్టి పెడతారని చెప్పారు. అత్యాచార కేసులు, మహిళలపై నేరాలు పెరగడానికి కారణం లింగ సమానత్వం గురించి ప్రాథమిక స్థాయిలో బోధించకపోవడమే అంటూ సీనియర్ న్యాయవాది అబాద్ పోండా వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది.మన దేశంలోని జనాభాలో 50 శాతం మంది మహిళలు తీవ్రమైన ఒత్తిడి, అభద్రతతో జీవిస్తున్నారు. మహిళల పట్ల ద్వేషం, అనాకరిక వైఖరి పెరిగిపోతోంది. ఇలాంటి వైఖరిని మార్చడానికి నైతికత, లింగ సమానత్వం వంటి విషయాలను చిన్నతనంలోనే బోధించాలని పిటిషనర్ పేర్కొన్నారు. కాగా, స్త్రీ వివాహం చేసుకున్న తర్వాత తన తల్లిదండ్రుల ఇంటికి లేదా తన అత్తామామల ఇంటికి చెందినది కాదంటూ ఇప్పటికీ సమాజంలో చాలా మంది నమ్ముతున్నారని జస్టిస్ నాగరత్న తెలిపారు. స్త్రీ స్వతంత్రురాలని ఆమెకు స్వంత వ్యక్తిత్వం, సమాజంలో గౌరవం అనేవి పురుషులతో సమానంగా లభించాలనే అవగాహనను పెంపొందించాలని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పర్యావరణ శాస్త్రాన్ని ఒక అంశంగా బోధించడం మొదలు పెట్టారు. అదే విధంగా నైతిక విద్య (మోరల్ సైన్స్) కూడా పాఠశాల సిలబస్‌లో భాగం కావాలని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా..

## శాంతియుతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా చర్యలతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు, మైక్రో అబ్జర్వర్‌ల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, బ్యాలెట్ బాక్సుల ఓవరాలింగ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు ఎన్నికల సంసిద్ధతపై సీఈఓకు వివరించారు. ఈ సౌకర్యాల కోసం 24 గంటల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్లు సీఈఓకు తెలిపారు. పోలింగ్ బూత్‌లలో తగిన సౌకర్యాలు కల్పించడంతోపాటు పోలింగ్ అధికారుల మధ్య సమన్వయం, ఓటర్ స్లిప్‌ల పంపిణీ, మైక్రో అబ్జర్వర్‌ల శిక్షణ, వాటి విస్తరణ తదితర అంశాలపై కలెక్టర్లకు సీఈఓ సుదర్శన్ రెడ్డి కీలక సూచనలు చేశారు.ఈ సమావేశంలో అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, ఈవీఎం ఇన్‌ఛార్జ్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో పాటు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ములుగు, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల్, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఆలస్యంగా రావడం వల్లే ఓడిపోయాను..

### మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధినేత కమల్ హాసన్

(మొదటి పేజీ తరువాయి)

తమిళులు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారన్నారు. భాషను రక్షించుకోవడంలో వారి పోరాటాన్ని ఉద్ఘాటించారు. హిందీ అమలుకు వ్యతిరేకంగా తమిళనాడు చేసిన చారిత్రక పోరాటాన్ని ప్రస్తావించారు. భాషా సమస్యలను తేలికగా తీసుకునేవారిని ఆయన హెచ్చరించారు. ''భాష కోసం తమిళులు ప్రాణాలు కోల్పోయారు. భాషతో ఆటలాడొద్దు. తమిళులతో పాటు వారి చిన్నారులకు సైతం తమ మాతృ భాష ఎంత అవసరమో తెలుసు. వారికి ఏ భాష ఎంచుకోవాలో స్పష్టత ఉంది'' అని కమల్ పేర్కొన్నారు.

ఇక తన పొలిటికల్ కెరీర్‌పై కమల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాల్లోకి చాలా ఆలస్యంగా వచ్చానని, అందుకే ఓడిపోయినట్లు భావిస్తునని తెలిపారు. 20 ఏళ్ల ముందే రాజకీయాల్లోకి వచ్చి ఉంటే ఇప్పుడు తన ప్రసంగం, స్థానం వేరేలా ఉండేవన్నారు. ''ఈ రోజు మన పార్టీ పెట్టి 8 సంవత్సరాలు. చిన్నరిలా ఇప్పుడే ఎదుగుతోంది. ఈ ఏడాది పార్లమెంట్‌లో మన పార్టీ గొంతు వినబడబోతోంది. వచ్చే ఏడాది అసెంబ్లీలోనూ అది ప్రస్ఫుటమవుతుంది'' అని కమల్ పేర్కొన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సన్నద్ధంగా ఉండాలని కార్యకర్తలకు కమల్ సూచించారు. ఇక కమల్ హాసన్ పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్నట్లు ఇటీవల ప్రచారమైన సంగతి తెలిసిందే. డీఎంకే పార్టీ ఆయన్ను రాజ్యసభకు నామినేట్ చేయనుందంటూ ఇటీవల మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా కమల్ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. కమల్ వ్యాఖ్యలు ఇటీవలి ప్రచారానికి బలం చేకూర్చినట్లు అవుతోంది.

## తెలంగాణకు కేంద్రం అన్యాయం

- దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా మోసం చేసింది
- గత పదేళ్లలో బీఆర్ఎస్ మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి
- తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ళ పంపకం ఒకటి
- ఎమ్మెల్సీ కోదండరాం

**విశ్వంభర, హైదరాబాద్ :** కృష్ణాజలాలపై తెలంగాణ ఏపీ మధ్య జరుగుతున్న చర్చలు.. దానిపై కేంద్రం స్పందనపై ఎమ్మెల్సీ కోదండరాం స్పందించారు. శుక్రవారం హైదరాబాద్ లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ళ పంపకం ఒకటి అన్నారు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేంద్రప్రభుత్వం మోసం చేసిందని కోదండరాం మండిపడ్డారు. కృష్ణా జలాల నీటి వివాదంపై గత పదేళ్ళు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదం అన్నారు. గత పదేళ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎనికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ టీజేఎస్ మద్ధతు కోరిందని కోదండరాం మీడియాకు తెలియజేశారు.





ఎస్వీ కృష్ణ ప్రసాద్‌కు ఇటీవల స్టెంట్ వేసిన దృశ్య శుక్రవారం ఉదయం రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌లు ఎస్వీ కృష్ణ ప్రసాద్ నివాసనికి వెళ్లి ఆయనను పరామర్శించారు.



నుమాయిష్‌లో

## మహిళల పట్ల అసభ్య ప్రవర్తన..

**పోలీసుల అదుపులో 247 మంది నిందితులు**

**విశ్వంభర, హైదరాబాద్:** నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్2025) సమయంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 247 మంది నిందితులను 'షీ టీమ్స్' పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మహిళల భద్రత డీసీపీ తెలిపారు. జనవరి 3 నుంచి ఫిబ్రవరి 17 వరకు కొనసాగిన నుమాయిష్‌లో మొత్తంగా 37 కేసుల్లో చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులకు 2 రోజుల జైలు శిక్ష, 33 మందికి రూ.1,050 చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు. నిందితుల్లో 190 మందిని హెచ్చరికతో వదిలిపెట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 20 కేసులు విచారణ స్థాయిలో ఉన్నాయన్నారు. పట్టుబడ్డ 247 మందిలో 223 మంది పెద్దవారు, 24 మంది మైనర్లు ఉన్నారని చెప్పారు. ఈ మేరకు పోలీసు శాఖ ప్రకటన విడుదల చేసింది. 55

## అంజనీకుమార్‌ను వెంటనే రిలీవ్ చేయండి

**కేంద్ర హోంశాఖ కీలక ఆదేశాలు**



**విశ్వంభర, హైదరాబాద్ :** డీజీ అంజనీకుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏపీ కేడర్ ఐపీఎస్‌గా ఉన్న అంజనీకుమార్‌తో పాటు అభిలాష బిస్త్, అభిషేక్ మహంతికు సైతం రిలీవ్ ఆర్డర్స్ వచ్చాయి. ప్రస్తుతం కరీంనగర్ సీపీగా మహంతి ఉండగా తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బిస్త్ పని చేస్తున్నారు. అయితే ఈ ముగ్గురిని ఏపీ కేడర్‌లో రిపోర్టు చేయాలని ఎమ్‌హెచ్ఏ ఆదేశించింది.
కాగా రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఐదుగురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీకి కేటాయించారు. అయితే వాళ్లు తెలంగాణలోనే కొనసాగుతున్నారు. ఇటీవల కాలంలో ఐఏఎస్ అధికారులను ఏపీకి పంపారు. ఐఏఎస్ అధికారులు అమ్రపాలి, వాణీ ప్రసాద్, వాకాటి కారుణ, రొనాల్డ్ రాస్, ప్రశాంతి ఏపీలో సేవలు అందిస్తున్నారు. మిగిలిన ముగ్గురు ఐపీఎస్‌లు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి వెళ్లాల్సి ఉంది. తాజాగా వీరిని రిలీవ్ చేస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

## కన్యాదానం చేసిన కాసేపటికే.. గుండెపోటుతో తండ్రి మృతి



**విశ్వంభర, భిక్కనూరు:** కామారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. కుమార్తె వివాహ వేడుకలో తండ్రి గుండెపోటుతో మృతి చెందడం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ హృదయవిదారక ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వరపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బంధువులు, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన కుడిక్యాల బాల్ చంద్రం(56) వృత్తి రీత్యా కామారెడ్డిలో స్థిరపడ్డాడు. ఆయనకు భార్య రాజమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు కనకమహాలక్ష్మి వివాహం బెంగళూరుకు చెందిన రాఘవేంద్రతో జరిపించాలని ఇటీవల నిశ్చయించారు. ఈ మేరకు శుక్రవారం జంగంపల్లి శివారులోని బీటీఎస్ వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో వైభవంగా పెళ్లికి ఏర్పాట్లు చేశారు. బంధు మిత్రులంతా ఈ వేడుకకు హాజరయ్యారు. వివాహ క్రతువులో భాగంగా.. కన్యాదానం చేసిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురైన బాల్ చంద్ర పెళ్లి మండపంలోనే కుప్పకూలిపోయాడు. బంధువులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అప్పటి వరకు కళకళలాడుతున్న పెళ్లి మండపంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి.

# తేనెతుట్టెపై రాళ్లు రువ్వొద్దు..

**○ కేంద్రానికి స్టాలిన్ వార్నింగ్**



**చెన్నై:** జాతీయ విద్యావిధానం అమలుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వంకేంద్రానికి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తేనెతుట్టెపై రాళ్లు రువ్వొద్దని హెచ్చరించారు. డీఎంకే ఉనికిలో ఉన్నంత కాలం ఈ గడ్డపై తమిళ భాష, రాష్ట్ర ప్రజలకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యలనూ అనుమతించనని స్పష్టం చేశారు. విద్యను రాజకీయం చేయొద్దంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలకు ఎంకే స్టాలిన్ ఇలా కౌంటర్ ఇచ్చారు.
''రాజకీయాలు ఎవరు చేస్తున్నారు? మీరా? మేమా? త్రిభాషా విధానానికి అమోదిస్తేనే నిధులు విడుదల అవుతాయని బ్లాక్‌మెయిల్ చేయడం రాజకీయం కాదా? ఎన్ఈపీ పేరుతో హిందీని రుద్దడం రాజకీయం కాదా? భిన్న భాషలున్న దేశాన్ని ఒకే భాష దేశంగా చేయాలనుకోవడం రాజకీయం కాదా? ఒక పథకానికి ఉద్దేశించిన నిధులను మరో పథకానికి మళ్లించడం రాజకీయం కాదా?'' అని ఎంకే స్టాలిన్ వరుస ప్రశ్నలతో కేంద్రంపై మండిపడ్డారు. అసలు రాజకీయాలు ఎవరు చేస్తున్నారనే విషయాన్ని కేంద్రం ఆలోచించాలన్నారు.
ప్రజల సంక్షేమం కోసం డీఎంకే ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తుంటే.. భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం మాత్రం మతపరమైన ఉద్రిక్తతల కోసం ఖర్చు చేస్తోందని స్టాలిన్ ఆరోపించారు. పీఎం శ్రీ స్కూల్ పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల తమిళనాడు రూ.5000 కోట్లు నష్టపోతోందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ.. ''మంత్రి గారూ.. తమిళనాడు నుంచి వచ్చే పన్నులు మీకు ఇవ్వము అని చెప్పడానికి ఒక్క సెకను సమయం కూడా పట్టదు'' అని ఘాటుగా వ్యాఖ్యానించారు.
సమాఖ్య స్ఫూర్తి అనేది ఇచ్చిపుచ్చుకోవడంలో ఉంటుందని, రాజ్యాంగం ప్రధాన లక్షణం కూడా ఇదేనని స్టాలిన్ పేర్కొన్నారు. దీన్ని అర్థం చేసుకోకుండా పాలించడం దేశానికి పెద్ద శాపమన్నారు. నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చింది విద్యను ప్రోత్సహించేందుకు కాదని, కేవలం హిందీని వ్యాప్తి చేసేందుకేనని తమిళనాడు ముఖ్యమంత్రి మరోసారి ఆరోపించారు.

## అతడు సీఎంగా ఉన్నంత కాలం హామీలు అమలు కావు..

**○ కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**



**విశ్వంభర, హైదరాబాద్ :** నిధులు విషయంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ కాంగ్రెస్ నేతలు చేసిన కామెంట్స్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ మెదక్‌లో టీచర్స్‌తో మిట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ , ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మిగులు బడ్జెట్ లో ఉన్న తెలంగాణ రాష్ట్రం అప్పులపాలై రోడ్డున పడిందని కామెంట్ చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ రూ.9 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపించారు.
ఆ తరువాత వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి అప్పులు, భూముల అమ్మకాలపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టారని ధ్వజమెత్తారు. భవిష్యత్తు అవసరాలకు ప్రభుత్వం భూములు అనేవే లేకుండా అన్ని అమ్మేస్తున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ కు ప్రధాని నరేంద్ర మోడీ ఏం ఇచ్చారని కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీలు అడుగతున్నాయని.. ఏ ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న ప్రతి పేదవాడికి కేంద్రం సాయం చేస్తుందని గుర్తు చేశారు. నిరుపేదల కడుపు నింపేందుకు ఉచితంగా బియ్యం ఇస్తుంటే.. రేషన్ కార్డు పై రేవంత్ సర్కార్ బొమ్మ వేసుకుంటుందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంపై తమ ఆనవాళ్లు లేకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ కుట్రలు చేస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిందని అన్నారు. సీఎంగా రేవంత్ ఉన్నంత కాలం హామీలు అమలు కావని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు.

## వారు ప్రభుత్వ సమాచారం లీక్ చేస్తున్నారు..

**○ మధుయాష్కీ గౌడ్ షాకింగ్ కామెంట్స్**



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో అధికారుల తీరు వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని కాంగ్రెస్నేత మధుయాష్కీ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పెత్తనం చేసిన అధికారులే ఇప్పుడూ ఉన్నారు.. ప్రతిపక్ష పార్టీతో కుమ్మక్కై ప్రభుత్వ సమాచారాన్ని లీక్ చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కీలకంగా వ్యవహరించిన వారిని పక్కన పెట్టాలని ప్రభుత్వ పెద్దలకు సూచించారు. ప్రస్తుతం చాలా చోట్ల ఇంటలిజెన్స్ ఫెల్యూర్ చాలా చోట్ల ఉందని అన్నారు. అవినీతి అధికారుల లిస్ట్ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకు చేరింది.. ఇక వారిపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. పోలీసుల వైఫల్యం తోనే భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్య జరిగిందని అన్నారు. సోమేశ్ కుమార్ బాగోతం ఇంకా బయటపడాలి.. సోమేశ్ అండతోనే జీఎస్టీ కుంభకోణం జరిగిందని వెల్లడించారు. రాష్ట్రంలో విచారణ చేయాల్సిన అధికారులే అవినీతికి పాల్పడటంతో విచారణకు సమయం పడుతోందని అన్నారు.
ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సైతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యూరోక్రాట్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి, సమస్యలను తెలుసుకోవాలని సీఎం రేవంత్ పలుసార్లు కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. కానీ, ఆయన చెప్పినప్పుడు సరేనంటూ తలలూపి.. ఆ తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రధానంగా గురుకులాల్లో తలెత్తుతున్న సమస్యలు తెలుసుకునేందుకు రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలని, నెలలో ఒకరోజు రాత్రి అక్కడే బస చేసి, పిల్లలతో చనువు పెంచుకోవాలని సూచించారు. కానీ, ఇప్పటివరకు ఒకరిద్దరు కలెక్టర్లు మాత్రమే గురుకులాలను సందర్శించారు. మెజార్టీ అధికారులు ఆ విషయాన్ని పూర్తిగా మరిచిపోయారని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే పనితీరు సరిగాలేని కలెక్టర్లు, ఎస్పీలను తప్పించి వారి స్థానాల్లో కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని సీఎంఓ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## భక్తులకు సేవల్లో అంతరాయం ఉండొద్దు

**○ ఈఓ శ్రీనివాసరావు**



విశ్వంభర, శ్రీశైలం : శ్రీశైలంలో జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు చేపట్టిన ముందస్తు ఏర్పాట్లపై శుక్రవారం దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు పరిశీలించారు. దర్శనం క్యూలైన్లు, శివదీక్షా శిబిరాలు, పార్కింగ్ ప్రదేశాలు, 30 పడకల వైద్యశాల తదితర ప్రాంతాలను సందర్శించారు. క్యూలైన్ల పరిశీలన తర్వాత ఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దర్శనం క్యూలైన్ నిర్వహణ ఉండాలని క్యూ కాంప్లెక్స్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎటువంటి అంతరాయం లేకుండా క్యూలైన్లలో నిరంతరం అల్పాహారం, మంచినీరు, బిస్కెట్ల పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లలో నిర్దిష్ట ప్రదేశాల్లో ఏర్పాటు చేయచేసిన వాటర్ పాయింట్లకు నిరంతరం నీటి సరఫరా ఉండాలన్నారు.దివ్యాంగులకు, చంటిబిడ్డ తల్లులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఈఓ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా క్యూ కాంప్లెక్స్‌లోని శౌచాలయాల శుభ్రతపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్నీ శౌచాలయాలలో కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం నీటి సరఫరా అయ్యేలా ఏర్పాటు ఉండాలన్నారు. ఆ తరువాత శివదీక్షా శిబిరాలను సందర్శించారు. శివదీక్షా శిబిరాల పరిశీలనలో భాగంగా పలువురు శివదీక్షాభక్తులతో సంభాషిస్తూ దేవస్థానం ఏర్పాటు చేసిన ఏర్పాట్లపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. పలు పార్కింగ్ ప్రదేశాలను సందర్శించారు. పార్కింగ్ ప్రదేశాలలో తగు విధంగా లైటింగు ఏర్పాట్లు ఉండాలన్నారు.తదుపరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఏర్పాటు చేసిన 30 పడకల వైద్యశాలను ఈఓ శ్రీనివాసరావు పరిశీలించారు. వైద్యశాల వైద్యులతో ఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యశాలలో అవసరమైన ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా గుండెజబ్బులు, తదితర అత్యవసరమైన ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. నరసింహారెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి ఎం హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కున్న బాలుడి పరిస్థితి విషమం



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆరేళ్ల బాలుడు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి తీవ్ర అవస్థలు పడిన విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం లిఫ్ట్‌లో వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో భయాందోళనకు గురైన బాలుడు ఏడుస్తూ కేకలు వేశాడు. గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు వెంటనే అగ్నిమాపక, డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న సిబ్బంది వెల్డింగ్ మిషన్‌ల సాయంతో లిఫ్ట్ డోర్‌లు తొలగించి బాలుడిని బయటకు తీ నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు.తాజాగా బాలుడి ఆరోగ్య పరిస్థితి సూపరింటెండెంట్ ప్రకటన విడుదల చేశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. శరీర లోపలి భాగాలు పూర్తిగా నలిగిపోయి దెబ్బతిన్నాయి. లిఫ్ట్‌లో రెండు గంటల పాటు అవస్థలు పడ్డారు. ఆక్సిజన్ అందక, రక్తప్రసరణ ఆగిపోయింది. చికిత్స అందిస్తున్నప్పటికీ బాలుడి పరిస్థితి సీరియస్‌గానే ఉంది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని సూపరింటెండెంట్ ప్రకటనలో పేర్కొన్నారు.

## టీటీడీకి అశోక్ లేలాండ్ మినీ ట్రక్కు విరాళం



**విశ్వంభర, తిరుమల :** తిరుమల శ్రీవారికి శుక్రవారం ఒక మినీ ట్రక్కు విరాళంగా అందింది. అశోక్ లేలాండ్ కంపెనీ బిజినెస్ హెడ్ విప్లవ్ షా రూ.6.60 లక్షల విలువైన అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన సాథీ మినీ ట్రక్కును అందజేశారు.ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట వాహన తాళాలను ఆలయ ఏఈవో మోహన్ రాజుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో టీటీడీ డీఐ సుబ్రహ్మణ్యం, అశోక్ లేలాండ్ సేల్స్ హెడ్ శ్రీకాంత్ రాజ పాల్గొన్నారు.
తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..
తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది.స్వామివారిని 59,776 మంది భక్తులు దర్శించుకోగా 22,386 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.24 కోట్లు ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 30 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని వివరించారు.

## ఏపీ విజ్ఞప్తి.. కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశం వాయిదా





**విశ్వంభర, హైదరాబాద్:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకు నీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది.అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాల్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్.. బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్ జలసౌధలో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు సమాచారం పంపించింది.

## సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదు

**హైకోర్టులో కేటీఆర్ పిటిషన్**

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులు కొట్టేయాలని కోరారు. సీఎం రేవంత్ ను అవమానించారంటూ కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదుతో బంజారాహిల్స్‌లో కేసు నమోదైంది. బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద సీఎం రూ.2500 కోట్లు తీసుకున్నట్లు కేటీఆర్ ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ కార్యకర్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాల్చినందుకు ముషీరాబాద్ పీఎస్‌లో కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణాలు లేకుండా పోలీసులు కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదని.. తన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లలేదన్నారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మార్చి 18కి వాయిదా వేసింది.



# సుజాత రెడ్డి కథల్లో ప్రపంచీకరణ దృక్పథం

**గ్లోబలైజేషన్ ఫలితంగా ప్రపంచం కుగ్రామంగా మారిపోయింది. వస్తు సేవల పరస్పర మార్పిడికి, ఉత్పత్తికి, మార్కెటింగ్ అవసరాల కోసం వివిధ దేశాల అంతర్జాతీయ విధి-విధానాలు సరళీకరించబడ్డాయి. ఈ కోవలోనే 90వ దశకం తర్వాత భారతదేశంలో కూడా ఆర్థిక సరళీకృత విధానాలు అమలులోకి వచ్చాయి. అభివృద్ధి పేరిట ప్రపంచ స్థాయి టెక్నాలజీని అందుకునే నెపంతో జరిగిన ఈ మార్పు భారతీయ గ్రామీణ సంస్కృతి పై, జీవన విధానంపై, ఆర్థిక అంశాలపై, వృత్తులు, వ్యవసాయం ఇత్యాది రంగాలపై పెను ప్ర-భావాన్ని చూపింది. అప్పటివరకు స్వయం ప్రకాశితమైన గ్రామీణ వ్యవస్థ కుదేలయింది. ఈ విధ్వంసాన్ని సామాజిక స్పృహ ఉన్న రచయితలు ఎందరో తమ రచనల్లో కళ్లకు కట్టినట్లు చూపారు. కవిత కథ నవల ప్రక్రియ ఏదైనా ప్రపంచీకరణ మూలాలను, దాని పరిణామాలను సాహిత్యంలో చర్చించారు. ఈ కోవలోనే తెలంగాణ గ్రామీణ జీవన వ్యవ-స్థ పై ప్రపంచీకరణ ఫలితాలను తమ కథల్లో చర్చించిన వారు డాక్టర్ ముదిగంటి సుజాతా రెడ్డి. సుజాత రెడ్డి గారు రాసిన విసుర్రాయి మింగుతున్న పట్నం వ్యాపారం మృగం మరో మార్క్స్ పుట్టాలె నిత్య కల్లోలం కథా సంపుటాలలో గ్లోబలైజేషన్ ప్రైవేటైజేషన్ సరళీకృత ఆర్థిక విధానాల ఫలితాలు సాధారణ జనజీవనం పై ఎంత తీవ్ర ఫలితాన్ని చూపించాయో చక్కగా విశ్లేషించారు. సుజాత రెడ్డి కథల్లో ప్రపంచీకరణ దృక్పథాన్ని విప్పి చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశం.**






బహుళ జాతి కంపెనీల వ్యాపారం కోసమే ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేసే విస్కీ బ్రాందీ గుట్కా వంటి మత్తు పదార్థాలను పల్లెలకు సైతం విస్తరింప చేశారు. వీటి వల్ల కలిగే ప్రమాదాన్ని గురించి హెచ్చరిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్న ఓ గాయని ఆ వ్యాపారస్తుల కర్కశత్వానికి ఏ విధంగా బలయిందో తెలిపే కథ 'వ్యాపారం మృగం' ఈ కథకు కార్యక్షేత్రం భువనగిరి పరిసరాలు. భువనగిరి ప్రాంతంలో హత్యకు గురైన బెల్లి లలిత సంఘటన ఈ కథకు స్ఫూర్తి అని తెలుస్తున్నది.

ప్రపంచీకరణ ఫలితంగానే పుట్టుకొచ్చిన అధునాతన వ్యాపారం రియల్ ఎస్టేట్. రియల్ ఎస్టేట్ వ్యాపార విస్తృతి కోసం చేసే ప్రచారాలు కొన్నిసార్లు గోబెల్స్ ను తలపిస్తాయి. ఇటీవల కాలంలో యాదాద్రి అభివృద్ధి చెందుతుందని అక్కడ పెట్టుబడి పెడితే సిరుల వర్షం కురుస్తుందని రియల్ ఎస్టేట్ సంస్థల ప్రకటనలకు మోసపోయి పెట్టుబడి పెట్టిన అనేకమంది దిగువ మధ్యతరగతి ప్రజలు ఆ ప్లాట్ లో ధరల్లో ఎదుగు బొదుగు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న వైనం గమనిస్తున్నాం. రైతుల వద్ద నుండి అతి చౌక ధరలకు ఎకరాల కొద్దీ కొని ఇక్కడే రాజధాని నగరం వస్తుందని, ఈ భూమి పక్కనుండే జాతీయ రహదారి వచ్చే అవకాశం ఉందని, లేదా విమానాశ్రయం సమీపంలోనే వస్తుందని విపరీతమైన ప్రచారాలు కల్పించి సామాన్యుల బలహీనతలను సొమ్ము చేసుకుని కోట్లకు పడగలెత్తే రియల్ ఎస్టేట్ వ్యాపారుల భాగోతాన్ని బట్టబయలు చేసిన కథ వ్యాపార వియ్యం . తమ వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందడానికి కులం అడ్డు కాదని, వ్యాపారానికి కులం ప్రాంతం అనే అవరోధాలు ఉండవని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియజెప్పారు.

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో వివాహ సంబంధాలు చూడడానికి ఆయా కుటుంబాల మంచి చెడ్డలు, వధూవరుల ఈడు జోడు మాత్రమే చూసేవారు మానవీయ బంధాలు ఆర్థిక బంధాలుగా మారుతున్న ఈ కాలంలో ఈడు జోడు కంటే ముఖ్యంగా ఆర్థిక అంతస్తు భేదాలను చూస్తున్నారు. కాస్ట్ తో పాటు క్లాస్ కూడా చూస్తున్నారని చెప్పే కథ లో 'కాస్'. ప్రేమించాలన్నా పెళ్లి చేసుకోవాలన్నా మానసిక బంధాల కంటే ఆర్థిక బంధాలే ప్రభావితం చేస్తున్నాయని, తన పేదరికం కారణంగా తాను ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఆత్మహత్య చేసుకునే ఓ యువకుని కథ ఎక్కలేని మెట్లు.

యాంత్రీకరణ పెరిగిన తర్వాత చిన్నచితక బడుగు జీవుల ఉపాధి తీవ్రంగా దెబ్బతిన్నది. అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణల పేరిట సన్న కారు జీవుల చిన్న చిన్న వ్యాపారాలన్నీ ధ్వంసం అయ్యాయి. పదిమంది చేసే పనులు ఒకే మిషన్ చేసే కాలం వచ్చినాక ఆ పదిమంది పనివాళ్ళు వీధిన పడవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ దీనస్థితులను కళ్ళకు కట్టిన కథ 'న్యూ ఆనంద్ హోటల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్' ఈ కథ ద్వారా రచయిత్రి ఆధునిక అభివృద్ధి కి వ్యతిరేకం అనుకోలేము కానీ అభివృద్ధి మానవీయ దృక్పథంతో సాగాలనే ఆకాంక్ష ఈ కథల్లో ప్రతిఫలిస్తోంది. కాలిఫోర్నియా కు వెళ్లిన కంప్యూటర్ ఇంజనీరు అయినా పల్లెల్లో దొరికే తాటి ముంజల రుచిని కోరుకునే యువకుడి కథ ముంజలు. నేటితరం పల్లెలకు దూరం అవుతుందనే ఆవేదన ఈ కథలో కనిపిస్తుంది. ఒకప్పుడు గ్రామాల్లో ఎవరి వృత్తులను వాళ్ళు నిర్వహించే సంప్రదాయం ఉండేది. ఆధునిక కాలంలో వృత్తులు కార్పోరేటీకరణ చెందిన తర్వాత ఎవరైనా ఏ వృత్తి అయిన చేపట్టవచ్చు అనే పరిస్థితులు వచ్చాయని ప్రపంచీకరణ తెచ్చిన మార్పులలో సానుకూలతను ప్రకటించే కథ ఇది.

ప్రపంచీకరణ ప్రభావం జనజీవనంపై తీవ్రంగా ఉంది అని చిత్రించే కథలు ముదిగంటి సుజాతా రెడ్డి 'మరో మార్క్స్ పుట్టాలె ' అనే సంపుటిలో అధికంగా కనిపిస్తాయి. ఈ యాంత్రిక జీవన విధానంలో భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన కొరవడుతున్నది. ఒకరిపై మరొకరి ఆధిపత్యం ధోరణి సహించలేని వారు డిప్రెషన్ లోకి వెళ్తున్నారు. భర్త నిర్లక్ష్యానికి గురైన ఓ యువతి అతడి స్వార్థానికి అహంభావానికి మానసికంగా కృంగిపోయి తన కన్న కూతురినే చంపుకునే స్థాయికి దిగజారిన వైనాన్ని చిత్రించిన కథ "ఉన్మాదంలోకి..''. రాబోయే అభివృద్ధిని ముందుగానే పసిగట్టిన రాజకీయ నాయకులు రైతులను మభ్యపెట్టి వారి భూములను చౌక ధరలకు కాజేసి వాటి ప్లాట్లుగా మార్చి కోట్లను సంపాదిస్తున్న వైనం నేటి ప్రపంచీకరణ ఫలితమే. అందుకే నాయకులు ఓట్ల కోసం నిలబడేది వాళ్ల ఆస్తుల సంపాదనకే గాని దేశం అభివృద్ధికి పేదరికనిర్మూలనకు కాదని, కంప్యూటర్లో వైరస్ ప్రవేశిస్తే మొత్తం దానిలో సిస్టం అంతా చెడిపోయి పనిచేయకుండా అయితదని, అట్లా దేశ వ్యవస్థ అనే సిస్టంను పనిచేయకుండా చేస్తున్న వైరస్ రాజకీయ నాయకులు అని సుజాత రెడ్డి 'వైరస్' కథ ద్వారా తేల్చి చెప్పారు.

1990 దశకం తర్వాతనే రాజకీయాలలో వ్యాపారాత్మకత పెరిగిపోయింది. ఇప్పుడు రాజకీయాలు పూర్తిగా వ్యాపారమైనాయి. పదవి కోసం ఓట్ల కోసం తన కన్న వారిని కూడా కడ తీర్చడానికి వెనుకాడని రాక్షసత్వం సమాజంలో వేళ్లూనుకున్నది. తన ప్రత్యర్థి పై గెలవడానికి తన సొంత కుమారుడిని హత్య జేయించి ఆ సానుభూతితో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన కుటిల రాజకీయ నాయకుని కథ 'యజ్ఞ బలి'. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. సామాన్యులకు ఎరవేసి వాయిదాల రూపంలో వాళ్ల కష్టార్జితం కాజేసి చివరకు ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేస్తున్న అనేక సంఘటనలు ప్రస్తుత సమాజంలో చూస్తున్నాం. ఈ దగాను తెలియజేస్తూ ముదిగంటి సుజాతారెడ్డి రాసిన కథ 'భూమి లేచిపోయింది'.

బ్యూరోక్రసీలో నిర్లక్ష్యం అవినీతి పెరిగిపోయినప్పుడు సాధారణ ప్రజల సమస్యలు తీర్చడానికి దళారీల వ్యవస్థ ఏర్పడుతూ వస్తుంది. తాను పోగొట్టుకున్న పాస్పోర్టు నిజాయితీగా పొందవలసి ఉన్నప్పటికీ అధికారుల అలసత్వం కారణంగా బ్రోకర్ ద్వారా పొందవలసిన పరిస్థితి ఏర్పడిన వైనాన్నిసారీ తప్పలేదు కథలో గమనించవచ్చు. అమెరికా మొదలైన దేశాలకు వలస వెళ్లడం పట్ల భారతీయులు చూపిస్తున్న ఆసక్తిని, భారతదేశంలో పెరిగిపోతున్న లంచగొండితనాన్ని రచయిత్రి ఈ కథలో చర్చించింది. ఇదే అంశంలో మరొక కోణాన్ని చర్చించిన కథ 'బ్రెయిన్ డ్రెయిన్'. మాతృభూమికి సేవ చేయాలని, మాతృభూమి అభివృద్ధిలో పాలుపలుచుకోవాలని ఎంతో ఆసక్తితో అమెరికాలో లక్షల రూపాయల జీతాలను వదులుకొని భారతదేశానికి వచ్చిన ప్రవాస భారతీయులకు సరియైన సహకారం అందక వాళ్ల ఉత్సాహం నీరు కారిపోయి చివరకు అమెరికాకు వెళ్ళిపోయే కథ ఇది. ఈ కథకి 'ప్రపంచీకరణమా నీవెక్కడ?' అనే మరొక పేరు కూడా ఉంది.

ఈ కార్పొరేట్ యుగంలో సినిమా రంగం కూడా వంశపారపర్యంగా మారిపోతోంది. హీరోల కొడుకులే హీరోలు అవుతున్నారు. నిర్మాతల కొడుకులే నిర్మాతలు అవుతున్నారు. దూరపు కొండల వంటి రంగుల ప్రపంచమైన సినిమా రంగాన్ని నమ్ముకుని వచ్చి అవకాశాల కోసం సినిమా ఆఫీసులో చుట్టూ తిరిగి మోసపోయిన అమ్మాయిల దీనగాథను చిత్రించిన కథ 'దోపిడీ! దగా!'. ఉద్యోగ ఉపాధ్యాయ రంగాల వంటి సంఘటిత రంగాలు హక్కుల కోసం పోరాటం చేస్తుంటే అసంఘటిత రంగంలో మోసపోతున్న అబలల పరిస్థితిని గురించి ఆలోచింపజేసే కథ ఇది. కంప్యూటర్ రంగంతో ప్రపంచంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈరోజు అన్ని రంగాలను శాసిస్తున్న రంగం సాఫ్ట్వేర్. నేటి యువత కూడా సాఫ్ట్వేర్ రంగంపై ఎంతో ఆసక్తిని చూపుతున్నారు. బహుళ జాతి కంపెనీల గుప్పెట్లో ఉన్న ఈ సాఫ్ట్వేర్ రంగంలో నయా వెట్టిచాకిరి వ్యవస్థ కొనసాగుతోంది. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలకు బదులుగా పన్నెండు గంటలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. సాఫ్ట్వేర్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ఉండదు. సాఫ్ట్వేర్ ఉద్యోగుల సమస్యలను చక్కగా చర్చించిన కథ 'మరో మార్క్స్ పుట్టాలె'. సాఫ్ట్వేర్ కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టడానికి మరో కారల్ మార్క్స్ పుట్టవలసిన అవసరం ఉంది అంటారు రచయిత్రి.

ఇవే కాక ప్రభుత్వ అవసరాల కోసం ఓ సన్న కారు రైతు భూమిని అక్రమంగా గుంజుకున్నా కథ సీతయ్య చెల్క, తమ మార్కెటింగ్ మాయాజాలంతో వస్తు ఉత్పత్తులను అమ్ముకోవడానికి బహుళ జాతి కంపెనీలు చేసే ప్రయత్నాలను చెప్పే మార్కెట్ మాయాజాలం కథ, భూమిపై మమకారాన్ని వదులుకోలేని రైతు కథ పేగు బంధం మొదలైన కథల్లోనూ ముదిగంటి సుజాత రెడ్డి ప్రపంచీకరణ దుష్ఫలితాలను, సమాజంపై ప్రభావాలను చర్చించారు.

ఈ విధంగా ముదిగంటి సుజాత రెడ్డి కథల్లో ఆధునిక జీవితంలో వస్తున్న పెను మార్పులను, సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్న వ్యవసాయ రంగాన్ని, మానవ సంబంధాల్లో వస్తున్న అవాంఛనీయ మార్పులను ప్రపంచీకరణ ఫలితంగా చెదిరిపోతున్న విలువలను అందుకు తగ్గ పరిష్కారాలను సందర్భానుసారం చక్కగా విశ్లేషించారు. సుజాతా రెడ్డి కథలు వారి సామాజిక స్పృహకు సునిశిత పరిశీలన దృష్టికి తార్కాణాలు.



- డాక్టర్ సాగర్ల సత్తయ్య
7989117415

# మనిషి బ్రహ్మగా మారిపోయాడు

## మానవరహిత యుద్ధానికి సిద్ధమైన చైనా..

**బ్రహ్మ ఓ బొమ్మను చేసి దానికి ప్రాణం పోస్తే మనిషి అవుతాడంటారు. కానీ, ఇక్కడ మనిషి బ్రహ్మగా మారిపోయా-డు. కృత్రిమ మేధస్సు సృష్టించి.. మని-షిలాంటి మనిషిని తయారు చేస్తు-న్నాడు. దానికీ భవిష్యత్తు ఇస్తున్నాడు. పొరుగున ఉన్న మరో ముందడుగు వేసింది. ఏకంగా సైన్యంలోకి తీసుకు-వచ్చింది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ న్యూక్లియర్, బయోలాజికల్ అండ్ కెమికల్ డిఫెన్స్ డ్రిల్‌లో యూఏవీలు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. ప్ర-స్తుతం అందరి దృష్టి ఇలాంటి రోబోటిక్ కుక్కలపై పడింది.**



యుద్ధం గెలవడానికి వ్యూహం అవసరం. యుద్ధం చెయ్యడానికి ఆయుధం అవసరం...! వ్యూహం, ఆయుధం పక్కాగా ఉంటే. ఎంతటి బలమైన శత్రువైనా మట్టి కరవాల్సిందే..! అందుకే.. ప్రపంచ దేశాలు అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకుంటున్నాయి. ఇదే క్రమంలో.. భవిష్యత్తు యుద్ధాలకు.. రోబో సైన్యాన్ని రంగంలోకి దించుతున్నాయి..! మనిషి సృష్టించిన అద్భుతం రోబో..! కృత్రిమ మేధస్సు సృష్టించి.. రోబో డాగ్ వెపన్‌ను తయారు చేశాడు. మనిషి అవసరాల కోసం కదిలే మెషిన్ గన్ రూపొందించాడు. మనిషి చెప్పు చేతల్లోనే నడుస్తున్నాయి.

ఈ క్రమంలో చైనా రూపొందించిన రోబో డాగ్, డ్రోన్ మధ్య పోరాట వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇప్పుడు చైనా సైన్యం చేసిన విన్యాసాలు దానికి మరింత ఊతం ఇచ్చాయి. గురువారం(ఫిబ్రవరి 20) చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) న్యూక్లియర్, బయోలాజికల్ అండ్ కెమికల్ (ఎన్బీసీ) డిఫెన్స్ డ్రిల్‌లో యూఏవీలు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. చైనా ఇప్పుడు ఇలాంటి రోబోటిక్ కుక్కలపై దృష్టి సారించింది. రక్షణ రంగంలో ముందుకు సాగడంతో పాటు సైన్యాన్ని బలోపేతం చేసే దిశగా దీనిని ఒక పెద్ద అడుగుగా అభివర్ణిస్తున్నారు.

రోబోటిక్ డాగ్‌లు శత్రువులను ఎదుర్కోవడానికి వ్యూహాన్ని మెరుగుపరుస్తాయి. సైనికుల బలిదాన ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గత సంవత్సరం కూడా, చైనా తన సైన్యంలో భాగమైన రోబోటిక్ కుక్క లక్షణాలను పరిచయం చేసింది. అవి ఎలా పనిచేస్తాయో తెలుసా, చైనీయులకు ఎన్ని రకాల రోబోటిక్ కుక్కలు ఉన్నాయి. వాటి లక్షణాలు ఏమిటి? తెలుసుకుందాం..!

గత సంవత్సరం, చైనా, కంబోడియా మధ్య ఉమ్మడి సైనిక విన్యాసాల వీడియో విడుదలైంది. రోబో డాగ్ సామర్థ్యాలను వీడియోలో చూపించారు. సరళంగా చెప్పాలంటే, శత్రువుల ఇళ్లలోకి ప్రవేశించి వారిపై దాడి చేయగల సైనికులకు ప్రత్యామ్నాయంగా రోబోట్ కుక్కలను తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నష్టం జరిగితే తక్కువగా ఉంటుంది. చైనా ఇప్పుడు టెక్నాలజీ సహాయంతో తన సైన్యాన్ని బలోపేతం చేసుకుంటోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవరహిత వైమానిక వాహనాలు, రోబోట్ కుక్కలు దీనికి ఉదాహరణలు.

చైనా రోబో కుక్కలు నడవగలవు. పరుగెత్తవచ్చు. దూకవచ్చు, అడుగడుగునా అడుగులు వేయవచ్చు. అవసరమైనప్పుడు దూకవచ్చు కూడా. అవి అస్సాల్ట్ రైఫిళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తారు. చైనా సైన్యంలో రెండు రకాల రోబో కుక్కలు ఉన్నాయి. మొదటి కుక్క మరింత శక్తివంతమైనది. దీనికి అస్సాల్ట్ రైఫిల్ అమర్చారు. 50 కిలోల బరువున్న ఈ కుక్క తన లక్ష్యాన్ని ట్రాక్ చేస్తున్నప్పుడు తన దిశను కూడా మార్చుకుంటుంది. దాని లక్ష్యం దాని స్థానాన్ని మారుస్తుందని అనుకుందాం. అప్పుడు అది తన స్థానాన్ని మార్చుకుంటూనే తన లక్ష్యాన్ని గురి చూస్తుంది. రెండవ రోబో కుక్క బరువు 15 కిలోలు. దీనిని శత్రువుపై నిఘా పెట్టడానికి, కొన్ని నిర్దిష్ట విషయాలను గుర్తించడానికి ఉపయోగించవచ్చు.

ప్రత్యేకత ఏమిటంటే రెండూ 4డీ వైడ్ యాంగిల్ పర్సెప్షన్ సిస్టమ్‌తో పనిచేస్తాయి. అవి పరిస్థితిని బట్టి తమ కదలికలను కూడా మార్చుకుంటాయి.

ఈ రోబోటిక్ కుక్కలను చైనీస్ స్టార్టప్ కంపెనీ యూనిట్రీ రోబోటిక్స్ అభివృద్ధి చేసిందని అనేక మీడియా నివేదికలలో పేర్కొన్నారు. అయితే, ఆ కంపెనీ దానిని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి సరఫరా చేయడానికి నిరాకరించింది. ఈ రోబోటిక్ కుక్కలను ఎక్కడి నుండి తీసుకువస్తున్నారో చైనా సైన్యం కూడా స్పష్టం చేయలేదు.గత సంవత్సరం గోల్డెన్ డ్రాగన్ 2024 వ్యాయామంలో కూడా వీటిని ప్రదర్శించారు. ఈ సైనిక విన్యాసాలను చైనా, కంబోడియా సంయుక్తంగా 2024 మే 16 నుండి 30 వరకు నిర్వహించాయి. ఈ శిక్షణలో, చైనా సైన్యం తన బలాన్ని ప్రదర్శించింది. భూమిపై, ఆకాశంలో తన ఆధునిక ఆయుధాలను మోహరించింది. ఇప్పుడు మరోసారి చైనా రోబోటిక్ కుక్క వార్తల్లో నిలిచింది. గత నెలలో వైరల్ అయిన ఒక వీడియోలో, కుక్క డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లు కనిపించింది. ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

# మానసిక ఆరోగ్యం కావాలంటే పది మార్గాలు!

మానసిక ఆరోగ్యానికి మన జీవితంలో నాణ్యతకు సంబంధం ఉంటుంది. ఇది సవాళ్లను, ఒత్తిళ్లను తట్టుకునేలా మనల్ని సన్నద్ధం చేస్తుంది. మనసు సానుకూలంగా ఉంటే మనం సంతోషంగా ఉంటాం. పనిలో ఉత్పాదకత పెరుగుతుంది. భావోద్వేగాలు కూడా అదుపులో ఉంటాయి. మెరుగైన మానసిక ఆరోగ్యం కోసం అనుసరించాల్సిన పది మార్గాల గురించి తెలుసుకుందాం.

**పెంపుడు జంతువుల పాత్ర..**
మానసిక ఆరోగ్యంలో పెంపుడు జంతువులు కూడా తమవంతు పాత్ర పోషిస్తాయి. పెంపుడు జంతువుల వల్ల సురక్షితంగా ఉన్నామన్న భావన కలుగుతుంది. ఒంటరిగా ఉన్నామనే భావన తగ్గిపోతుంది. వాటి చేష్టల కారణంగా సంతోషం కలుగుతుంది.

**పిల్లలు పెద్దలతో..**
రోజూ కాసేపు పెద్దలతో మాట్లాడటం, పిల్లల్ని చదివించడం, ఆడించడం వల్ల కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం సానుకూలంగా ఉంటుంది.

**నిద్రతో హాయి..**
రాత్రిళ్లు నాణ్యమైన నిద్ర కూడా మానసిక ఆరోగ్య సంక్షేమానికి కీలకంగా నిలుస్తుంది. ఎనిమిది గంటల నిద్రతో శరీరంలో ఒత్తిడి స్థాయిలు తగ్గిపోతాయి. తగినంత నిద్ర లేకపోతే మాత్రం ఒత్తిడిని నియంత్రించుకోవడం కష్టమైపోతుంది.

**ఎరుకతో ఉండటం..**
వర్తమానాన్ని అర్థం చేసుకుని ఎరుకతో ఉండటం వల్ల ఒత్తిళ్ల నుంచి త్వరగా కోలుకుంటాం. మైండ్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ప్రక్రియలను అనుసరించడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు.

**మీతో మీరు..**
ఉరుకులు పరుగుల జీవితంలో ఒక్కోసారి ఊపిరి తీసుకోవడమూ మర్చిపోతాం. కాసేపు కూడా సంతోషంగా గడపలేని పరిస్థితి ఉంటుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. కాబట్టి, రోజులో కాసేపు మీకంటూ కొంత సమయం కేటాయించుకోవాలి.


**రాతతో సాంత్వన..**
ఒత్తిడిగా అనిపించినప్పుడు.. ఏకాంతంగా కూర్చుని మీ ఆలోచనలను ఓ నోట్‌ప్యాడ్‌లో రాసుకోవాలి. ఇలా చేస్తే మనసులో గందరగోళం చెదిరిపోతుంది. ఆలోచనలు దారిలోకి వస్తాయి. అంతేకాదు.. జర్నల్ రాయడం వల్ల ఒంటరితనం భావన దూరమైపోతుంది.

**పుస్తక పఠనం..**
ఒత్తిడి నుంచి బయటపడటానికి మంచి మార్గం పుస్తక పఠనం. వార్తాపత్రికలు, క్లాసిక్స్, కామిక్స్, స్ఫూర్తిదాయకమైన పుస్తకాలు చదవడం మంచిది.

**పది నిమిషాల నడక..**
ఒత్తిడి మీపై ఆధిపత్యం చలాయిస్తున్నప్పుడు ఓ పది నిమిషాల నడకతో దాన్నుంచి బయటపడొచ్చు. నడక మన శరీరంలో ఫీల్ గుడ్ హార్మోన్లు విడుదల కావడానికి దోహదపడుతుంది. కుంగుబాటు, ఆందోళనను దూరం చేస్తుంది.

**హాబీలో లీనమవడం..**
మీకంటూ ప్రత్యేకమైన సృజనాత్మక కార్యక్రమంలో మునిగిపోవాలి. దీంతో మీ మూడ్, సంతోషం మీద సానుకూల ప్రభావం పడుతుంది. హాబీ మీ ఆరోగ్యం, మూడ్ తదితర మానసిక విషయాలపై గొప్ప ప్రభావాన్ని చూపుతుందని నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొన్నది.

**మిత్రులతో మాటలు..**
పరిస్థితులు బాగాలేనప్పుడు.. అవి చిన్న విషయాలే అయితే మీ ఆత్మీయులతో పంచుకోవడం ఉత్తమం. మీరు అభిమానించే వ్యక్తి సాన్నిహిత్యం మీకు సాంత్వన చేకూరుస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మంచి మిత్రుల అండ మన ఆందోళన, ఒంటరితనం భావనలను తగ్గిస్తుంది.



# దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

- ఇస్నాపూర్‌లో పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రారంభోత్సవం
- హాజరైన మాధవనంద సరస్వతి స్వామి
- ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలి నీలం మధు ముదిరాజ్



**విశ్వంభర, సంగారెడ్డి జిల్లా :** పటాన్ చేరు నియోజకవర్గందేవాలయాల నిర్మాణంతో గ్రామాలలో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందని మెదక్ పార్ల మెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో నీలం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాధవానంద సరస్వతి హాజరై భక్తులకు ఆశీర్వాదం అందించారు. నీలం మధు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి నుంచి బయట పడటానికి ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. దైవచింతనద్వారా మానసిక ప్రశాంతతక లుగుతుందన్నారు. ఆలయాల నిర్మాణానికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. మాజీ సర్పంచ్,ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, మాజీ సర్పంచ్ గడ్డం బాలమణి, మాజీ ఉపసర్పంచ్ శోభ కృష్ణారెడ్డి, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు మన్నె రాఘవేందర్, ఊళ్ళ శంకర్, పెంటయ్య, యాదగిరి, రవి, రాజు, మణికంఠ, పాండు, వి.నారాయణరెడ్డి, అశోక్, పాండు, సుధాకర్, ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో చెట్టు మీదనే వ్యక్తి మృతి



**విశ్వంభర,నల్గొండ జిల్లా:** తిప్పర్తి మండలం లోని మర్రిగూడెం గ్రామ సమీపంలోని కరెంటు షాక్ తో మేకల కాపరి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సింగం భాస్కర్ వయసు 48 మేకలు కాపరుగా జీవ నం కొనసాగిస్తున్నాడు.వాటి మేత కోసం తుమ్మ చెట్టు ఎక్కాడు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు కిందికి ఉండడంతో అవి గమనించక పోవడంతో విద్యుత్ తీగలు తగిలి చెట్టు మీదనే మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు కిందికి ఉన్నా యని గ్రామస్తులు చెప్పినప్పటికీ విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఒక నిండు ప్రాణం బలైందని విద్యుత్ అధికారులపై చర్యలు తీసు కోవాలని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తిప్పర్తి ఎస్ఐ తెలిపారు.

## ఇస్కిల్ల పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవం



**విశ్వంభర, రామన్నపేట:** ఇస్కిల్ల గ్రామంలోని గుండ్ల సత్తయ్య స్మారక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవం సందర్భంగా చిన్నారులు వివిధ పాత్రకేయులుగా విద్యార్థినీ విద్యార్థులు స్కూల్ టీచర్కుగా, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎంఈ ఓ, ఎంపిడిఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, అంగన్వాడీ టీచర్స్‌లా చక్కగా పాల్గొ న్నారు. చిన్నారులు ముందు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యా యులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు టీచర్స్ వాళ్లు భవిష్యత్తులో కలెక్టర్స్, డాక్టర్స్ కావాలని ఉన్నంత స్థాయి ఎదగాలని ప్రసంగించడం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు, వల్లమల్ల నరేందర్ పాల్గొనడం జరిగింది.

## రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



**విశ్వంభర, దంతాలపల్లి :** రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని జిల్లా ఉద్యాన పట్టు పరి శ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలి పారు. శుక్రవారం దంతాలపల్లి మండలంలో సాగులో ఉన్న మామిడి, ఆయిల్ పామ్ తోట లను సందర్శించి మేలైన యాజమాన్య పద్ధతు లు గురించి తెలిపారు. ప్రస్తుతం రాబోయే వేసవి కాలంలో మామిడి తోటల లో, ఆయిల్ పామ్ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, వేసవి కూరగాయలు సాగు మరియు మామిడి తోటల్లో సస్య రక్షణ చర్యలు తెలియజేశారు. ఈ సందర్శనలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు.మరియన్న తో పాటు బిందు సేద్య అధికారులు కిషోర్, ప్రసాద్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయమాటలు నమ్మి బోర్లాపడ్డ రైతులు



**విశ్వంభర, రామన్నపేట:** కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి కాంగ్రెస్‌ని ఎన్నుకున్న రోజే తెలంగాణ రైతులు బోర్లా పడ్డారని యాదా ద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల రైతుభందు సమితి మాజీ మండల అధ్యక్షులు బొక్క మాధవరెడ్డి అన్నారు. నోటికొచ్చిన హామీ లిచ్చిన కాంగ్రెస్ పార్టీ, కొత్తది చేయడం పక్కకి పెట్టు, ఉన్నది ఉన్నట్టు నడపడం కూడా చేత కావడం లేదని, మొన్నటి దాకా ఎండాకాలంలో మత్తళ్ళు దూకిన చెరువులు నేడు ఎందుకు వెలవెలబోతున్నాయని, తెలంగాణలో భూగర్భ జలాలు పెరిగాయి అని కేంద్ర జల సంఘమే ప్రకటించిన చోట, నేడు ఎందుకని భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, రాజకీయ దుష్ప్రచారంతో కాళేశ్వరం ప్రాజెక్టు మీద నింద లు వేస్తూ, చెరువులు, రిజర్వాయర్లు నిం పకుండా కాంగ్రెస్ సాగించిన సర్కస్ డ్రామాలు నేడు యావత్ తెలంగాణ నీటి కష్టాలని అను భవించబోతుందని తెలిపారు. ఓపక్క కృష్ణా నీళ్ళని పక్క రాష్ట్రం దోచుకుపోతున్న సప్పుడు లేదని, ఇంకో పక్క ప్రాజెక్టు ద్వారానీళ్లు ఎత్తిపో య్యక భూగర్భ జలాలు అడుగం టాయని, లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాం గం ఆగమాగమవడందూరంలోలేదని అన్నారు.

# వంద శాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై మండలాల ప్రత్యేక అధికారులు మూడు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రానున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలలో వచ్చే మూడు రోజులు జిల్లాలోని సీనియర్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని శుక్రవారం కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా ర్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యం సాని టేషన్, అందుకనుగుణంగా సంక్షేమ హాస్టళ్ళ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తహసి ల్దార్లు, ఎం.పి.డి.ఓ ల సమన్వయంతో వసతి గృహాలను విస్తృతంగా సందర్శించి రోజు వారీ నివేదికలను అందజేయాలి. ఇందులో భాగంగా హాస్టళ్ళలో విద్యార్థులకు పరిశు భ్రమైన వాతావరణం కల్పించి రుచికరమైన భోజనం అందించాలని,విద్యార్థుల మెరుగైన భోధనకు చర్యలు చేపట్టాలని, నిత్యావసరాల సరుకుల యొక్క నాణ్యతలను పరీక్షించాలని అన్నారు, నిత్యం సానిటేషన్ చేపట్టాలన్నారు. ఇప్పటికే సూచించిన ప్రణాళిక ప్రకారం ప్రత్యేక అధికారులు వసతి గృహాల సందర్శన తనిఖీలు చేయాలని ఆయన తెలిపారు.

# కుల గణనపై ఇంటింటి సర్వేల్లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్




**విశ్వంభర, హైదరాబాదు :** కులగణన పై అవగాహన కల్పించడం కోసం బీసీ కమిషన్ చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆరవ రోజు చైర్మన్ జి.నిరంజన్ రామంతపూర్ లో వెంకటరెడ్డి నగర్, హబ్సిగూడ డివిజన్(8) పరిధిలో పర్యటించారు. ఏరియాలో కుల గణన దాదాపూ 70 నుంచి 80 శాతం జరిగింది .కొందరు ప్రజలు తమ ఇంటికి ఎన్యుమరేటర్స్ వచ్చినప్పుడు తాము ఉద్యోగాలకి వెళ్లామని అన్నారు. అలాగే మేము ఇక్కడ కిరాయిదారులమని మా ఊర్లో నమోదు చేశామని పరిశీలనలో తేలింది. ఎన్రోల్ ప్రక్రియనీ జి.నిరంజన్ ప్రజల్లో విస్తృ తంగా తీసుకెళ్లారు, మూడు పద్ధతులు ద్వారా ఈ ఎన్రోల్ ప్రక్రియ చేప ట్టొచ్చని అన్నారు. మొదటిది వార్డ్ ఆఫీసులో, రెండవది టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111 ద్వార మరియు మూడోది వెబ్ సైట్ ద్వారా ఫామ్ డౌన్లోడ్ చేసుకుని వివరాలు నింపి సంబంధిత వార్డ్ ఆఫీసులో ఇవ్వొచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ రాణి (బీసీ వెల్ఫేర్ ఆఫీసర్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఆంజనేయులు డిప్యూటీ మున్సిపల్ కమి షనర్, రిసోర్స్ పర్సన్స్ పద్మ, రాధ, గీత, నాగలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ చెక్ పంపిణీ



**విశ్వంభర, తలకొండపల్లి:** మండల కేంద్రానికి చెందిన మహేశ్వరికి కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 16 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురు వారం అందించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో టిపిసిసి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కార్యద ర్శి మోహన్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ ,టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి తుమ్మ నరసింహ, మీసేవ మల్లేష్, బోళ్ల యాదగిరి, పెరుమండ్ల సురేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులందరికీ ఆరు గ్యారెంటీలు అమలుపరుస్తాం

సేవాదళ్ అధ్యక్షుడు హరికృష్ణ ముదిరాజ్



**విశ్వంభర, మహేశ్వరం :** నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరించిన అరు హామీలు అన్ని కచ్చితంగా అందేలా ముందస్తుగా పర్యవేక్షించి ప్రతి పేద వాడికి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఒకరిని న్యాయం చేకూరే విధంగా చూస్తామని నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు గద్ద గూటి హరికృష్ణ ముదిరాజ్ తెలియడం జరిగింది. హరికృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ లు ప్రతి గడపగడపకు చేరే విధంగా అమలు పరుస్తామని ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామంలో అర్హులైన అభ్యర్థులను గుర్తించి కేఎల్ ఆర్ దృష్టికి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు చేరే విధంగా అమలు పరుస్తామని హరికృష్ణ ముదిరాజ్ తెలిపారు.

## ఆడపడుచు వివాహానికి కాంగ్రెస్ శ్రేణుల ఆర్థిక సాయం



**విశ్వంభర, కడ్తాల్:** మండల కేంద్రం లోని గనుగుమర్ల తండా గ్రామపంచా యతీ పరిధిలోని కనుగుబాయ్ తండ కు చెందిన నేనావత్ రాజు అనిత కుమార్తె ఝాన్సీ వివాహానికి స్థానిక నాయకులు రంగారెడ్డి జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి నేనావత్ బిఖ్య నాయక్ 5000,సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ 5000, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునావత్ రాజు నాయక్ 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేనావత్ గోపి నాయక్, హర్య, భిచ్య, శ్రీను, మాన్య, నాయకులు, యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలతో హడలిపోతున్న మానుకోట ప్రజలు



**విశ్వంభర, మహబూబాబాద్:** పట్టణంలోని నెహ్రూ సెంటర్‌లో శ్రీ సాయి బాలాజీ డ్రై ఫ్రూట్స్ కిరణ్ షాప్‌లో దొంగలు పడ్డారు. కిరాణా షాప్‌ను గడ్డపారతో తలుపులు పగు లగొట్టి లోనికి ప్రవేశించి 60 వేల రూపాయల విలువైన సుగంధ ద్రవ్యా లు, డ్రై ఫ్రూట్స్, సీ.సీ. ఫుటేజ్ హార్డ్ డిస్క్ చోరీ టౌన్ సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రబాబును విమర్శించే హక్కు కేసీఆర్‌కు లేదు

**టీడీపీ నాయకులు పోగుల సైదులు గౌడ్**



**విశ్వంభర,నల్గొండ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొమ్మిది ఏళ్లు సేవలందించిన నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్ నగరానికి ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్స్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, మాదాపూర్ లోని హైటెక్ సిటీ, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, అలాగే శివారు ప్రాంతాలలో ఇండస్ట్రియల్ పార్కులు, ఫార్మా కంపెనీలు, ఫార్మా కంపెనీలలో ఎంతమంది ఉద్యోగాలు, ఐటీ రంగంలో ఎంతోమందికి ఉపాధి కల్పించారని తెలిపారు. అలాగే 2019-20 సంవత్సరాలలో సంభవించిన కరోనా మహమ్మారికి వ్యాక్సిన్ కనిపెట్టిన ఘనత మన హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు, ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దక్కుతుందని ఇటువంటి ప్రజా నాయకుడిని విమర్శించే హక్కు స్థాయి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు కి లేదని టీడీపీ నాయకులు పోగుల సైదులు గౌడ్ అన్నారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానన్నారు చేశారా లేదు. మరి ఇలాంటి మాటలు మాట్లాడి చంద్రబాబు నాయుడు అట్లాంటిది విమర్శించడం మీకు తగ దని మరొకసారి మీకు గుర్తు చేస్తూ అలాగే బీఆర్ఎస్ లో ఉన్న ప్రతి ఒక్క నాయకుడు ఎవరైతే ఉన్నా రో ఆ ప్రతి ఒక్క నాయకుడు అంతా తెలుగుదేశం పార్టీ అనే స్కూల్ నుంచి వచ్చిన వాళ్లే అన్నారు. ఎదుగుదలకు సహకరించిన వ్యక్తిని నీడనిచ్చిన చెట్టుని మరచిపోవడం తగదు అన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



**విశ్వంభర, రామన్నపేట:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ, అమ్మ పాల నుండి సంక్రమించిన భాష మాతృభాష అని, అలాంటి మాతృభాషను ఎవరు కూడా విస్మరించవద్దని, మాతృభాష తల్లిపాలవంటిదైతే పరభాష దాది పాల వంటిదని అన్నారు. వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా, మాతృభాష పట్ల అభిమానం కలిగి, మాతృభాషలోనే మాట్లాడాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ, ఒక భాష కనుమరుగైతే దానితో పాటు ఆ భాష మాట్లాడే జాతి కూడా కనుమరుగవుతుంది. కాబట్టి నూతన విద్యా విధానంలో భాగంగా కనీసం ప్రాథమిక పాఠశాల స్థాయి వరకైనా మాతృభాషలో విద్యాబోధన జరిగేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని అన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అంజలి ఎంపిక



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని జెడ్ పిహెచ్ ఎస్ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నటువంటి పెద్ది అంజలి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటుంది. ఇటీవల జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్థాయిలో కబడ్డీ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీలలో పెద్ది అంజలి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 21, 22, 23 తేదీలలో వికారాబాద్‌లో జరుగుతున్నటువంటి రాష్ట్రస్థాయి పోటీలలో భూపా లపల్లి జిల్లా తరుపున ఆడుతుందని పిడిగురుసింగాపూర్ణిమ తెలియ జేశారు. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు పి.సరిత పాఠశాల ఉపా ధ్యాయ బృందం విద్యార్థిని, పిడిమేడం గురుసింగాపూర్ణిమలను అభినందించారు. ఉపాధ్యాయులు మడక మధు, పి. సుధారాణి, డి. సరితాదేవి, ఎండీ. ఓలి పాషా, జి.శ్రీనివాస్, వసుధప్రియ, ఇ. వీరేశం, పి. సమ్మయ్య, బి.లీ లరాణి, జె.రజిత, ఫర్హానా, కౌసర్,ఎండీ. సాహెదాబేగం, టీ.ప్రసూనా, ఎం.దీపిక, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్



**విశ్వంభర, మహబూబాబాద్:** శుక్రవారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి మండలాలలోని కెజిబివి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. కలెక్టర్ హాస్టళ్ళలోని నిత్యావసర సరకు లను, స్టోర్‌రూంను పరిశీలించారు. విద్యార్దులకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందజే యాలని అధికారులకు తెలిపారు. వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా, విద్యార్థులందరూ 10 జిపిఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాల ని కలెక్టర్ సూచించారు. తరచుగా ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించాలని, ఒక్కొక్క విద్యార్థి పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించి, చుట్టూ పరిసరాల పరిశుభ్రత మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు. ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్యసేవల ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూచనలు అందించారు. ప్రాథమిక పరీక్ష, ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు.ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని అన్నారు. ఈ తనిఖీలో స్థానిక మండలాల తహసిల్దార్లు, మెడికల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో రైతులు రాజులయ్యారు

# కాంగ్రెస్ పాలనలో రోడ్డున పడ్డారు



**విశ్వంభర, ఆమనగల్లు:** 60 సంవత్సరాల అసుర పాలన నుంచి విముక్తి కలిగించి, పది సంవత్సరాల పరిపాలనలో తెలంగాణ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన బీఆర్ఎస్ నేతల గురించి స్థాయికి మించి కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం విడ్డూరమని జిల్లా యువజన విభాగం బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు కంబాల అంజి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన రైతు దీక్ష కార్యక్రమం గురించి పలువురు కాంగ్రెస్ నాయకులు స్థాయికి మించి విమర్శించడం తగదని, గతాన్ని మరిచి విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. 60 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రైతు బంధు,రైతు బీమా లాంటి కార్యక్రమాలు ఎందుకు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. అధికార దాహం కోసం 420 హామీలు ఇచ్చి నేడు హామీల అమలులో విఫలమై ప్రజాగ్రహానికి లోనవుతున్న ప్రభుత్వం మీది కాదా అని ఆరోపించారు ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మహేష్, డాన్ శ్రీను, అంజి నాయక్ ,గ్రామ యూత్ ప్రెసిడెంట్ కొప్పు కృష్ణ,మూడ రవి, అంజాత్,గోపాల్,ప్రశాంత్,మొగిళ్ల శేఖర్,రాజు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాతృభాషా దినోత్సవం



**విశ్వంభర, రామన్నపేట:** కుంకుడుపాముల గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠ శాలలో శుక్రవారం రోజు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించడం జరి గింది. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు పాల్వంచ హరికిషన్ మాట్లాడుతూ, అమ్మ భాషనే కమ్మనైనదని, భవితకు ఆధార మని ఏభాష నేర్వాలన్నా అమ్మభాషవచ్చి ఉండాలని, అమ్మ భాషని నిర్లక్ష్యం చేయరాదని కోరారు.

# బిజెపితోనే సుస్థిర పాలన, అభివృద్ధి

- బిజెపి ఎమ్మెల్సీలు గెలుపుతో సమస్యల పరిష్కారం
- సంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పత్రి రామకృష్ణ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** భారతీయ జనతా పార్టీతోనే సుస్థిర పాలన అభివృద్ధి సాధ్యమవుతుందని సంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, పేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు.. శుక్రవారం పెద్ద శంకరంపేటలో పట్టభద్రుల బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్యలను గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఎమ్మెల్సీల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజా గౌడ్ జ్ఞానేశ్వర్ మండల బిజెపి ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, బీజేవైఎం అధ్యక్షుడు బొగుడాల కృష్ణ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకోండి

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు పర్వత రెడ్డి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యల పై అవగాహన ఉన్న కూర రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట మండలంలో కూర రఘోత్తం రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎస్టియు భవనంలో విలేకరులతో మాట్లాడారు కరీంనగర్ అదిలాబాద్ మెదక్ నిజామాబాద్ ఎమ్మెల్సీ నియోజకవర్గం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గత ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీగా ఉండి ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడినవ్యక్తి రఘోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలనిఅన్నారు.శ్రీనివాస్,రామచంద్ర చారి, శ్రీనివాస్, వెంకటేష్ ఉన్నారు.

## స్వయంభు లక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం



**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీ చంద్రాయణ గుట్ట నియోజకవర్గం లోని చారిత్రాత్మకమైన శ్రీశ్రీశ్రీ స్వయంభు లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈరోజు మూడవ రోజులో భాగంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం ఆలయ కమిటీ చైర్మన్ మహేష్ గౌడ్ కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, చంద్రాయణ గుట్ట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ బోయ నాగేష్. హాజరై స్వామి వారికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు బి. వందన. విజయలక్ష్మి. శ్రీధర్. శైలేష్. మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమరయోధుల భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన కేశవ్ గౌడ్



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలోని అశ్వరావుపేట మండలంలో కొందరు స్వాతంత్ర సమరయోధుల భూములను కబ్జా చేశారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఆధార్ పార్టీ కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ కంటే కేశవ గౌడ్ కోరారు. శుక్రవారంజిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందించారు. అశ్వరావుపేట మండలంలో అధికారుల అండతోనే కొంతమంది స్వాతంత్ర సమరయోధుల భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను కొనుగోలు చేయకూడదు, అమ్మకాలు చేయకూడదు అనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి కోట్లాది రూపాయలు గడిస్తున్నారని తెలిపారు. తక్షణమే అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వినతిలో పేర్కొన్నారు. ముత్తయ్య దొర. మాధవ రావు. ప్రసాదరావు ఫకీరయ్య ఆధార్ పార్టీ నాయకులు ఉన్నారు.

## గాదె రుక్మారెడ్డి పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



**విశ్వంభర, మహబూబాబాద్:** గాదె రుక్మారెడ్డి పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు రీనాగోపీకృష్ణ, రజితామాదవ్, రజితాకృష్ణమూర్తి నిర్వహించిన ఈకార్యక్రమంలో రాష్ట్ర బీసీ నేత శంతన్ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారత్ నుండి విడిపోయిన బంగ్లాదేశ్‌లో అక్కడి మాతృభాష అయిన బెంగాలీలోనే పరిపాలన సాగాలని ఉద్యమం సాగిందన్నారు. మాతృభాషను రక్షించుకునే క్రమంలో వేలాదిమంది మరణించారని పేర్కొన్నారు. ఆ సంఘటన ఫలితంగానే 1999, ఫిబ్రవరి 21వ. తేదీని యునెస్కో అంతర్జాతీయ భాషాదినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఫలితంగా ప్రపంచంలోని ప్రతి దేశం, ప్రతి ప్రాంతం ఆయా సంస్కృతులు సంప్రదాయాలను పరిరక్షించుకుకోవడంతో తమ మాతృ భాష గొప్పదనాన్ని గుర్తు చేసుకుంటాయన్నారు. ఇంకా ఈకార్యక్రమంలో సన్మాన గ్రహీతలు సరోజినీ దేవి, సరస్వతి, శిరీష, మమతతో పాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్స్‌లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి




**విశ్వంభర, బషీర్‌బాగ్:** విద్యుత్తు శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్ లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ ఈశ్వర్ రావు డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో 20 వేల మంది వరకు పనిచేస్తున్న ఆర్టిజన్స్‌లను జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్స్‌గా కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 20న చేపట్టిన ఛలో విద్యుత్ సౌధను ప్రభుత్వం పోలీసులతో నిర్బంధించి అరెస్టులు చేశారని ఆరోపించారు. ఆర్టిజన్స్ లను కన్వర్షన్ చేయడం వల్ల ఎలాంటి ఆర్థిక భారం ప్రభుత్వంపై పడదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వ తరహాలో వ్యవహరించడం సరికాదన్నారు. ఛలో విద్యుత్ సౌధలో పాల్గొన్న ఉద్యోగులను, విధుల్లోకి తీసుకోడం లేదని, ప్రభుత్వం తన వైఖరి మార్చుకోక పోతే 20 వేల మంది ఆర్టిజన్స్ విధులు బహిష్కరించి రోడ్డెక్కుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎంఏ.వజీర్, కో-చైర్మన్లు వి.నరేందర్, సీహెచ్.ఎల్లయ్య, జి.నాగరాజ్, జి.అరవింద్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎస్.చంద్రారెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీలు ఎస్.సదానందం, పి.కోటి గౌడ్, సలీం పాషా, మీడియా ఇంచార్జి ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్గానిక్ కెమిస్ట్రీ పాత్రపై గీతంలో చర్చాగోష్ఠి

పాల్గొన్న ప్రముఖ వక్తలు ప్రొఫెసర్ జెరోమ్ లాకోర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రదీప్ కుమార్, ప్రొఫెసర్ శ్రీనివాసరావు



**విశ్వంభర, సంగారెడ్డి జిల్లా:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'వైద్య పదార్థాలు: సేంద్రీయ రసాయన శాస్త్ర పాత్ర' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో దేశ, విదేశీ ప్రముఖ వక్తలు పాల్గొన్నారు. వారకా సైంటిఫిక్స్ సహ-సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, స్విట్జర్లాండ్ లోని జెనీవా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ జెరోమ్ లాకోర్‌బీ డీఎస్టీ-సెర్బ్ పూర్వ కార్యదర్శి, జేసీ బోస్ నేషనల్ ఫెలో డాక్టర్ ఎస్. చంద్రశేఖర్‌బీ మోరెపెన్ ప్రొప్రైటరీ డ్రగ్ రీసెర్చ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్ కుమార్ సస్మల్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ ఔషధ పురోగతికి పునాదిగా ఎలా పనిచేస్తుందనే దానిపైవారు లోతైన అవగాహనను కల్పించారు. వైద్యంలో ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రాథమిక పాత్రను, కొత్త ఔషధాలను రూపొందించడంలో, సంశ్లేషణ చేయడంలో దాని ప్రాముఖ్యతను వారు నొక్కిచెప్పారు. ఔషధ ఆవిష్కరణలో సేంద్రీయ రసాయనశాస్త్రం అనివార్య పాత్ర ఈచర్చాగోష్ఠిలోని ఒక విష యం. ఔషధ ఆవిష్కర ణను నడిపించే అధునా సింథటిక్‌పద్ధతులపై నిపుణులు వివరించారు.

# గంగపుత్ర సంఘం నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించిన

ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం వారి నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ 'మెట్టు సాయికుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ విగ్రహ రూపకర్త, జేఎన్టి యూ ఫైన్ ఆర్ట్స్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ తోపారపు గంగాధర్ లతో కలిసి టీఆర్ జీఎస్ వారి డైరీని ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. గంగపుత్రులు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. అందుకు తాము ఎల్లవేళలా కృషి చేస్తామని అన్నారు. పలు సమస్యలను తమ ముందుకు తీసుకొచ్చినప్పుడు ఖచ్చితంగా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయడానికి తామెప్పుడు సిద్ధమని అన్నారు. గంగపుత్రులు ఐక్యతతో ముందుకు సాగాలి గానీ పార్టీల విబేధాలతో చిచ్చులు పెట్టుకోవద్దని సూచించారు. పలు రంగాలలో రాణిస్తున్న గంగపుత్రులు కూడా ముందుకు వచ్చి తోటి గంగపుత్రులతో మమేకమై జాతి మనుగడకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్



**విశ్వంభర, హైదరాబాదు :** కేంద్ర ప్రభుత్వం 2024, నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విదానం (ఎన్పీఎఫ్ఎం) ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. ఆర్ టి సి క్రాస్ రోడ్ లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, అరిబండి ప్రసాదరావు, నున్నా నాగేశ్వరరావు, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, జయరాజు,శివ లతో కలిసి ఫిబ్రవరి 22 నుండి 28 వరకు నిర్వహించే ప్రచార క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సాగర్ మాట్లాడుతూ ఈ ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలను మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉంది. ఇది రైతుల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన విధానం. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 10జిపిఎ సాధనకు పాటుపడాలి

- వైద్య సిబ్బంది గైర్హాజర్‌పై అసహనం
- ఇనుగుర్తి గురుకులం, పిహెచ్సిని తనిఖీ చేసిన కలెక్టర్



**విశ్వంభర, ఇనుగుర్తి:** 10వ తరగతిలో విద్యార్థులందరూ 10 జిపిఎ సాధించడానికి సమగ్ర వ్యూహాలను రూపొందించుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా పాలనాధికారి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరచూ ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించాలన్నారు.తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. మరుగుదొడ్లు పరిశీలించి,చుట్టూ పరిసరాల పరిశుభ్రత మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు.పీహెచ్సీ పరిశీలించి వైద్య సిబ్బంది గైర్హాజర పట్ల అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.ప్రజలకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూచనలు అందించారు. ప్రాథమిక పరీక్ష, ల్యాబ్ ను పరిశీలించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా జాగ్రత్త పడాలన్నారు.ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీనాథ్, ఆర్ఐ నరసింహారావు, ప్రిన్సిపాల్ జయశ్రీ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించిన సీఈఓ



**విశ్వంభర, కరీంనగర్:** పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను, పోలీస్ కమిషనర్లను, ఎస్పీలను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి గ్రాడ్యుయేట్ , టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల పై జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలింగ్ సమీ పిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా గట్టి నిఘా పెట్టాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబం ధనలను జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేయాలని, డబ్బు, మద్యం, ఇతర ఆభరణాలు పరికరాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంతో ఎప్పటికప్పుడు దాడుల నిర్వహిస్తూ వీటిని నిరోధించాలని అధికారులకు తెలిపారు.

## బీజేపీలో భారీ చేరికలు

బీజేపీలో చేరిన దమ్మూర్ మాజీ ఉప సర్పంచ్ రాజబాబు



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి జిల్లా:** పలిమెల మండలం దమ్మూరు, నీలంపల్లి, ముకునూరు గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ మండల అధ్యక్షులు జనగామ ప్రభాకర్ అద్వర్యంలో కేంద్రం హోమ్ శాఖ సహాయక మంత్రి బండి సంజయ్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపెల్లి వెంకటరమణారెడ్డి, మంథని ఇన్‌ఛార్జ్ చందుపట్ల సునీల్ రెడ్డి చేతుల మీదుగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్ రెడ్డి, నారాయణ రెడ్డి, సంపత్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నిరంజన్, బాలు, రాజబాబు, వేణు, సదవలి, శ్రీదర్, సంతోష్, సారయ్య, వెంకటేష్, కిషోర్ ఈకార్యక్రమంలో హాజరయ్యారు.

## అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం పట్టణంలోని గోల్డ్ స్మిత్ కాలనీలో మహాజన మహిళా సమైక్య ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత మాట్లాడుతూ, వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ (ఎస్సీ కమ్యూనిటీ హాల్) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఆయన వ్యాఖ్యానిస్తూ, సంవత్సరాలుగా అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులు జాప్యానికి గురవుతున్నాయి. ప్రభుత్వాలు, మంత్రులు, కలెక్టర్లు మారినా ఈ భవన నిర్మాణానికి గతి పడడం లేదు. వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద ప్రజలకు ఉపయోగపడే ఈ భవన నిర్మాణం ఇంకా పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాకపోవడం దురదృష్టకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత




**విశ్వంభర, రామన్నపేట:** నీర్నెముల గ్రామానికి చెందిన నోముల స్వామి ఇటీవల మరణించగా నీర్నెముల గ్రామానికి చెందిన గల్లీ బాయ్స్ యూత్ సభ్యులు 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వీరేశం



**విశ్వంభర, రామన్నపేట:** రంగమ్మగుడెం గ్రామానికి చెందిన సూదగాని బాలయ్య కుమార్తె వివాహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వసతి గృహం తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**విశ్వంభర,మహబూబాబాద్:** శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, బయ్యారం మండలంలోని నామాలపాడులో ఉన్న ఏకలవ్య (ఈఎంఆర్ఎస్) పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని తరగతి గదులను, డైనింగ్ హాల్‌ను, కిచెన్ రూమ్,స్టడీ రూమ్, పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనాలు అందించాలని, షెడ్యూలు ప్రకారము వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధనలు అందించాలని అన్నారు. వసతి గృహంలో అందుతున్న సేవలపై విద్యార్థిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి: ఎస్ ఈ మాధవరెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని సూపరిండెంట్ ఇంజనీర్ చంగారి మాధవరెడ్డి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ విద్యుత్ బకాయిలు వసూళ్లలో భాగంగా శుక్రవారం సరూర్నగర్ విద్యుత్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్పేట సెక్షన్ గౌరెల్లి గ్రామంలో డి - లిస్ట్ ఆపరేటింగ్ చేయడం జరిగింది. బకాయిలు ఉన్న సర్వీస్ కనెక్షన్‌లను నిలిపి వేశామని, యజమానులను బకాయిలు మొత్తాన్ని చెల్లించి తమ సర్వీస్‌ను పునరుద్ధరించుకోవాల్సినదిగా కోరారు. విద్యుత్తు బిల్లులు పెండింగ్‌లో వున్న వినియోగదారులు తొలగించిన తమ సర్వీసును బకాయిలు చెల్లించకుండా స్వయంగా పునరుద్ధరించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించడం జరిగింది. వినియోగదారు లందరూ గ్రహించి వారి యొక్క విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించివిద్యుత్ సంస్థకు సహకరించవలసిన విజ్ఞప్తి చేయడం జరిగింది. డివిజనల్ ఇంజనీర్ కేకే కృష్ణ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ పాల్గొన్నారు.

## ఎస్వీ కృష్ణ ప్రసాద్‌ని పరామర్శించిన మంత్రి తుమ్మల




**విశ్వంభర, ఎల్బీనగర్:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్వి కృష్ణ ప్రసాద్ అనారోగ్యానికి గురై ఇటీవలే స్టంట్ వేయించుకున్నాడు. విషయం తెలియడంతో గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఎస్వి కృష్ణ ప్రసాద్ పరామర్శించాడు. మంత్రి వెంట తెలంగాణ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ నాయకుడు సుధీర్ బాబు పాల్గొన్నారు.

## సాయిబాబా దేవాలయంలో దివ్యాంగుల వివాహం



**విశ్వంభర, ఎల్బీనగర్:** దిల్ సుక్ నగర్ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యములో వలాద్రి శ్రీనివాస్ రెడ్డి, శ్రావ్య (పారిజాతం) దివ్యాంగుల వివాహము ఘనంగా నిర్వహించారు. సంస్థాన్ ట్రస్ట్ మాజీ అధ్యక్షులు జి.మల్లయ్య తన స్వంత ఖర్చులతో నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు మంగళ సూత్రములు, పూల దండలు ఏర్పాటు చేసినారు. దివ్యాంగులకు ఎటువంటి సహాయ సహకారములు అవసరమైనా అందజేయుటకు, వివాహములు ఉచితముగా నిర్వహించుటకు సంస్థాన్ ట్రస్ట్ ఎప్పుడూ ముందు ఉంటుందని వారిరువురు తెలిపారు.సంస్థాన్ ట్రస్ట్ అధ్యక్షులు బి.విశ్యామ్ కుమార్, సంస్థాన్ ట్రస్ట్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ శ్రీ వనం యాదయ్య పాల్గొన్నారు.

## చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు



**విశ్వంబర ,సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. అధ్యక్షుడిగా ఎం.ఇంద్రసేనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా భాగ్యవతి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సురేష్ రెడ్డి, సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా లావణ్య, ట్రెజరర్ గా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేష్, ఈసీ మెంబర్లుగా చంద్రకళ, కోక్య నాయక్, సుబ్రహ్మణ్య శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

**అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా పలకపై అమ్మలాంటి తెలుగుభాష అంటూ శుభాకాంక్షలు తెలియజేస్తున్న చిన్నారి అద్వైత సూర్య విశ్వంభర, ఎల్బీనగర్**



## హోర్డింగ్స్ వ్యాపారస్తుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా



**విశ్వంభర, ఎల్బీనగర్:** హోర్డింగ్స్ వ్యాపారస్తుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. నగర శివారు మున్సిపాలిటీలలో ఇటీవల హైడ్రా అధికారులు హోర్డింగ్స్ తొలగింపు నేపథ్యంలో హోర్డింగ్స్ వ్యాపారస్తులు శుక్రవారం మధుయాష్కిగౌడ్ ని కలిసి తమ సమస్యను వివరించారు. ఆయన మాట్లాడుతూ హోర్డింగ్స్ వ్యాపారస్తుల సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు మాట్లాడుతూ అడ్వర్టైజ్మెంట్ హోర్డింగ్స్ తొలగింపుతో తాము రోడ్డున పడుతున్నామని, ప్రభుత్వంతో మాట్లాడి తమ ఇబ్బందులను తొలగించాలన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలలోనూ స్వయం ఉపాధిలో భాగంగా గత 20 ఏళ్లకు పైగా తాము అడ్వర్టైజ్మెంట్ హోర్డింగు వ్యాపారము నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి అన్ని విధాలుగా ట్యాక్స్ చెల్లిస్తున్నామన్నారు. ఈ వ్యాపారంపై ప్రత్యక్షంగా పరోక్షంగా దాదాపు 10 వేల మంది వరకు ఆధారపడ్డామని పేర్కొన్నారు. అయితే గత గత ప్రభుత్వం మమ్మల్ని చాలా ఇబ్బందులకు గురి చేసిందని, జి హెచ్ ఎం సి పరిధిలో ఒక్కసారిగా హోల్డింగ్స్ ను తొలగించడంతో తామంతా రోడ్డున పడ్డామన్నారు. దీంతో శివారు మున్సిపాలిటీలు, జిల్లాలకు మా హోల్డింగ్స్ ను తరలించామన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొస్తామని చెప్పి.. సిడిఎంఎ ఆన్లైన్ పోర్టల్ ను నిలిపివేయడంతో.. హోర్డింగ్స్‌కు అనుమతి తీసుకోవడం, టాక్స్ కట్టుకోవడం వీలు కాలేదన్నారు. ఈ క్రమంలో 2024- 25 సంవత్సర టాక్స్ కట్టలేక పోయామన్నారు. కానీ ఇటీవల హైడ్రా అధికారులు తమ హోర్డింగ్స్ తొలగించడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాక్స్ చెల్లిస్తామని అనుమతులు ఇవ్వాలని చెప్పినా వినకుండా హోర్డింగ్స్ ను తొలగిస్తుండడంతో తాము రోడ్డున పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వందల హోర్డింగ్స్ ను తొలగించి తమను ఇబ్బందులకు గురిచేసారని పేర్కొన్నారు. కానీ కొత్తగా పెద్ద పెద్ద కంపెనీలకు అనుమతులు ఇస్తూ తమలాంటి చిన్న వ్యాపారస్తులను రోడ్డున పడేయడం సబబు కాదన్నారు.

## వికలాంగుల హామీల అమలు కోసం ఉద్యమం



**విశ్వంభర, రామన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం, స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంతో పాటు వెల్లంకి గ్రామంలో ఎన్.పి.ఆర్.డి 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎన్.పి.ఆర్.డి రాష్ట్ర ఉపాధ్యక్షులు వనం ఉపేందర్ మాట్లాడుతూ జాలి, దయ, కరుణ మాకొద్దు, మా హక్కులు మాకు కావాలి అంటూ దేశ వ్యాప్తంగా వికలాంగులను ఐక్యం చేయడానికి 2010 ఫిబ్రవరి 21-22 తేదీల్లో ఎల్.పి.ఆర్.డి కలకత్తా పట్టణంలో ఏర్పడిందని, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం వికలాంగులను సమీకరించి పోరాటాలు చేస్తుందని అన్నారు. పార్లమెంట్ వేదికగా వికలాంగుల సమస్యలను చర్చించి అనేక సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేసిందని అన్నారు. 2016 ఆర్.పీ.డి చట్టం సాధన, అంత్యోదయ రేషన్ కార్డ్స్, రైల్వేలో సౌకర్యాలు, సామూహిక ప్రాంతాలు అవరోధ రహితంగా మార్చడం, నేషనల్ ఇన్స్టిట్యూట్ విలీనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి విజయాలు సాధించిందని అన్నారు. మహిళా వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలు చేసిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందుతున్నాయని అన్నారు. పెన్షన్ పెంపుతో పాటు స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి 5 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పరిశ్రమలలో వికలాంగులకు 5 శాతం ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.పి.ఆర్.డి రామన్నపేట మండల గౌరవ అధ్యక్షులు బొడ్డుపల్లి వెంకటేశం, మండల ఉపాధ్యక్షులు నాగు నరసింహ, మండల నాయకులు పున్న శ్రీధర్, నోముల రవి వర్మ, శివ, ఉదయ్, బీరప్ప, మల్లమ్మ, కోనూరు వెంకటేశం, కే.శీను, నరసింహ, వెల్లంకి గ్రామ నాయకులు తాటిపాముల జంగయ్య, ఆవనగంటి నాగేష్, గూని నరసింహ, జెల్లా ఉపేందర్, జెల్లా శ్రీరాములు, మూడ నరసమ్మ, మూడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య ఉందా?

# ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** త్రాగునీరు రాకపోయినా, పైప్‌లైన్ లీకేజీ ఉన్నా, ప్రజలు ఫోన్ చేసి సమస్యను నివేదిస్తే తక్షణమే పరిష్కారం చేయిస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, కానీ ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినా, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించినా, నీటి సరఫరాలో అంతరాయం కలిగినా, ప్రజలు ఇబ్బంది పడకుండా సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేకంగా 08744-241950 నెంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫోన్ ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలేష్‌ను ఆదేశించారు. అదే విధంగా, రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-4007 కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఏదైనా గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడితే స్థానిక అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని అన్నారు. మీ ఫిర్యాదు రాష్ట్ర కార్యాలయంలో రికార్డ్ అవుతుందని, అక్కడి అధికారులు సంబంధిత జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారికి తెలియజేస్తారని వివరించారు. ఆ అధికారి సంబంధిత అధికారిని క్షేత్రస్థాయికి పంపి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. సమస్య పరిష్కారమైన తర్వాత, ఆ వివరాలను జిల్లా అధికారి రాష్ట్ర కార్యాలయానికి నివేదిస్తారని, టోల్ ఫ్రీ నెంబర్ కార్యాలయం అధికారులు ఫిర్యాదుదారునికి తిరిగి ఫోన్ చేసి సమస్య పరిష్కారమైందా లేదా? అని ధృవీకరించుకుంటారని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.

## పులి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలవడం ఖాయం



**విశ్వంభర, చింతపల్లి:** బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి సమ్మిడి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చింతపల్లి మండలంలోని గోడుకొండ్ల, కుర్మేడు, కురంపల్లి, వింజమూరు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి గెలుపుకై ఎన్నికల ప్రచారం చేసారు. అనంతరం కుర్మేడు ఎక్స్ రోడ్డు వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు మార్గదర్శకం వహించే దిశగా భారతదేశాన్ని తీసుకపోతున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అన్ని ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ప్రజల ఆశీస్సులతో విజయ పథంలో నిలుస్తుందన్నారు. రాబోయే రోజుల్లో దక్షిణ భారత రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో జరుగుతున్నటువంటి మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుస్తున్నారని అన్నారు. ప్రధాన పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను పెట్టకుండా ముందే ఓటమిని అంగీకరించారన్నారు. అలాగే విజ్ఞులైన ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తు దృష్ట్యా భారతీయ జనతా పార్టీ బలపరిచిన పులి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సముద్రాల నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, దావ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఎరిగిశెట్టి అనిత, సీనియర్ నాయకులు కనిగిరి గోవర్ధన్, కుక్కడపు రామకృష్ణ, రాజేష్ సాగర్, బాల్ జంగయ్య గౌడ్, కట్ట సైదులు, గొడుగు శ్రీనివాస్ యాదవ్, బజారు మహేష్, గోవింద్ రాజు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక తోలకాలు జరుపుతున్న వారిపై కేసు నమోదు



**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని బేతాలపాడు గ్రామంలో జరిగినది. ఇకవివరాల్లోకి వెళితే చింతల తండ గ్రామానికి చెందిన భూక్య బిచ్చా కుమార్ భూక్య రాందాస్ జేసీబీని లీజుకు తీసుకొని బేతాళ పాడు పంచాయతీకి చెందిన ట్రాక్టర్ యజమానులకు ఎక్కువ మొత్తంలో డబ్బులు ఇస్తానని ఆశ చూపి ఐదు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను పంతులు తండా గ్రామ శివారులో గల పెద్ద వాగులో నుండి జేసీబీ ద్వారా ట్రాక్టర్లలో నింపుతుండగా ఒక జేసీబీ, ఐదు ట్రాక్టర్లను స్వాధీన పరుచుకుని, జెసిబి బ్రోకర్ భూక్యరాందాస్, జేసీబీ డ్రైవర్ పగడాల వేణు, ట్రాక్టర్ డ్రైవర్లైన దారావత్ రాందాస్ నునావత్ బీమా, గుగులోతు సంపత్, గుగులోతు. సక్రు, ట్రాక్టర్ యజమానులైన. బానోతు లక్ష్మణ్, బానోతు కసన, భానోత్ అనితలపై జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాదావత్ రవి కేసు నమోదు చేశారు.

## మాతృభాష వల్ల విజ్ఞానం వస్తుంది

### తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం




**విశ్వంభర, బషీర్ బాగ్:** మాతృభాష వల్ల విజ్ఞానము వస్తుందని, భాష పట్ల పూర్వికుల సంస్కృతి సంప్రదాయాలు అవగాహనకు వస్తాయని తెలంగాణ హైయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెమినార్ హాల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మాతృభాష తల్లితో సమానమని పసికందుకు తల్లి పాలు ఎంత ముఖ్యమో విద్యార్థులకు మాతృభాష అంతే అవసరమని ఆంగ్ల భాషను నేర్చుకోవాలి కానీ మన మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. ప్రపంచంలో అన్ని భాషల ఉన్న అందులో మాతృభాష గొప్పదని అన్నారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి సలహాదారులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మాట్లాడుతూ భాష సంస్కృతులు ఒక సమాజపు ఆర్థిక పురోగి పురోభివృద్ధిని ప్రభావితం చేయగలరని ఒక జాతి సాంస్కృతికంగా పురోగతి సాధించాలంటే ప్రథమ భాషే కీలక పాత్ర అని అన్నారు.

## సర్వోత్తమ్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి



**విశ్వంభర, నెల్లికుదురు:** సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు వల్లపు వెంకటేశ్వర్లు కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రం నెల్లికుదురు మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ విద్యాలయం,హై స్కూల్స్‌ను శుక్రవారం ఆయన సందర్శించి ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులను అభ్యర్థించారు. మండల బిజెపి నాయకులు వెంకటేశ్వర్లును శాలువాలతో ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షులు చందు రాజ్ కుమార్ యాదవ్,ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ నల్లని పాపారావు,చట్ల సంతోష్,ఎం.రామచంద్రు, పెరుమాండ్ల శివసాయి గౌడ్, రమేష్, సురేష్, సోమయ్య పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ ఆర్థిక విశ్లేషకుడు డాక్టర్ పాపారావు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై అదనపు పన్నుల భారాన్ని మోపుతూ, కార్పొరేట్లకు లాభాల కోసం మద్దతుగా ఉందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు డాక్టర్ పాపారావు పేర్కొన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎం.బి. నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. డాక్టర్ పాపారావు మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్ పూర్తిగా సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు ఊతమివ్వడం ద్వారా కార్మికులు, రైతులు, మధ్య తరగతి, పేద ప్రజల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోగా,నిరుద్యోగంపెరిగిపోయిందని,పేదరికం,అసమానతలతీవ్రమయ్యాయని వ్యాఖ్యానించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**విశ్వంభర, మునుగోడు:** కొంపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వయం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ముఖ్యమంత్రి, ఎంపీ, ఎంఎల్ఏ, వివిధ రకాల అధికారులుగా, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌస్ బాబా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీసేందుకు ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు.ఉపాధ్యాయులు వెంకటయ్య, శ్రీకాంత్,అన్నమేరి, మరియమ్మ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాములమ్మ, పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ, పీఎంపీ నూతన కమిటీ ఎన్నిక



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కల్వచర్ల రమేష్, ప్రదాన కార్యదర్శి మోరే సతీష్, కోశాధికారి కీర్తి శంకర్, ఉపాధ్యక్షుడు నెరెళ్ల శ్రీనివాస్, రాజు, అధికార ప్రతినిదిగా మోబిన్సన్, గౌరవ అధ్యక్షుడు బిఆర్‌చారి, సలహాదారి ఆకుల రాజయ్యతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మిడుదొడ్లరాజు, ఉపాధ్యక్షులు చింతల కుమార్ యాదవ్, దొడ్ల అశోక్ తోపాటు ఆయా గ్రామాల వైద్యులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం దేశ భద్రతకు, శాంతికి అసమాన ముప్పు

### ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఉగ్రవాదం దేశ భద్రతకు, శాంతికి అసమాన ముప్పుగా ఏర్పడిందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆందోళన వ్యక్తం చేసారు. దిల్ సుఖ్ నగర్ బాంబు పేలుళ్లు సంభవించి 12 ఏళ్ళు పూర్తైన సందర్భంగా దిల్ సుఖ్ నగర్ బాంబు పేలుళ్లు జరిగిన ప్రాంతంలో ఆమ్ ఆద్మీ పార్టీ బాంబు పేలుళ్ల మృతులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ద్వారా ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘిస్తుందని అన్నారు. భారత దేశంలో శతాబ్దాలుగా మతాల మధ్య సామరస్యంతో శాంతియుతంగా కలిసి జీవించిన సమాజం పై ఉగ్రవాదులు దాడి చేయడం దుర్మార్గమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతమైన ఉగ్రవాద నిరోధక చర్యలు చేపట్టి శాంతిని కాపాడాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు డా. లక్ష్య నాయుడు, మౌనిక, రాకేష్ రెడ్డి, రెహమాన్, కరుణాకర్, అజీమ్ బేగ్ పాల్గొన్నారు.

# కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి

**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడలో హైవే పై కంటైనర్ అతివేగంతో ఢీకొని వ్యక్తి మృతి చెందగా ఒకరికి తీవ్రగాయాలు కాగా ఒక ఆటో రెండు డీసీఎంలు ధ్వంసం అయిన సంఘటన చోటుచేసుకుంది. మిర్యాలగూడ లోని శరణ్య గ్రీన్ హెూమ్ కి చెందిన పెట్నకోటి భారతయ్య శుక్రవారం ఉదయం పని నిమిత్తం మిర్యాలగూడలో అద్దంకి నార్కట్ పల్లి హైవేపై గల నందిపహాడ్ బైపాస్ జంక్షన్ వద్ద రోడ్ దాటుతుండగా గుంటూరు వైపు నుండి హైదరాబాద్ వైపుకు వెళ్లుచున్న ఒక కంటైనర్ లారీ డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్త గా నడిపి స్కూటీ నీ ఢీకొనగా భారతయ్య తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. కంటైనర్ డ్రైవర్ అదే స్పీడ్ తో అక్కడే ఉన్న ఒక ఆటో, టీ స్టాల్ పక్కన ఆగి ఉన్న రెండు డీసీఎం వ్యాన్లను ఢీకొట్టగా ఆటోలో ఉన్న డ్రైవర్ ధనుంజయకి గాయాలు కాగా రెండు డీసీఎం వ్యాన్లులు ధ్వంసమయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్‌పైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పీఎస్ ఎస్.ఐ రాంబాబు తెలిపినారు.

# వసతి గృహాలను సందర్శించిన అధికారులు



**విశ్వంభర, నెల్లికుదురు:** మండల ఆఫీసర్స్ ప్రత్యేక అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్ కోనిచింతల రాజు, ఎంపీడీవో బాలరాజు శుక్రవారం మండల కేంద్రంలోని వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సంబంధిత బాధ్యులకు తెలిపారు. వసతి గృహాలలో పెరటి తోటల కూరగాయల పెంపకం (కిచెన్ గార్డెనింగ్) చేపట్టాలని కోరారు.ముఖ్యంగా టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం మోడల్ స్కూల్ లో ధనియాలు, మెంతులు, గోంగూర విత్తనాలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయునీలు, సిబ్బందితో కలిసి విత్తారు. ప్రిన్సిపాల్స్ సుమలత, ఉపేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రామన్నపేట పట్టణ కేంద్రంలో క్రీడాస్థలం కావాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో క్రీడాస్థలం కావాలని స్థానిక క్రీడాకారులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి కోరగా, తక్షణమే స్పందించి (లోతుకుంట) పై భాగాన ఉన్న చెట్లు, తొలగించి, ఆటస్థలం సిద్ధం చేయిస్తున్నందుకు ఎమ్మెల్యేకు క్రీడా కారులు, గ్రామ యువకులు, వారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు జెల్లా వెంకటేష్, గోదాసు పృథ్వి రాజ్, ఎండి.నసార్, పట్టణ అధ్యక్షుడు జమిరొద్దీన్, అక్రమ్, కోట సుధాకర్, గొలుసులు ప్రసాద్, కరీం తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

# విధులపట్ల అంకితభావం, సేవానిరతి అవసరం




**విశ్వంభర, ఆమనగల్లు:** విధులపట్ల అంకితభావం, సేవా నిరతితో పనిసేస్తున్న కమ్యూనిటి హెల్త్ సెంటర్ నర్సింగ్ అధికారులు అన్నారు. ఎం.ఎస్ సుచేత, మేరీరత్న, జ్యోతికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశానుసారం జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా అధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిటెండెంట్ డాక్టర్ నాగరాజుతో కలిసి కొండాపూర్‌లోని ఏరియాఆసుపత్రి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సేవలందించి నందుకు గాను వారికి అధికారులకుకు పురస్కారం, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

# సర్వోత్తమ్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి



**విశ్వంభర, నాగారం:** సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలోని నల్లగొండ -ఖమ్మం -వరంగల్ బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తము రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక భారీ మెజారిటీతో గెలిపించవలసిందిగా నాగారం బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కర్ణాకర్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు అభ్యర్థించడం జరిగింది. రాబోయే రోజులలో బీజేపీ పార్టీ బలోపేతం అవుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మండలం బీజేపీ పార్టీ అధ్యక్షుడు కుంభం కరుణాకర్, నర్సింగ వెంకన్న, సోమయ్య, అరుణ్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహెూత్సవం

### పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాదిరి పృథ్వీరాజ్



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవం భక్తిశ్రద్ధలతో కన్నులపండుగగా నిర్వహించబడింది. ఈ మహెూత్సవంలో బీఆర్ఎస్ యువ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ఆలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పృథ్వీరాజ్ ని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి. **(విశ్వంభర, హైదరాబాదు)**

# ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మచారీ తో కలిసి ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు,రవాణా, వైద్య ఆరోగ్యం,విద్యుత్,పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 20 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుండి 12 వరకు పరిక్షలు జరుగుతాయని, జిల్లాలో 9,302 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,392, రెండవ సంవత్సరం విద్యార్థులు 4,910 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి, ఇందుకోసం కస్టోడియన్ మరియు డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్‌ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు,తగిన మందులతో మెడికల్ ఆఫీసర్,ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగు నీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్పీ తిరుపతి రావు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్.డి.ఓలు కృష్ణవేణి, గణేష్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్. మదార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్, ఆర్.టి.సి అధికారి జి. శ్రీనివాస్, విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి , మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్ ఎన్. రవీందర్, పోస్టల్ అధికారి ప్రభాకర్ ఎన్.పి.డి.సి.ఎల్ అధికారులు, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు బహుజన కులాలకు పరీక్ష

### రాష్ట్ర కన్వీనర్ పుట్టం పురుషోత్తం



**విశ్వంభర,మహబూబాబాద్:** మున్నూరుకాపు సంఘం మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిదిగా విచ్చేసిన మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని, బీసీలు రాజ్యాధికారం సాధించుకోవాలంటే బహుజన కులాలు ఏకమై, చట్టసభలలో బహుజన ప్రజాప్రతినిధులసంఖ్య పెరగాలని అన్నారు. రానున్న కాలం బీసీల రాజ్యమేనని, మాజీ ఎమ్మెల్సీ ప్రస్తుత బహుజన కులాలు బహు జన ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీసీ అభ్యర్థి పూల రవీందర్ ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మరో అతిధి బీసీ ఉద్యమ కారుడు హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీసీలను గెలిపించి బడుగుల ఆత్మ గౌరవాన్ని కాపాడలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు బీసీల ఐక్యతకు పరీక్షా అని, మేధావులైన, సమాజ నిర్మాతలైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు వేసే ఓటు ద్వారా గ్రామ గ్రామాన రాష్ట్రము మొత్తం బహుజన వాదంతో మారుమ్రోగాలని అందుకు బీసీలందరూ ఏకం కావాలన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యా యులు పూల రవీందర్ గెలుపు మనబహుజనుల గెలుపుగా భావించాలని కోరారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా గోపి, జిల్లా ముఖ్య సలహాదారుడు తుంపిళ్ళ శ్రీనివాస్, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జిన్నరెడ్డి శ్రీనివాస్, జిల్లా ప్రచార కార్యదర్శి మద్దెల రమేష్, మున్నురుకాపు యువజన సంఘం అధ్యక్షుడు పిట్టల శ్రీకాంత్,మున్నురుకాపు సంఘం సీనియర్ నాయకులు పిట్టల జగన్నాథం, కొమ్ము కేశవులు , పద్మం మహేష్ , బీసీ ఉద్యమ కారుడు హిందూ బీసీ మహాసభ, రాష్ట్ర అధ్యక్షులు పర్వతం సతీష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం మున్నూరుకాపు సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా గోపి నేతృత్వంలో నాయకులు పట్టణంలోని వివిధ స్కూల్లు, కళాశాలలో అధ్యాపకులను కలసి ఫిబ్రవరి 27 న జరిగే ఖమ్మం వరంగల్ నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీరియల్ నెంబర్ 17 పూల రవీందర్ ఎదురుగా 1వ ప్రాధాన్యత ఇచ్చి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

# 12 మంది పంచాయతీ ఆఫీసర్లకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు

### కోట్లలో నిధులు ఆగం చేశారని ఆధారాలున్నాయన్న కలెక్టర్



**విశ్వంభర,నల్గొండ:** నల్గొండ జిల్లాలో 12 మంది మండల పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులిచ్చారు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి. జనరల్ ఫండ్స్ ఆగం చేశారని కలెక్టర్ త్రిపాఠి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేసేది విడిచిపెట్టి రాజకీయాలు ఎక్కువ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇంటి పన్నులు వసూలు చేసి చలాన్ కట్టకుండా కార్యదర్శులు లక్షల్లో నిధులు దుర్వినియోగం చేశారని తెలిపారు. నల్లగొండ జిల్లా మొత్తం ఇదే తంతు అంటూ తన దగ్గర ఉన్న ఆధారాలను అధికారులకు చూపించారు జిల్లా కలెక్టర్. ఇంటి పన్ను, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ పంపులు, వ్యాపార సంస్థలు, కళ్యాణ లక్ష్మి, హౌస్ రిజిస్ట్రేషన్, వెంచర్లు పై ప్రభుత్వానికి రావలసిన చలాన్లను కట్టకుండా అక్రమాలు జరిగాయి అని మండిపడ్డారు. డబల్ రసీదు పుస్తకాలతో అక్రమాలు జరిగినట్లు తన దగ్గర ఆధారాలున్నాయన్నారు కలెక్టర్. మండల పంచాయతీ అధికారులు సరైన మానిటరింగ్ చేయకపోవడంతో ఆన్లైన్‌లో తక్కువ చూపించి ఆఫ్లైన్ లో ఎక్కువ వసూలు చేసి అధికారులను తప్పుదోవ పట్టించారని చెప్పారు కలెక్టర్ ఇలా త్రిపాఠి. పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ అను మతి లేకుండా ఒక్కొక్క గ్రామ పంచాయతీలో 10లక్షల నుండి 15లక్షల వరకు ఎంబి రికార్డ్ ఎలాచేశారని ప్రశ్నించారు. నల్గొండ జిల్లాలో 868 గ్రామ పంచాయతీలను 20 శాతం హౌస్ టాక్స్ కూడా చేయలేదని డమ్మీ రికార్డులతో సొంతానికి డబ్బులు వాడుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు కలెక్టర్. ఇసుక, మైనింగ్ ఉన్న గ్రామపంచాయతీలో అక్రమాలు ఎక్కువ జరిగినట్లు అనుమానించారు. ఇలా త్రిపాఠి అధికా రులపై ఫైర్ కావడంతో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు అలర్ట్ అయ్యారు.

# శ్రీ సంతోషిమాత దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు



**విశ్వంభర, సూర్యాపేట:** అడిగిన వెంటనే కోర్కెలు తీర్చే ఆ బోలా శంకరుడు శ్రీ సత్య సాంబ శివ స్వామి మహాశివరాత్రి వేడుకలు ఈనెల 24 నుండి 27 వరకు నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు సంతోషిమాత దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ తెలిపారు. శుక్రవారం సూర్యాపేట శ్రీ సంతోషిమాత దేవాలయ ఆధ్యాత్మిక గ్రంథాలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకల ప్రచార కరపత్రాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఈ నెల 24 సోమవారం ఉదయం 10:15 నిమిషాలకు కలశ స్థాపనతో ప్రారంభమై ఉదయం, సాయంత్రం రుద్రహెూమం ఈనెల 25 మంగళవారం ఉదయం, సాయంత్రం రుద్ర హెూమం 26 బుధవారం మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున 6 గంటల నుండి 12 గంటల వరకు శ్రీ సత్య సాంబ శివ స్వామికి పంచామృతల తో అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులే స్వయంగా స్వామివారి గర్భగుడిలోకి ప్రవేశించి వారి స్వహస్తాలతో అభిషేకం చేసుకోవచ్చని తెలిపారు. శివరాత్రి సందర్భంగా రుద్ర హెూమం, మారేడు దళ అర్చన, మహాలింగార్చన శివలింగాకృతిలో దీపోత్సవం, లింగోద్భవ కాల అభిషేకం, ఎదుర్కోళ్ళు, శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 గురువారం ఉదయం 9 గంటలకు అన్నాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి ఒకటి నుండి మూడు వరకు సంతోషిమాత దేవాలయంలో నూతన జీవద్వజ పునర్ ప్రతిష్ట కార్యక్రమం కూడా అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్ట కార్యక్రమానికి పుష్పగిరి పీఠాధిపతి అభినవోదండ విద్యా భారతి స్వామి కర కమలములచే ప్రతిష్టా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భక్తులందరూ పాల్గొని స్వామి అమ్మవారుల ఆశీస్సులు పొందాలని తెలిపారు. దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ, కమిటీ సభ్యులు కొత్త మల్లికార్జున్, తాళ్లపల్లి రామయ్య, బెలిదే అశోక్, బ్రాహ్మండ్లపల్లి మనోహర్ గుప్త, యామా వెంకటేశ్వర్లు, దేవరశెట్టి సోమయ్య, పూస నాగయ్య, భక్తులు బొమ్మిడి పద్మ, బచ్చు నీరజ, చాపల శైలజ, నిమ్మల రేణుక, ఓరుగంటి జగదీశ్వరి, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

# బెల్లం, పటిక పోలీసులు పట్టివేత



**విశ్వంభర, నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో ఎస్ఐ చిర్ర రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీ సులు సారాయికి ఉపయోగించే నల్ల బెల్లం పటిక శుక్రవారం పట్టుకు న్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు మండలంలోని రావిరాల వద్ద కారును పట్టుకొని పరిశీలించగా 10 బస్తాలనల్ల బెల్లం, 2 బస్తాల పటిక లభ్యమైంది. దీనిని రాయపర్తి మండలం గుప్పడి తం డాకు చెందిన గుగులోతు జాను, మల్లం పల్లి గుర్తూరు తండకు చెందిన గుగు లోతు పవన్, మండలంలోని జామ తాం డకు చెందిన గుగులోతు నగేష్, వస్రాం తండాకు చెందిన గుగులోతు రవిలు తమతమ ఇళ్ళలోకి తీసుకురా వాలని కోరడంతో వారు తరలిస్తున్నారు. కాగా బెల్లం పటిక విలువ రూ.70,000 ఉంటుందని ఎస్ఐ వెల్లడించారు.

# కష్టజీవుల ముద్దుబిడ్డ పువ్వాడ ఉదయ్ కుమార్

### ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దాం



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** కష్టజీవుల ముద్దుబిడ్డ, పేదల పెన్నిధి, నిస్వార్థ కమ్యూనిస్టు నేత పువ్వాడ ఉదయ్ కుమార్ అని సీపీఐ పట్టణ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మారెడ్డి శివాజీ అధ్యక్షతన పువ్వాడ ఉదయ్ కుమార్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఏపూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కష్టజీవులకు అండగా ఉంటూ, పేదల గుడిసెల్లో ఒకటిగా మెలుగుతూ, శ్రమజీవుల తోబుట్టువుగా పువ్వాడ ఉదయ్ కుమార్ పేరు తెచ్చుకున్నారని అన్నారు. అనుక్షణం పేదల సంక్షేమాన్ని కోరుతూ, వారి హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఉదయ్ భౌతికంగా లేకున్నప్పటికీ, పేదల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఓ పోరాట యోధుడిని కోల్పోవడం బాధాకరమైనప్పటికీ, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కంభం మెట్టు శ్రీనివాస్, రామరాజు, కుమారిపాల్గొన్నారు.

# దేవాలయ పాకశాల నిర్మాణానికి భూమి పూజ



**విశ్వంభర, నాగారం:** సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫనిగిరి గ్రామంలో తెలంగాణ రాష్ట్రంలో రెండో భద్రాద్రిగా కొలువైన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో దేవాదాయ/ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గుట్ట (కోవెల) వద్ద పాకశాల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. దేవాలయ పాకశాల పున: నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సీతారామచంద్రస్వామి వారి కృపకు ప్రాప్తులు కాగలరు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం/ ధర్మాదాయ శాఖ ఛైర్మన్ గట్టు లక్ష్మి నరసింహారావు, దేవాలయ ఆచార్యులు కూరేశం సంతోష్ కుమార్, ధర్మకర్తలు కల్లెట్లపెల్లి సోమయ్య, దాసరి నాగమణి, ఆకుల శంకరయ్య, వేముల యాదగిరి, మామిడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25న సీపీఐ శత జయంతి ఉత్సవాలు

**విశ్వంభర, మహేశ్వరం:** సీపీఐ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఫిబ్రవరి 25న మహేశ్వరం మండలం తుక్కుగూడ లక్ష్మీ గార్డెన్‌లో జిల్లాస్థాయి సెమినార్ నిర్వహిస్తున్నా మని సీపీఐ మండలం నాయకులు తెలిపారు. ఏర్పాట్లను పర్యవేక్షించడం కోసం అలాగే ఆ సెమినార్ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని కోసం ఫిబ్రవరి 22న శనివారం మధ్యాహ్నం 1:00 గంటలకు తుక్కుగూడ లక్ష్మీ గార్డెన్‌లో ప్రెస్ మీట్ విలేకరుల సమావేశం తెలియజేస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమా కుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు పాల్గొంటారని అన్నారు. అందరూ పాల్గొనాలని వారు కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు



**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెజస్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ సన్ ప్రిత్ సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ జారీ, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు, వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదీర్ఘంగా చర్చించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు 23 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణ అందించామని అన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను నేరుగా నల్గొండ తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు. పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు రిపోర్ట్ అందించేలా వ్యవస్థ సిద్ధం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ సన్ ప్రిత్ సింగ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో అధనపు కలేక్టర్ పి.రాంబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, కలెక్టరేట్ ఎన్నికల డీటీ వేణు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు విలన్ మందకృష్ణ మాదిగనే: డాక్టర్ పిడమర్తి రవి




**విశ్వంభర, ఖమ్మం:** ఎస్సీ వర్గీకరణకి ప్రధాన విలన్ వర్గీకరణ ఉద్యమాన్ని ప్రారంభించిన మందకృష్ణ మాదిగ అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను ప్రారంభించిన ఉద్యమం విజయతీరాలకు చేరకుండా అడ్డుకుంటున్న ఏకైక నాయకుడు మందకృష్ణ మాదిగ అని అన్నారు. పాము తాను పెట్టిన గుడ్లు తానే తిన్నట్లు తాను ప్రారంభించిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమ ఫలాలు మాదిగ జాతికి దక్కకుండా అడుగడుగునా అడ్డుపడి వర్గీకరణ కాకుండా కృష్ణా మాదిగ అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ చేయడం మందకృష్ణ మాదిగకు ఇష్టం లేదు. అదే విధంగా బీజేపీ పార్టీకి ఇష్టం లేదు అని అన్నారు. బీజేపీ మందకృష్ణ మాదిగ ఆడుతున్న డ్రామాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో అమలు పరచడంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని ఎస్సీ వర్గీకరణ అమలుకు మాదిగలు అంతా కాంగ్రెస్ పార్టీ వైపు వస్తున్నారని అన్నారు. బీజేపీ కుట్రలో భాగంగా మందకృష్ణ మాదిగ అడుగడుగునా వర్గీకరణ అమలు కాకుండా అడ్డుకుంటున్నారని తెలంగాణ ప్రజలు సరైన సమయంలో మందకృష్ణ మాదిగ కు బీజేపీకి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాలపైగా ఉద్యమంలో ఏనాడు 12 శాతం రిజర్వేషన్ అనలేదని ఈరోజు వర్గీకరణ అమలు తర్వాత 12 శాతం రిజర్వేషన్ కావాలని కొత్త నాటకానికి తెరలేపారని అన్నారు. 9 శాతం రిజర్వేషన్ తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడాన్ని మాదిగ సమాజం మొత్తం స్వాగతిస్తుందని అన్నారు.

## పెద్దగట్టులో విధులు నిర్వర్తించిన సిబ్బందికి అభినందనలు

జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**విశ్వంభర, సూర్యాపేట:** దురాజుపల్లి పెద్దగట్టు శ్రీ లింగమంతుల స్వామి జాతర ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపినారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగలేదు, ఎలాంటి అవాంచనీయ సంఘటలు, నేరాలు, ప్రమాదాలు జరగకుండా కృషి చేశాం అన్నారు. జాతరలో జిల్లా పోలీసు సిబ్బంది ముందస్తు ప్రణాలికతో పని చేశారని అభినందించారు. సూర్యాపేట సబ్ డివిజన్ డీఎస్పీ రవి, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, స్థానిక ఎస్ఐ మహేశ్వర్ ప్రణాళిక ప్రకారం పని చేశారని అన్నారు. జిల్లా పోలీసు శాఖకు, జిల్లా యంత్రాంగానికి సహకరించిన భకులకు, ప్రజలకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపినారు. ఇలాంటి అతి పెద్ద జాతరకు పోలీసు బందోబస్తు చాల ముఖ్యం అని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మకమైన జాతర నందు ప్రభుత్వం, పోలీసు ఉన్నతాదికారుల సూచనల ప్రకారం 2,000 మంది పోలీసు సిబ్బందిచే మూడు విడతలుగా 24 గంటలు, ఐదు రోజుల పాటు బారి బందోబస్తు నిర్వహించడం జరిగిందని అన్నారు. పోలీసు శాఖ ముందస్తు చర్యలు, ప్రత్యేక ప్రణాళికతో జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు, నేరాలు, ప్రమాదాలు జరగలేదని ఎస్పీ తెలిపారు. మఫ్టీ టీమ్స్, క్రైమ్ టీమ్స్, టెక్నికల్ టీమ్స్, కమ్యూనికేషన్ విభాగం, షి-టీమ్స్, స్పెషల్ పార్టీలు, డాగ్ స్కాడ్స్, బాంబ్ స్క్వాడ్స్ ప్రోటోకాల్ ప్రకారం ఈ భందోబస్త్ నందు విధులు నిర్వర్తించారు. జాతర ప్రదేశంలో పోలీస్ కంట్రోల్ రూమ్ తో పాటు పోలీసు హెల్ప్ లైన్ సెంటర్స్ ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందించాం అన్నారు. జాతర ముగిసినందున జాతీయ రహదారి 65 పై వాహనాలు ఎదావిదిగా వెళ్తాయి, మళ్ళింపులు అన్ని పునరుద్ధరించడం జరిగినది అన్నారు. వాహనదారులు వేగంగా వెళ్లకుండా నిదానంగా వెళ్ళాలని కోరారు.

## గంజాయి కలిగిన వ్యక్తి అరెస్ట్



**విశ్వంభర, మేడిపల్లి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మోహన్ రావు పేట గ్రామానికి చెందిన బాణాల రాజు గత కొంత కాలంగా గంజాయికి అలవాటు పడి, గంజాయి కొనడానికి డబ్బులు లేక అట్టి గంజాయి ద్వారానే వ్యాపారం చేస్తే అధిక మొత్తంలో లాభం పొందవచ్చు అని నిర్ణయించుకొని గత రెండు నెలల నుండి మెట్పల్లి ప్రాంతానికి చెందిన గోల్కొండ హరీష్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి మేడిపల్లి భీమారం పరిసర ప్రాంతలలో గంజాయి తాగే వ్యక్తులకు అమ్ముతున్నాడని, శుక్రవారం మేడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ బ్రిడ్జి వద్ద ఉన్నాడని నమ్మదగిన సమాచారం రాగా ఎస్ఐ జి శ్యామ్ రాజు సిబ్బందితోపాటు అట్టి ప్రదేశానికి వెళ్లి నిందితుని పట్టుకొని అతడి వద్ద నుండి రూ. 9500 ల విలువ 190 గ్రాములు గంజాయిని పట్టుకొని ఇద్దరు పంచుల సమక్షంలో గంజాయిని సీజ్ చేసి, బాణాల రాజు అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని కోరుట్ల సీఐ బి సురేష్ బాబు తెలిపారు. ఎవరైనా వ్యక్తులు గంజాయిని అక్రమంగా కలిగి ఉన్న లేదా అమ్మిన లేదా గంజాయి సేవించిన చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడునని అంతే గాక యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, పిల్లలను, వారి ప్రవర్తనను తల్లి తండ్రులు గమనిస్తూ ఉండాలని సి.ఐ బి సురేష్ బాబు కోరారు.

## ఘనంగా మాతృభాషా దినోత్సవం



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ కల్యాణ మండపంలో లలితకళా సమితి మరియు రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం కార్యక్రమంలో తెలుగు భాషా(ఉపాధ్యాయులను) పండితులను ప్రశంశా పత్రం, శాలువాలతో సత్కరించారు. భాషా పండితులు మాతృభాషా దినోత్సవాన్ని పురష్కరించుకుని కవితలను వినిపించారు. జగిత్యాల జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య కన్వీనర్ కోటగిరి వెంకటస్వామి, లలితకళా సమితి అధ్యక్షులు మట్టెల గంగాధర్, తెలుగు అకాడమీ విశ్రాంత పరిశోధన అధికారి తుల రాజేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, సీనియర్ న్యాయవాది మగ్గిడి వెంకట నర్సయ్య, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ తునికి వేణు గోపాల్, గోధూరు కళాశక్తి ప్రతినిధి, న్యాయవాది కోటగిరి చైతన్య, స్రవంతి నృత్య కళానికేతన్ అధ్యక్షులు అందె మారుతి బాపూజీ, సప్తస్వర కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యాదర్శులు పరాంకుశం నర్సయ్య, మహ్మద్ షాబీర్, గుర్రాల గంగాధర్, పలువురు భాషా పండితులు లలితకళా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## దేవాలయాలు హిందూ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలు



**విశ్వంభర, షాద్ నగర్:** దేవాలయాలు హిందూ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలని, దేవాలయాల వలన ప్రజలలో భక్తి భావం పెరుగుతుందని, భక్తి భావంతో భగవంతుని ఆరాధిస్తే మనిషి లోపల శక్తి పెరుగుతుందని, ఆ శక్తి ద్వారా అన్యాయాన్ని ఎదిరించి న్యాయం దిశ వైపు పోరాడే ప్రయత్నం జరుగుతుందని, తద్వారా సమాజంలో మంచి అనే భావన అందరిలో కలుగుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండలం గుంజల్ ఫహడ్ గ్రామంలో నూతన అభయ ఆంజనేయ స్వామి సీతారమచంద్ర స్వామి శివాలయ నవగ్రహ ధ్వజస్తంభం, నాభిశిల ప్రతిష్ట కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దేవాలయ కమిటీ ఆయనను సాదరంగా ఆహ్వానించి సన్మానం చేశారు. అనంతరము ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పురోహితుల ఆశీర్వాదాలతో తీర్థప్రసాదాలు సేవించారు. జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షులు ఎదిర రాజు, మోహన్ సింగ్ నాయక్, సుధాకరప్ప, ఇస్నాతి శ్రీనివాస్, నరేష్, భాజపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బంగారు ఆభరణాల చోరీ నిందితుని పట్టివేత

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని గాంధీ నగర్ కాలనీలో గల రొయ్యల లక్ష్మమ్మ ఇంట్లో గత నెల 30వ తేదీన 9 తులాల రెండు గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని ఆగంతకులు ఇంట్లోకి ప్రవేశించి అల్మారాను పగలగొట్టి దొంగిలించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా షాద్నగర్ ఏసీపీ రంగస్వామి ఆదేశాల మేరకు అమంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎస్ఐ ఆధ్వర్యంలో ఒక స్పెషల్ టీం ఏర్పాటు చేసి శుక్రవారం నేనావత్ చంద్రమోహన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అతను నేరం ఒప్పుకున్నాడని, అతని వద్ద నుంచి దొంగిలించబడ్డ బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని అతన్ని రిమాండ్కు తరలించామని సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఇట్టి కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ వెంకటేష్, పోలీస్‌స్టేషన్ క్రైమ్ కానిస్టేబుల్స్‌రఘునాయక్,శివలను ఆమనగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్ అభినందించారు.

## ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ: పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, దోమ:** దోమ మండల పరిధిలోని శివ రెడ్డి పల్లి గ్రామంలో శుక్రవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మొదటి ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పేదవాళ్లకు ఇల్లు నిర్మించాలనే ప్రధాన లక్ష్యంతో ఐదు లక్షల రూపాయలతో, ఎస్టీలకు 6 లక్షల రూపాయలతో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతగా ప్రతి మండలంలో ఒక గ్రామానికి పూర్తిస్థాయి లబ్ధిదారులకు ఇల్లు కట్టిస్తామని శివరెడ్డి పల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు ఇల్లు కట్టడానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించడానికి ప్రభుత్వం ఉచిత ఇసుక, సీకు, సిమెంటు, లాంటి వాటిని కూడా తక్కువ ధరకు ఇచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం 35వేల ఇండ్ల కట్టాలని లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ ఛైర్మన్ యాదవ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేందర్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాములు నాయక్, శివ కుమార్ రెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సాయం

### రూ.50 వేలు ఆర్థిక సాయం చేసిన బీఆర్ఎస్ నాయకులు



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కానుబాయ్ తండాకు చెందిన నేనావత రాజు అనిత దంపతులకు కుమార్తె ఝాన్సీ వివాహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు 50,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచు వివాహానికి బీఆర్ఎస్ నాయకులు తమ వంతు సహాయ సహకారాన్ని అందించడానికి ఎల్లవేళల ముందు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, హరిచంద్ నాయక్, డైరెక్టర్ సేవ్య, తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ బాలల వికాస కేంద్రం 16వ వార్షికోత్సవం



**విశ్వంభర, భూత్పూర్:** మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో హెచ్.బి.ఎల్ ఇంజనీరింగ్ ఐటీడీ వారి ఆధ్వర్యంలో ఘనంగా భగీరథ బాలల వికాస కేంద్రం (అంగన్వాడీ), 16వ వార్షికోత్సవ ఉత్సవాలు మహబూబ్ నగర్ జిల్లాలోని హెచ్.బి.ఎల్ కంపనీ వారు గత 16 సంవత్సరాలుగా భూత్పూర మండలం మరియు మూసాపెట్ మండలంలోని 32 అంగన్వాడీ కేంద్రాలను దత్తతు తీసుకొని, రోజు వారికి అనుసంధ పౌష్ఠిక ఆహారం(పాలు, అరటిపండు, మిల్లెట్ చిక్కి) అందిస్తున్నారు. అలాగే ప్రతి సంవత్సరం మూడు జతల యూనిఫామ్ ని అందజేస్తున్నారు. ప్రతి సంవత్సరం వార్షికోత్సవం జరిపి, విద్యార్థులకు కల్చరల్, ఫిజికల్ ఈవెంట్స్ పెట్టి వారికి భాహుమతులు ఇవ్వడం జరుగుతుంది. ఈ సారి పోతులమడుగు గ్రామంలో వార్షికోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ జరీనా బేగం, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంఈఓ ఉష రాణి, సీపీడీఓ వెంకట కమల, సూపర్‌వైజర్ వసీం సుల్తానా, విలేజ్ సెక్రటరీ కృష్ణకుమారి, గ్రామ పెద్దలు హెచ్.బి.ఎల్ కంపనీ యాజమాన్యం తరపున సీఎస్ఆర్ అసోషియేట్ విజయలక్ష్మి, హనూస్, రంగారెడ్డి, యదగిరి రెడ్డి, హెచ్.బి.ఎల్ టీచర్స్ మరియు అంగన్వాడీ టీచర్స్ పాల్గొనడం జరిగింది.

## ఘనంగా విగ్రహాల గ్రామోత్సవం



విశ్వంభర, నెల్లికుదురు: నెల్లికుదురు మండలంలోని రాజుల కొత్తపల్లి లో శ్రీ వేణుగోపాల స్వామి రుక్మిణి సత్యభామల నూతన విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా శుక్రవారం విగ్రహాల గ్రామోత్సవం గ్రామంలో భాజా భజంత్రీలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి నామస్మరణ మారుమ్రోగింది. స్వామి వారితో సహా దేవతామూర్తులు రథారూడులై నగుమోముతో వీధి వీధినా విహరిస్తూ ఉండగా భక్తులు మంగళహారతులు పూజా ద్రవ్యాలతో ఘన స్వాగతం పలుకుతూ పరవశించిపోయారు. అంతకుమునుపు తోరణాలంకరణ, గోపూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, పంచగ్రవ్యప్రాసనం, రుత్వికుల దీక్ష ధారణ పూజ, అంకురార్పణ, దేవతాపూజల, ఆవాహనం, తీర్థ ప్రసాదాల నివేదనాది క్రతవులు నిర్వహించారు.

## పిల్లల ప్లే జోన్‌ను ప్రారంబించిన సిపి అవినాష్ మహంతి




**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సైబరాబాద్ కమీషనరేట్ పరిదిలోని జీడిమెట్ల పీయస్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన పిల్లల ప్లేజోన్ (ఫీడింగ్ రూం)ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సైబరాబాద్ పరిధిలోని పియస్‌కి వచ్చే తల్లులకు, భార్యభర్తల తగాదాల్లో పియస్‌కి వచ్చే పిల్లలతో పాటు పియస్ సిబ్బంది పిల్లలకు ఈ ప్లే జోన్ ఎంతో ఉపయోగపడుతుందని వచ్చే రోజుల్లో ఇలాంటి జోన్‌లను మరిన్ని పియస్‌లో విస్తరిస్తామని అన్నారు. ఇది అందరు వినియోగించు కోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ హనుమంతరావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్.ఐలు నాయుడు, దయసాగర్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు




**విశ్వంభర, నాగారం:** తిరుమలగిరి మండల కేంద్రం అనంతారంలోని మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవ మరియు వీడ్కోలు సమావేశపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ఇట్టమల్ల శాంతయ్య హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని, అలాగే పోటీ ప్రపంచంలో విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే చదివిన చదువుకు సార్థకత ఉంటుందన్నారు. అదేవిధంగా సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ గా బాధ్యత తీసుకున్న ఐదు నెలల్లోనే పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారని, గతంలో ఎప్పుడూ ఇలా లేదని, వారి సాధ్యంలో విద్యార్థులు బాగా చదివి వారికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ పెద్దకోలా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మంచి హోదా గుర్తింపు రావాలంటే చదువే శరణ్యమని చదువే జీవితానికి మంచి విలువ అని అన్నారు. తిరుమలగిరి మండలంలో కళాశాల 2013లో స్థాపించిన నాటి నుండి నేటి వరకువిద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ఒక తిరుగులేని శక్తిగా పేరొందుతున్నదని అన్నారు.

## ఇమాంపేటలో పోస్టల్ డిపార్ట్మెంట్ మాస్ ర్యాలీ



**విశ్వంభర, సూర్యాపేట:** పోస్టల్ డిపార్ట్మెంట్ పోస్ట్ ఆఫీస్‌లో ఉన్న గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీల గురించి ఇమాంపేట గ్రామంలో ఆర్పిఎల్ఐ పీఎల్ఐ మాస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీలు వాటి యొక్క లాభాలు మరియు ఇన్సూరెన్స్ గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీలు పూర్తి గవర్నమెంట్ ద్వారా అందిస్తున్నటువంటి ప్రజలకు ఉపయోగకరమైన పాలసీలు అని వివరించారు. ఇట్టి పాలసీలో చేరిన వారికి అత్యధికమైన బోనస్ మరియు ఇన్సూరెన్స్ గవర్నమెంట్ ద్వారా కల్పించబడుతుంది. కావున ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. సూర్యాపేట తపాలా జీవిత బీమా అభివృద్ధి అధికారి జింజీరాలసైదులు, ఇమాంపేట బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వంశీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మావోయిస్టు కీలక నేత లొంగుబాటు!



**విశ్వంభర, వరంగల్ :** కేంద్ర రాష్ట్ర నిర్బంధాలు..పెరిగిన ఎన్ కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులకు వరుస దెబ్బలు తగులుతున్నాయి. వరుస ఎన్ కౌంటర్లతో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో చనిపోతుండగా..మరికొందరు లొంటుబాట పడుతున్నారు. తాజాగా మావోయిస్టు పార్టీ గొత్తికొయ ఏరియా కమిటీ సభ్యురాలు కొసా ప్రోటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా అలియాస్ జిన్నివరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయారు.లొంగుబాటుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామెడ్ మండలం, రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా బాల్యం నుంచే చైతన్య నాట్య మండలిలో పనిచేయడంతో మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులతో పరిచయాలు కావడంతో 2017లో పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ గొట్టే కమల ద్వారా మావోయిస్టు పార్టీలో చేరారు. రెండు సంవత్సరాల పాటు పున్నెం జోగ అధ్వర్యంలో చైతన్య నాట్యమండలిలో పనిచేసింది. ఇదే సంవత్సరం కేషాను పార్టీ నాయకత్వం అబుజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసి కేంద్ర కమిటీ సభ్యుడు కడారీ సత్యనారయణ రెడ్డికి ప్రోటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించింది.

2021 సంవత్సరంలో కేంద్ర మావోయిస్టు నాయకత్వం కేషాను ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించింది. 2022 డిసెంబర్ వరకు ప్రోటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసి కేషా మరో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు రమేష్‌ను (ప్రస్తుతం మహరాష్ట్ర జైలులో వున్నాడు) వివాహం చేసుకోని ఉత్తర బస్తర్ డివిజన్లో కొద్ది కాలం పనిచేసింది. అనంతరం 2024 ఎప్రిల్ మాసంలో తిరిగి కంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయన రెడ్డి అలియాస్ కొసా ప్రోటెక్షన్ గ్రూప్ మహిళా కమాండర్ బాధ్యతలు చేపట్టింది. కేషా తండ్రి హిడ్మా కూడా మావోయిస్టులలో పనిచేశాడు. ప్రస్తుతం అతను జైలులో ఉన్నాడు. పోలీసుల ఎదుట లొంగిపోయిన వంజెం కేషాపై 4 లక్షల రూపాయల ప్రభుత్వ రివార్డు వున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. పార్టీలో పనిచేసిన సమయంలో కేషా కొహిలబేడా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీ సభ్యులతో పోలీసుల బలగాలపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనతో పాటు అబుజ్‌మడ్ ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించాడు. ఈ రెండు సంఘటనల్లో వంజెం కేషా నిందితురాలుగా ఉన్నారని పోలీస్ కమిషనర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు ఆకర్షితులు కావడంతో పాటు, తాను సురక్షితంగా లొంగుబాటు అయ్యేందుకు పూర్తి సహయ సహకారాలు అందిస్తామన్న వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఇచ్చిన హామీలతో పాటు ప్రస్తుతం మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కుడా సహకరించక పోవడంతో కేషా లొంగిపోయిందని కమిషనర్ వెల్లడించారు.



## 498ఏ వరకట్న వేధింపులకు మాత్రమే పరిమితం కాదు..

**- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

**ఢిల్లీ :** ఐపీసీ 498ఏ ప్రకారం చర్యలు తీసుకోవడానికి వరకట్నం డిమాండ్ అవసరం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. భర్త క్రూరత్వాన్ని ఆరోపించడానికి వరకట్నం గురించి ప్రస్తావించాల్సిన అవసరం లేదని, హింసకు పాల్పడినా కూడా వారిపై ఈ సెక్షన్ కింద చర్యలు తీసుకోచ్చని తెలిపింది. ఐపీసీలోని సెక్షన్ 498ఎ ప్రాథమికంగా క్రూరత్వానికి సంబంధించినదని, వరకట్నం సమస్య దానిపై ఏ విధంగానూ ప్రభావం చూపబోదని స్పష్టం చేసింది. దీని అమలుకు వరకట్నం డిమాండ్ లేకపోవడం తప్పనిసరి షరతు కాదని పేర్కొంది. ఈ మేరకు వరకట్నం డిమాండ్ చేయనుందున ఓ వక్తిపై దాఖలైన సెక్షన్ 498ఏ కేసును రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలేలతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది.సెక్షన్ 498ఏ ఉద్దేశం కేవలం వరకట్నం డిమాండ్ కారణంగా జరిగే వేధింపుల నుంచి రక్షించేందుకు మాత్రమే కాదని తెలిపింది. గృహ హింస, ఇతర క్రూరమైన చర్యల నుంచి మహిళలను రక్షించడమే దీని లక్ష్యమని వెల్లడించింది. శారీరక, మానసిన హింసలు కూడా దీని పరిధిలోకి వస్తాయని వ్యాఖ్యానించింది. కాగా, ఓ వ్యక్తిపై తన భార్య సెక్షన్ 498A ప్రకారం కేసు నమోదు చేయగా ఆమెను కట్నం కోసం వేధించలేదని పేర్కొంటూ నిందితుడు ఏపీ హైకోర్టును ఆశ్రయించాడు. సెక్షన్ 498A ప్రకారం కింద నేరంగా పరిగణించబడదని పేర్కొంటూ కోర్టు కేసును రద్దు చేసింది. అనంతరం బాధితురాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ చేపట్టిన న్యాయస్థానం పై వ్యాఖ్యలు చేసింది.

## నన్ను తేలిగ్గా తీసుకోవద్దు: ఏక్‌నాథ్ శిండే



**ముంబయి :** మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో విభేదాలు తీవ్రమయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే కీలక వ్యాఖ్యలు చేశారు. తనను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న శిండే.. 2022లో ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని తాజాగా మరోసారి ప్రస్తావించారు. శిండే హయాంలో ఆమోదించిన ఓ ప్రాజెక్టును ఫడ్నవీస్ ప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో శివసేన నేత ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.''నేను ఓ సాధారణ పార్టీ కార్యకర్తను. అంతేకాదు బాలాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని. ప్రతి ఒక్కరు దీన్ని అర్థం చేసుకోవాలి. 2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్నప్పుడు.. నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టా'' అని మీడియా ముందు ఏక్‌నాథ్ శిండే పేర్కొన్నారు. అనంతరం విధానసభలో చేసిన మొదటి ప్రసంగంలో దేవేంద్ర ఫడణవీస్‌కు 200కంటే ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పానని, 232 సీట్లు వచ్చాయన్నారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని, ఇది ఎవరిని ఉద్దేశించి చెబుతున్నానో వాళ్లు అర్థం చేసుకుంటారని అన్నారు.

మహారాష్ట్రలో భాజపాశివసేనఎన్సీపీల మహాయుతి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా 132 స్థానాల్లో విజయం సాధించగా.. శివసేన 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే, కూటమిలో విభేదాలు వచ్చాయంటూ కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి.

ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమావేశాలకు డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే హాజరుకావడం లేదని సమాచారం. శిండే వర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడంతోపాటు సచివాలయంలో వైద్య సహాయ కేంద్రాలను ఇద్దరు వేర్వేరుగా ఏర్పాటు చేసుకోవడం కూడా వీరిమధ్య మరింత దూరాన్ని పెంచినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇటీవల స్పందించిన శిండే.. ముఖ్యమంత్రితో ఎటువంటి కోల్డ్ వార్ లేదని, అభివృద్ధిని అడ్డుకునే వారితోనే తన పోరాటమని చెప్పారు. తాజాగా తనను తేలిగ్గా తీసుకోవద్దంటూ ప్రత్యర్థులకు హెచ్చరికలు చేయడం గమనార్హం.

**మహిళతో మాటలు కలిపి.. హోటల్‌కి తీసుకెళ్లి..**

## సామూహిక అత్యాచారం

**బెంగళూరు:** కర్ణాటకలోని బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. కోరమంగళ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో 33 ఏళ్ల మహిళపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం జ్యోతి నివాస్ కాలేజీ జంక్షన్ వద్ద తాను వేచి ఉండగా.. దాదాపు 20 ఏళ్ల వయసు ఉన్న నలుగురు యువకులు వచ్చి తనతో మాటలు కలిపారని.. ఆ తర్వాత స్నేహంగా మెలిగి డిన్నర్‌కు ఆహ్వానించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. డిన్నర్ పూర్తయ్యాక ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి.. ఓ ప్రైవేటు హోటల్ టెర్రాస్‌పైకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం గురించి ఎవరికీ చెప్పొద్దని ఆమెను బెదిరించి.. శుక్రవారం ఉదయం 6గంటలకు విడిచిపెట్టారని పేర్కొన్నారు. ఉదయం ఇంటికి చేరుకున్నాక జరిగిన దారుణం గురించి భర్తకు వివరించగా.. పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ సారా ఫాతిమా మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 7.30 8గంటల సమయంలో ఈ ఘటనపై తమకు సమాచారం అందిందన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నలుగురు నిందితులను అరెస్టు చేసి.. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిపారు. అయితే, ఆ యువకులతో ఆమె ఎందుకు వెళ్లారనే విషయాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దిల్లీకి చెందిన ఈ మహిళ తన భర్తతో బెంగళూరులో స్థిరపడ్డారని, ఆమె క్యాటరింగ్ సర్వీసెస్‌లో పనిచేస్తుందని పోలీసులు వివరించారు. నిందితులు తమ స్నేహితుడిని కలిసేందుకు అక్కడికి వెళ్లినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అయితే, ఈ నలుగురికీ ఒకరితో మరొకరికి పరిచయం ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల్లో ముగ్గురు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా.. ఒకరు ఉత్తరాఖండ్‌కు చెందినవారిగా గుర్తించారు. వీరంతా వివిధ హోటళ్లలో చెఫ్‌లు, వెయిటర్లు, హెల్పర్లుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. యువకులు మద్యం తాగారా? అని విలేకర్లు అడగ్గా.. ఈ విషయాన్ని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రంజాన్ పండగ నేపథ్యంలో సర్కార్ కీలక నిర్ణయం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. రంజాన్ నేపథ్యంలో ఇది వరకే ముస్లింలకు సమయపాలనలో వెసులుబాటు కల్పించగా.. ఇపుడు మరో ముఖ్య నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2 నుంచి 31 వరకు షాపులను 24 గంటలు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. మేరకు రాష్ట్ర కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా సిబ్బంది ఎవరైనా రోజుకు 8 గంటలకు మించి, వారానికి 48 గంటలు మించి పని చేస్తే యజమానులు రెట్టింపు వేతనాలు ఇవ్వాల్సిందేనని ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే విధంగా సెలవు దినాల్లో పనిచేస్తే ప్రత్యామ్నాయ లీవ్ ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. కాగా రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మసీదులు, ఈద్గాల వద్ద నీటి వసతి, కరెంటు సౌకర్యం, వాష్‌రూమ్స్ సదుపాయాలు కల్పించాలని అధికారులకు తెలియజేసింది. కాగా రంజాన్ నెల పూర్తయ్యే వరకు ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే ఇళ్లకు వెళ్లిపోయేలా వెసులుబాటు కల్పిస్తూ ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది సర్కార్.

**కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

## 3 వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం



**విశ్వంభర, చండూర్ :** ఫిబ్రవరి 23 న మునుగోడు లో ని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో చండూరు మున్సిపాలిటీ ప్రజలకు 3 వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారనీ ప్రతి ఒక్కరు ఈ వైద్య శిభిరం లో పాల్గొని కంటి సమస్యలకు పరిష్కార మార్గం పొందాలని కాంగ్రెస్ నాయకులు, గాంధీజీ ఫౌండేషన్, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్, ట్రస్మా నల్గొండ జిల్లా అధ్యక్షులు డా. కోడి శ్రీనివాసులు తెలిపారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకరా కంటి ఆస్పత్రి, ఫీనిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆదివారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని అన్నారు. చండూరు మున్సిపాలిటీ నుండి పేషెంట్లను మునుగోడు వైద్య శిబిరానికి తీసుకురావడానికి రవాణా సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

## వీసా ట్రీ వరల్డ్‌ఎడ్యుకేషన్ ఫెయిర్ - 2025

**ఉన్నత చదువులు చదవాలనుకునే వారికి అద్భుత అవకాశం**




**విశ్వంభర, హైద్రాబాద్ :** వీసా ట్రీ విద్యార్థులు వివిధ దేశాల్లో టాప్ యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. ఫిబ్రవరి 22 శనివారం రోజున ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు హయత్ ప్యాలెస్ రోడ్ నెంబర్ వన్ 'బంజారాహిల్స్ లో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించుచున్నారు. ఈ కార్యక్రమంలో 100 పైగా
యూనివర్సిటీలుపాల్గొంటాయి. ఈ కార్యక్రమాన్నీ విద్యార్థులు వినియోగించుకోవాలని వీసా ట్రీ ఫౌండర్ కిరణ్ గుప్తా కోరారు .అడ్మిషన్స్ కోసం స్పాట్ అసెస్మెంట్స్, స్కాలర్ షిప్స్ మరియు లోన్ అవకాశాలు పొందవచ్చు. పార్ట్ టైం మరియు చదువు తర్వాత ఉద్యోగ సమాచారం అందిస్తారు.వివరాలకు 7997007775 సంప్రదించండి.

## భక్తజన సంద్రమైన శ్రీశైలం..

**వేలాదిగా తరలి వస్తున్న శివ స్వాములు**

**విశ్వంభర, శ్రీశైలం :** శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులే కాకుండా ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుండి కుడా వేలాదిగా తరలి వస్తున్నారు. తెల్లవారు జాము నుండి స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉండి అలంకార దర్శనాలుచేసుకుంటున్నారని ఆలయ అధికారులు తెలిపారు.అలాగే ముడుపులు చెల్లించేందుకు వస్తున్న శివ స్వాములకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి మాల విరమణ ఇరుముడి సమర్పణలు చేయిస్తున్నారు. శివదీక్షా శిబిరాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కూడా అర్చకులు దీక్షా విరమణ చేయిస్తున్నారు.యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన వసతులను దుర్వినియోగ పరచకుండా ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా ఉంచాలని ఈఓ శ్రీనివాసరావు భక్తులను కోరారు.బ్రహ్మోత్సవాలలో బాగంగా క్షేత్ర ప్రధాన ప్రాంతాలతోపాటు పాతాళగంగ వద్ద పుణ్యస్నానాల కోసం ఏర్పాటు చేసిన జల్లు స్నాన ఘట్టాలను, పార్కింగ్, ఉద్యానవనాలను ఈఓ శ్రీనివాసరావు పరిశీలించారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు నిలిపి వేసినా, యాత్రికుల శ్రేయస్సు దృష్ట్యా నది ఒడ్డున ప్రత్యేక శిక్షణ పొందిన గజీతగాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అన్నదాన భవనంలో దేవస్థానం నిర్వహించే అల్పాహార, భోజన సదుపాయాలను ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని ఈఓ శ్రీనివాసరావు కోరారు.



## కాలుష్య రహిత భారత్ కోసం వాటి ఉత్పత్తి అత్యవసరం..

**○ సింగరేణి సీఎండీ బలరామ్**



**విశ్వంభర, హైదరాబాద్ :** బ్యాటరీ వాహనాలు, సోలార్ విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలక ఖనిజాలకు అనూహ్య డిమాండ్ ఏర్పడుతోందని ఈ విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వ రంగ సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సింగరేణి సీఎండి ఎన్.బలరామ్ నాయక్‌అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో శుక్రవారం కీలక ఖనిజాలపై క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2070 నాటికి భారత్‌ను కర్బన ఉద్గార రహిత " నెట్ జీరో " దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది నెరవేరాలంటే దేశీయ ఖనిజ పరిశ్రమల వారు క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాల) ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కీలక ఖనిజాల పై పరిశోధన, అన్వేషణ, ఉత్పత్తి వంటి విషయాలలో ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం, సహకారం ఎంతో అవసరం అన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగం, సాంప్రదాయేతర ఇంధన వనరుల రంగం, విద్యుత్ వాహనాలు, రక్షణ రంగాల్లో కీలక ఖనిజాల వినియోగం ఎంతో ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఈ ఖనిజాలను విదేశాల నుంచే ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటున్నామన్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారు 30 రకాల కీలక ఖనిజాల జాబితాని విడుదల చేశారని, వీటిని దేశీయంగా ఉత్పత్తి చేయడం కోసం, తద్వారా స్వయం సమృద్ధి సాధనకు పరిశ్రమలు కృషి చేయాలని పిలుపు నిచ్చారని బలరాం నాయక్ గుర్తుచేశారు. కనుక పెద్ద ఎత్తున పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా కీలక ఖనిజాలను దేశీయంగా ఉత్పత్తి చేయటం ఎంతో అవసరమని,ఈ సవాలును ఒక అవకాశంగా దేశీయ పరిశ్రమలు తీసుకోవలసి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కూడా కీలక ఖనిజ పరిశ్రమ రంగంలోనికి అడుగుపెట్టడానికి సంసిద్ధమయిందని పేర్కొన్నారు. సింగరేణి ఇప్పటికే ఈ విషయంలో ముందడుగు వేసి, జనవరి మొదటి వారంలో ఐఐటి హైదరాబాద్ వారితో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విడుదలయ్యే ఫ్లై యాష్, క్లే, ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ నుండి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను వెలికి తీసే అంశంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇక ముందు సింగరేణి సంస్థ కేవలం బొగ్గు తవ్వకానికే పరిమితం కాకుండా కీలక ఖనిజాల అన్వేషణ , ఉత్పత్తి రంగాల్లో కూడా అడుగు పెట్టనుందని తెలియజేశారు. సంస్థ తన వ్యాపార విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నప్పటికీ కీలక ఖనిజాల విషయంలో దేశీయ స్వయంసమృద్ధికి ఇది ఉడతాభక్తిగా దోహదపడుతుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, సింగరేణి ఈడీ కోల్ మూమెంట్, జీ.ఎం కోఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షులు డాక్టర్‌చైతన్యమోయి గంగూలీ , మేనేజింగ్ డైరెక్టర్‌సందీప్ హామిల్టన్, సింగరేణి జీ.ఎం లు మనోహర్, నారాయణరావు, మిథానీ న్యూక్లియర్ ఫ్యూయల్ కార్పోరేషన్ నాయకులు వేదంతా తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం వాయిదా





**విశ్వంభర, హైదరాబాద్ :** గాంధీభవన్ లో ఈ నెల 23వ తేదీన జరుగాల్సిన తెలంగాణ పీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంవాయిదా పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం నిర్వహించాలనుకున్న టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించినట్లుగా పీసీసీ వెల్లడించింది. 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యాక తిరిగి ఈ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహిస్తామన్నదానిపై కొత్త తేదీని ప్రకటిస్తామని టీపీసీసీ పేర్కొంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్ నియామితులైన తర్వాత నిర్వహించనున్న టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం పార్టీ పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కులగణన సర్వే నివేదిక, బీసీ రిజర్వేషన్లు, అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టనుండటం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, పార్టీ సంస్థాగత నిర్మాణం, కాంగ్రెస్ ఎన్నికల హామీలు వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు నిమిత్తం ముఖ్య నాయకులంతా ప్రచార బాధ్యతల్లో ఉన్న నేపథ్యంలో టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాగా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం వాయిదా నేపథ్యంలో శుక్రవారం పీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావులు ఎమ్మెల్సీ ఎన్నికల పరిధిలోని 42అసెంబ్లీ నియోజకవర్గా ఇంచార్జిలు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ జూమ్ మీటింగ్ లో వారు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై మార్గదర్శకం చేశారు.

## ఎల్ఆర్ఎస్ పేరుతో సర్కార్ కొత్త దుకాణం..

**○ బండి సంజయ్ సెన్సేషనల్ కామెంట్స్**



**విశ్వంభర, పెద్దపల్లి :** ఎల్ఆర్ఎస్ పేరుతో తెలంగాణ సర్కార్ కొత్త దుకాణం పెట్టిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రభుత్వం రూ.50 వేల కోట్ల దోపిడీకి ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయని.. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టి ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేక పోయారని కామెంట్ చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అతి తక్కువ కాలంలోనే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న అధికార కాంగ్రెస్ పార్టీకి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో పాటు నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

హస్తం పార్టీకి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కరువయ్యారని ఎద్దేవా చేశారు. దేశంలో అధికార పార్టీకి అభ్యర్థులు కరువు అవ్వడం కేవలం తెలంగాణలోనే చూస్తున్నామని సెటైర్లు వేశారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి భయంతో పోటీ నుంచి తప్పుకుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని వర్గాలు బీజేపీవైపే ఉన్నాయని.. మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే 3 ఎమ్మెల్సీ స్థానాలను గెలుస్తామని ఆయన జోస్యం చెప్పారు. కులగణన విషయంలో కాంగ్రెస్ కొరివితో తలగొక్కుందని కామెంట్ చేశారు. ముస్లింలను తీసుకొచ్చి బీసీల్లో కలిపారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ కేటగిరి నుంచి తొలగించి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముస్లింలను తొలగిస్తేనే రిజర్వేషన్ల ఆమోదానికి ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఎంతో ఇచ్చిందని.. నిధుల విషయంలో ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని బండి సంజయ్ సవాల్ విసిరారు.

# అందుకే.. స్పిన్ ఆడటంలో కోహ్లీ ఇబ్బంది: హర్భజన్



**ముంబయి:** విరాట్ కోహ్లీ మరోసారి స్పిన్నర్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదిల్ రషీద్ బౌలింగ్‌లో ఇబ్బంది పడిన కోహ్లీ.. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లా బౌలర్ రిషద్‌కు దొరికిపోయాడు. ఆదివారం పాకిస్థాన్‌తో టీమ్ఇండియా కీలక పోరులో తలపడనుంది. అందులోనూ అబ్రార్‌తో కోహ్లీకి ముప్పు తప్పదని క్రికెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో స్పిన్‌ను ఎదుర్కోవడంలో విరాట్ ఎందుకు ఇబ్బందిపడుతున్నాడో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ విశ్లేషించాడు."స్లో బంతులు, లెగ్గీలు ఆడటం విరాట్ కాస్త అసౌకర్యంగా భావిస్తున్నాడు. లెగ్‌సైడ్ వచ్చే బంతులను ఆడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ వెళ్తే ఒత్తిడి తగ్గుతుంది. ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పుడు ఎక్కువగా సింగిల్స్‌పైనే దృష్టిపెట్టాలి. క్రీజ్‌లో కుదురుకునేందుకు సమయం తీసుకోవాలి. కానీ, విరాట్ విషయంలో ఇప్పటి వరకు అలా జరగలేదు. మనం ఎంత గొప్ప ప్లేయరైనా సరే.. మ్యాచ్‌కు వచ్చేసరికి ప్రదర్శనే కీలకం. వారసత్వం కలిసి రాదు. ఆడాలనే సంకల్పంతో ఉంటే ముందుకు సాగిపోవచ్చు. పరుగులు రాబట్టాలని గట్టిగా అనుకోవాలి. అలాగని సింగిల్స్ కూడా తీయకుండా క్రీజ్‌లో ఉండటం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు భారీ షాట్లకు వెళ్లాలనిపిస్తుంది. ఇక్కడ కోహ్లీ.. ఎవరికీ తానేంటో చూపించాల్సిన అవసరం లేదు. తన సత్తా ఏంటో అతడు నమ్మితే చాలు. ఆటను ఆస్వాదిస్తూ వెళ్తే పరుగులు వాటంతటవే వస్తాయి" అని హర్భజన్ వెల్లడించాడు. ఆ లోపాన్ని సరి చేసుకుంటే చాలు : రాబిన్ ఉతప్ప "విరాట్ కోహ్లీ గొప్ప బ్యాటర్. ఈ విషయాన్ని అతడు కూడా దృష్టిలో పెట్టుకోవాలి. నా అభిప్రాయం ప్రకారం అతడు కాస్త డైలమాలో ఉన్నాడు. ఎప్పుడైతే బంతిని బాగా మిడిల్ చేస్తాడో పరుగుల కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్ చేసే క్రమంలో స్వేచ్ఛగా ముందుకు సాగితే పరుగులు అవే వస్తాయి. కోహ్లీ సెకండ్ అండ్ థర్డ్ స్లిప్స్ మధ్య ఎక్కువగా పరుగులు రాబడతాడు. కానీ.. ఈ ఇన్నింగ్స్‌లో ఎక్కువగా కీపర్, ఫస్ట్ స్లిప్ మధ్య రన్స్ వచ్చాయి. ప్రతిసారీ ఆఫ్‌సైడ్ కవర్ డ్రైవ్ ఆడాలని ప్రయత్నించాడు. తనకు ఎంతో ఇష్టమైన షాట్ అయినప్పటికీ ఇది చాలా ప్రమాదకరం. ఈ విషయమై అతడితో ఎవరైనా చర్చిస్తారని అనుకుంటున్నా. ఈ లోపాన్ని సరిచేసుకోగలిగితే కోహ్లీ తిరిగి లయను అందుకుంటాడు" అని రాబిన్ ఉతప్ప తెలిపాడు.

# ఆ జట్టేమైనా పాకిస్థానా ఆసీసా.. 35 ఓవర్లలోనే ముగిస్తారనుకున్నా: సెహ్వాగ్



**ముంబయి:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌పై టీమ్ఇండియా విజయం సాధించింది. 229 పరుగుల లక్ష్య ఛేదనను 46.3 ఓవర్లలో పూర్తి చేసి గెలిచింది. ఒకదశలో 144/4 స్కోరుతో భారత్ ఇబ్బందుల్లో పడేలా కనిపించింది. కానీ, శతక వీరుడు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ కలిసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ సమయంలో ఏమైనా కంగారు పడ్డారా అనే ప్రశ్నకు భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. టీమ్ఇండియా ఇంకాస్త ముందుగానే టార్గెట్‌ను ఛేదిస్తుందని భావించానని.. బంగ్లాపై ఏమాత్రం కంగారు పడలేదని వ్యాఖ్యానించాడు. అలా జరగడానికి అదేమైనా పాకిస్థాన్ జట్టా లేదా ఆస్ట్రేలియానా అని పేర్కొన్నాడు. "భారత్ - బంగ్లాదేశ్ మ్యాచ్‌లో నేను ఏదశలోనూ టెన్షన్ పడలేదు. ఎందుకంటే అక్కడ ఉంది బంగ్లా. మీరు ఆ జట్టును నాతో పొగిడించుకోవాలనుకుంటున్నారా అలా జరగాలంటే అది అద్భుతమైన టీమ్‌గా మారాలి. నేను క్రికెట్ ఆడినప్పుడే బంగ్లాను చూసి ఎప్పుడూ భయపడలేదు. అలాంటిది ఇప్పుడు అసలు కంగారే లేదు. అసాధారణ ప్రదర్శన చేయడానికి అదేమైనా పాకిస్థానా.. ఆస్ట్రేలియానా మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్లను కోల్పోయినా సరే ఇబ్బందే పడలేదు. అయితే, చాలా తేలికగా విజయం సాధించాల్సిన మ్యాచ్. నాలుగు ఓవర్లు మాత్రమే మిగిలి ఉండగా.. భారత్ గెలిచింది. రోహిత్, విరాట్, శ్రేయస్‌లో ఒకరు క్రీజ్‌లో ఉండుంటే భారత్ 35 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేది" అని సెహ్వాగ్ తెలిపాడు.

**కోహ్లీ ఛేజ్ మాస్టర్...** "ప్రతి ఒక్కరి ఫేవరెట్, నాకు రోల్ మోడల్ సచిన్ తెందూల్కర్. అతడితో కలిసి మైదానంలో నడుస్తుంటే ఆ భావనే అద్భుతంగా ఉంటుంది. అడవిలోకి సింహంతో వెళ్తున్నట్లే ఉంటుంది. ప్రతి ఒక్కరి చూపు అతడిపైనే. అప్పుడు నేను నిశ్శబ్దంగా పరుగులు చేసేవాడిని. అయితే, ఛేజింగ్‌లో మాత్రం సచిన్, విరాట్‌లో ఎవరు అంటే మాత్రం నేను విరాట్‌వైపే మొగ్గు చూపిస్తా. 2011-12 నుంచి ఇప్పటి వరకు కోహ్లీ చాలా మారిపోయాడు. అతడి ఫిట్‌నెస్, నిలకడ అద్భుతం. భారత్ కోసం ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు" అని సెహ్వాగ్ తెలిపాడు.

# భారత్ - పాక్ పోరు.. ఈ ఐదు వివాదాలు తెలుసా?



**ముంబయి:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ లో భారత్ విజయంతో బోణీ కొట్టగా.. పాకిస్థాన్ ఓటమితో ఆరంభించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాక్‌కు కివీస్ చేతిలో పరాభవం ఎదురైంది. అలాగే ఓపెనర్ ఫకర్ జమాన్ గాయం కారణంగా దూరం కావడం ఆ జట్టుకు మరో దెబ్బ. ఇలాంటి పరిస్థితుల్లో టీమ్ఇండియాను ఢీకొట్టేందుకు పాక్ సిద్ధమవుతోంది. ఆదివారం భారత్ - పాక్ మ్యాచ్ జరగనుంది. దాయాదుల పోరంటే సర్వత్రా ఆసక్తి ఉంటుందని తెలుసు కదా. ఇప్పటి వరకు చాలా మ్యాచుల్లో ఇరు జట్లూ తలపడగా.. వివాదస్పదంగా మారిన సందర్భాలూ ఉన్నాయి. వాటిల్లో కొన్నింటి గురించి తెలుసుకుందాం..

**జావెద్ మియాందాద్ - కిరణ్ మోరె:**
వన్డే ప్రపంచ కప్ 1992లో భారత్ - పాకిస్థాన్ తలపడ్డాయి. వికెట్ల వెనుక టీమ్ ఇండియా కీపర్ కిరణ్ మోరె మాట్లాడు తుంటే జావెద్ మియాందాద్‌కు ఆగ్రహం వచ్చింది. కిరణ్‌తో జావెద్ ఏదో వ్యాఖ్యలు చేశాడు. ఆ తర్వాత కిరణ్ మోరెను అనుక రిస్తూ కంగారూల మాదిరి జావెద్ మియాందాద్ వ్యవహరించిన తీరుభారత సారథి అజారుద్దీన్‌కు కోపం తెప్పించింది.

**వెంకటేశ్ ప్రసాద్‌పై స్లెడ్జింగ్:**
బౌలర్‌పై స్లెడ్జింగ్ చేస్తే ఎంతటి ప్రమాదకరమో 1996 వన్డే ప్రపంచకప్‌లో పాక్‌కు తెలుసొచ్చింది. అప్పటి వరకు దూకుడుగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు తెరప డేలా చేసింది. భారత బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ బౌలింగ్‌లో పాక్ బ్యాటర్ ఆమిర్ సోహైల్ బౌండరీ కొట్టాడు. తన షాట్‌ను చూపిస్తూ వెంకటేశ్‌పై సోహైల్ స్లెడ్జింగ్ చేశాడు. బంతికే సోహైల్‌ను ఔట్ చేసిన ప్రసాద్ పాక్‌కుషాక్ ఇచ్చాడు.

**ఇంజమామ్‌ను 'ఆలూ' అంటూ:**
సాధారణంగా పాక్ మాజీ కెప్టెన్ ఇంజామమ్ ఉల్ హక్ మైదానంలో కాస్త కూల్‌గానే ఉంటాడు. అయితే, 1997లో జరిగిన ఓ మ్యాచ్ సమయంలో ఇంజా మామ్‌కు కోపం వచ్చింది. దానికి కారణం ఓ అభిమాని పదేపదే.. లావుగా ఉండే ఇంజమామ్‌ను టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్య లే. బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తుండగా.. ఆలూ అంటూ ఓ ఫ్యాన్ అరిచాడు. అదంతా మైక్రోఫోన్లలో రికార్డైంది. దీంతో వెంటనే డ్రెస్సింగ్ రూమ్ వైపు చూసి.. బ్యాట్‌ను తెప్పించాడు. ప్రేక్షకుల దిశగా చూసి ఇప్పుడు అనండంటూ బ్యాట్‌ను చూ పించాడు. సెక్యూరిటీ సిబ్బంది వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. అతడిని ఐసీసీ మందలించింది. వ్యక్తిగత దూషణలకు దిగడంతోనే అలా ప్రవర్తిం చినట్లు ఆతర్వాత ఇంజమామ్ వెల్లడించాడు.

**గంభీర్ - షాహిద్ అఫ్రిది వాగ్వాదం:**
భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ క్రికెట ర్‌గా చాలా దూకుడుగా ఉండేవాడు. పాకి స్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది ప్రవర్తనా ఇలానే ఉంటుంది. 2007లో మ్యాచ్ సమయంలో అఫ్రిది బౌలింగ్‌లో గంభీర్ బౌండరీ కొట్టాడు. దీంతో వీరిద్దరి మధ్య స్వల్పంగా మాటల యుద్ధం మొదలైంది. ఇద్దరూ వెనక్కి తగ్గకపోవడంతో వాగ్వాదం కాస్త పెద్దదిగా మారే క్రమంలో ఫీల్డ్ అంపైర్ కలగజేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. వీరిద్దరూ ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత కూడా నూ మీడియా వేదికగా చాన్నాళ్లపాటు క్రికెట్, మాటలయుద్ధంకొనసాగించడం గమనార్హం.

**అక్తర్‌కు హర్భజన్ 'సిక్స్' సంబరాలు:**
భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో కామెంటే టర్లుగా సందడి చేస్తున్నారు. వీరిద్దరూ కలిసి హాయ్ భాయ్ అంటూ వీడియోలు పెట్టారు. కానీ, క్రికెట్ ఆడే రోజుల్లో మాత్రం చాలా దూకుడుగా ఉండేవారు. అందుకు 2010 ఆసియా కప్‌లో హర్భజన్ - అక్తర్ మధ్య జరిగిన ఘటనే ఉదాహరణ. భజ్జీ బ్యాటింగ్ చేస్తుండగా అక్తర్ డాట్ బాల్స్ వేసి కట్టడి చేశాడు. ఆ సమయంలో స్లెడ్జింగ్ చేయడంతో హర్భజన్‌కు కోపం వచ్చింది. చివరి ఓవర్‌లో ఆమిర్ వేసిన బంతిని సిక్స్‌గా మలిచిన హర్భజన్ భారత్‌ను గెలిపించాడు. అక్తర్ వద్దకు వెళ్లి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవడం మొదలుపెట్టాడు. అప్పుడు అది పెద్ద హాట్ టాపిక్‌గా మారిపోయింది.

# ఆ ఇద్దరినీ కాదని.. బెస్ట్ ఫీల్డర్‌గా కేఎల్ రాహుల్



**స్క్రీన్‌పై.. బెస్ట్**

ఫీల్డర్ మెడల్‌ను ఈసారి కూడా మేనేజ్‌మెంట్ విభిన్నంగా అందించింది. కేఎల్ రాహుల్ పేరును దుబాయ్ స్టేడియంలోని స్క్రీన్‌పై ప్రదర్శించింది. ఆ తర్వాత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చేతులమీదుగా కేఎల్ రాహుల్ మెడల్‌ను అందుకొన్నాడు.

**ముంబయి:** ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్ఇండియా విజయంతో మొదలుపెట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బంగ్లాపై ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. గత వన్డే ప్రపంచకప్ సమయంలో బెస్ట్ ఫీల్డర్ మెడల్‌ను అందజేస్తూ ఓ ఆనవాయితీని బీసీసీఐ మేనేజ్‌మెంట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనూ నాణ్యమైన ఫీల్డింగ్ నైపుణ్యం ప్రదర్శించిన క్రికెటర్‌కు కోచ్ దిలీప్ మెడల్‌ను ప్రకటించారు. ఈసారి రేసులో ముగ్గురు నిలవగా.. అందులో ఒకరికి ఈ మెడల్ దక్కింది. ఆ వివరాలతో కూడిన వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. "వెల్‌డన్ బాయ్స్.. తొలి మ్యాచ్‌లో అద్భుతమైన ఫీల్డింగ్ చేశారు. డోమ్ లైట్ల వెలుతురులో క్యాచ్‌లను అందుకోవడం చాలా కష్టమే. అయితే, ప్రతి మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకుం టున్నాం. తర్వాత మ్యాచ్‌లో మరింత బలంగా మైదానంలోకి దిగుదాం. ఇక ఈ మ్యాచ్‌లో అందరూ చురుగ్గానే కదిలారు. అయితే, అతడి వద్దకు ఎప్పుడు బంతి వచ్చినా ఒడిసిపట్టుకొనే క్రికెటర్ విరాట్ కోహ్లీ. అలాగే వికెట్ల వెనక కీపింగ్ చేయడం ఎప్పుడూ సవాలే. కొత్త బంతిని అంచనా వేయడం చాలా కష్టం. లెగ్‌సైడ్ డైవింగ్ చేస్తూ అద్భుత ఫీల్డింగ్ చేసిన కేఎల్ రాహుల్ కు నా అభినందనలు. శుభ్‌మన్ గిల్ కూడా బెస్ట్ ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ ముగ్గురిలో ఈసారి కేఎల్ రాహుల్‌కు బెస్ట్ ఫీల్డర్ మెడల్ ఇస్తున్నాం" అని దిలీప్ వెల్లడించాడు.

# గిల్ సెంచరీ కోసం కేఎల్ త్యాగం.. హార్దిక్‌పై నెట్టింట ట్రోలింగ్



**ముంబయి:** ఛాంపియన్స్ ట్రోఫీలో భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ సెంచరీ సాధించాడు. బంగ్లాదేశ్‌పై లక్ష్య ఛేదనలో శతకం నమోదు చేశాడు. అటువైపు క్రీజ్‌లో కేఎల్ రాహుల్ (41*) కూడా విలువైన పరుగులు సాధించాడు. ఆఖర్లో గిల్ సెంచరీ కోసం రాహుల్ తన దూకుడును తగ్గించుకొని హాఫ్ సెంచరీని త్యాగం చేశాడు. అంతకుముందు వన్డే ప్రపంచకప్ 2023లోనూ కోహ్లీ కోసం కేఎల్ నెమ్మదిగా ఆడాడు. దీంతో గతంలో హార్దిక్‌పాండ్య వ్యవహరించిన తీరును నెట్టింట అభిమానులు గుర్తుచేస్తూ ట్రోలింగ్ మొదలుపెట్టారు. ఒకవేళ ఇదే స్థానంలో హార్దిక్ కనుక ఉండుంటే పరిస్థితి విభిన్నంగా ఉండేదని కామెంట్లు చేశారు. కేఎల్ ఈ మ్యాచ్‌లో ఔటైతే ఆ తర్వాత బ్యాటింగ్‌కు హార్దిక్‌వచ్చేవాడు. అతడైతే అవతలి బ్యాటర్ గురించి అస్సలు పట్టించుకోడని కొందరు వ్యాఖ్యానించారు. అలా అనడానికి కారణం కూడా ఉదాహరణగా చెప్పడం గమనార్హం. రెండేళ్ల కిందట (2023లో) వెస్టిండీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 159 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన టీమ్ఇండియా ఆడుతూ పాడుతూ 17.5 ఓవర్లలోనే టార్గెట్‌ను పూర్తి చేసింది. సూర్యకుమార్ యాదవ్ (83) హాఫ్ సెంచరీ సాధించగా.. తిలక్ వర్మ (49*), హార్దిక్ పాండ్య (20*) జట్టును గెలిపించారు. ఇక్కడే తిలక్ వర్మ హాఫ్ సెంచరీ కాకుండా పాండ్య సిక్స్‌తో ఇన్నింగ్స్‌ను ముగించడం అభిమానులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. అదే విమర్శలకూ దారితీసింది. ఇంకా రెండు ఓవర్ల ఆట మిగిలిఉండగానే.. ఆఖర్లో సిక్స్ కొట్టాల్సిన అవసరం లేదనే కామెంట్లు వచ్చాయి. మరోవైపు తిలక్ వర్మ హాఫ్ సెంచరీ మైలురాయి ముంగిట ఉన్నాడనేది కూడా లేకుండా హార్దిక్ సిక్స్ కొట్టడం సరైంది కాదనే వాదనా మొదలైంది. చివరి బంతికి సిక్స్ అవసరమైతే కొట్టినా ఫర్వాలేదు కానీ.. బంతులు మిగిలి ఉన్నప్పుడు స్ట్రైకింగ్ ఇస్తే బాగుండేదన్న అభిప్రాయమూ వ్యక్తమైంది. ఇప్పుడు కేఎల్ మాత్రం గిల్ కోసం స్ట్రైక్‌ను రొటేట్ చేశాడు.

# ఇంటి రుణ ఈఎంఐ చెల్లించకపోతే ఏం జరుగుతుంది?



**విశ్వంభర(బిజినెస్):** ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు కావాలని కలలు కంటారు. ఇల్లు కేవలం వసతికి మాత్రమే కాదు.. భవిష్యత్తు కోసం పెట్టుబడి కూడా. కొంత కాలం నుంచి స్థిరాస్తి ధరలు పెరగడంతో చాలామందికి ఇంటిని కొనుగోలు చేయడం కష్టంగా మారిందని చెప్పొచ్చు. ఇంటి కొనుగోలుకు పెద్ద మొత్తం అవసరం పడుతుంది కాబట్టి సాధారణంగా చాలామంది బ్యాంకు రుణాలను ఆశ్రయిస్తుంటారు. ఇంటిపై రుణం మీ కలల ఇంటికి ఆర్థిక సాయం చేయడంలో మీకు ఎంతగానో సహాయపడుతుంది. మీ అవసరాలు, బడ్జెట్‌కు సరిపోయే రీపేమెంట్ వ్యవధిని కూడా ఎంచుకోవచ్చు. అయితే, ఈ రుణంపై ఈఎంఐ చెల్లింపులు చేసే బాధ్యత ఉంటుంది. కానీ, కొంతమందికి సుదీర్ఘకాలం ఈఎంఐ చెల్లింపులను కొనసాగించడం ఇబ్బందిగా ఉండొచ్చు. ఉద్యోగ నష్టం లేదా వైద్య అత్యవసర పరిస్థితి వంటి ఊహించని పరిస్థితుల కారణంగా ఇంటి రుణ ఈఎంఐలను చెల్లించలేకపోవచ్చు. ఆ తర్వాత జరిగే పరిణామాలు ఏంటి?

**ఈఎంఐ చెల్లించకపోతే..?**
ఇంటి రుణంపై ఈఎంఐ పూర్తిగా చెల్లించకపోతే కొన్ని తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. అదే ఆలస్య చెల్లింపులైతే జరిమానా చెల్లించవలసి ఉంటుంది. సాధారణంగా ఈఎంఐ ఆలస్యానికి రుసుం ఈఎంఐ మొత్తంలో 1-2% మధ్య ఉండొచ్చు. ఆలస్యమైన లేదా చెల్లించని ప్రతి ఈఎంఐతో వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. తద్వారా రుణగ్రహీతకు రుణానికి సంబంధించిన మొత్తం ఖర్చు పెరుగుతుంది. అంతేకాకుండా రెండు కంటే ఎక్కువ ఈఎంఐ చెల్లింపులు చేయకపోతే బ్యాంకు రుణాన్ని డిఫాల్ట్‌గా ప్రకటించవచ్చు. ఈ డిఫాల్ట్.. జప్తుకు దారితీయవచ్చు. తదుపరి ఆస్తిని స్వాధీనం చేసుకుని, రుణాన్ని రికవరీ చేసుకోవడానికి విక్రయిస్తుంది. ఇంకా రుణగ్రహీత దివాలా తీసినట్లు బ్యాంకు ప్రకటిస్తే, ఇది వారి క్రెడిట్ చరిత్రలో ఏడు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ఈ కాలవ్యవధిలో రుణ సంస్థల నుంచి కొత్త రుణం లభించని పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేత ఇంటి రుణ చెల్లింపులన్నీ సకాలంలో చేయడం రుణగ్రహీతలకు చాలా ముఖ్యం.

**సిబిల్ స్కోరుపై ప్రభావం..**
సిబిల్ స్కోర్ అనేది క్రెడిట్ యోగ్యతను సూచించే మూడు అంకెల సంఖ్య. ఇది మీ క్రెడిట్ చరిత్రపై ఆధారపడి ఉంటుంది. ఇందులో మీ గత రుణాలు, తిరిగి చెల్లింపులు అన్నీ ఉంటాయి. మీరు ఆర్థికంగా విశ్వసనీయంగా ఉన్నారని రుణ సంస్థలకు చూపించడానికి మెరుగైన క్రెడిట్ స్కోరు (750-900) మధ్య ఉండడం చాలా అవసరం. ఇంటి రుణంపై ఈఎంఐ చెల్లింపును కోల్పోయినట్లయితే మీ సిబిల్ స్కోరు కూడా దెబ్బతింటుంది. దీనివల్ల మీరు క్రెడిట్‌కు యోగ్యమైనవారు కాదని బ్యాంకులు/ఆర్థిక సంస్థలు భావిస్తాయి. దీనివల్ల భవిష్యత్తులో కొత్త రుణాలకు ఆమోదం పొందడం కష్టతరం అవుతుంది. భారత్‌లోని చాలా రుణ సంస్థలు మీ రీపేమెంట్ ప్రవర్తనను ట్రాన్స్‌యూనియన్, సిబిల్, ఇతర క్రెడిట్ బ్యూరోలకు నివేదిస్తాయి. ఒక్క ఈఎంఐ చెల్లించకపోయినా అది మీ క్రెడిట్ చరిత్రలో ప్రతిబింబిస్తుంది. దీనివల్ల క్రెడిట్ స్కోరు తగ్గుతుంది. ఇంటి రుణంపై డిఫాల్ట్ చేయడం వల్ల స్కోరు 50-70 పాయింట్లు తగ్గే అవకాశం ఉంది. మీ ఇంటి రుణ దరఖాస్తులో ఎవరైనా గ్యారెంటర్ లేదా సహ-దరఖాస్తుదారుడిగా ఉంటేవారి క్రెడిట్ స్కోరు కూడా ఇదే ప్రభావానికి గురవుతుంది.

**ఈఎంఐ చెక్ బౌన్స్..**
ఇంటి రుణ ఈఎంఐ చెల్లించడానికి చెక్కు ఇచ్చినప్పుడు, చెక్‌కు సంబంధించిన బ్యాంకులో దానికి సరిపడినంత నగదు ఉండాలి. లేకపోతే చెక్ బౌన్స్ అయిపోతుంది. దీనివల్ల చెక్ బౌన్స్ ఛార్జీలను బ్యాంకు విధిస్తుంది. ఈ ఛార్జీలు బ్యాంకును బట్టి మారతాయి. సాధారణంగా ఇవి రూ.500-1000 మధ్య ఉండొచ్చు. తదుపరి నెలలో తప్పిన ఈఎంఐ మొత్తాన్ని ఆలస్యపు రుసుముతో కలిపి చెల్లించాలి. అంటే, ఇంటి రుణ ఈఎంఐ ఒక చెల్లింపును కోల్పోయిన దాని పరిణామాలు ఖరీదే అని చెప్పొచ్చు. అందుచేత, ఈఎంఐని కవర్ చేయడానికి మీ ఖాతాలో తగినంత నగదు నిల్వ ఉండేలా చూసుకోవాలి.

**బ్యాలెన్స్ బదిలీ..**
బ్యాంకులు ఇంటి రుణాన్ని వేరే బ్యాంకుకు బదిలీ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. కానీ, మీ ఇంటి రుణ ఈఎంఐ చెల్లించకపోవడం వల్ల బకాయి ఉన్న రుణ మొత్తాన్ని తక్కువ వడ్డీ రేటుకు అందించే మరొక బ్యాంకుకు బదిలీ చేసే అవకాశాలు తగ్గిపోతాయి. తక్కువ క్రెడిట్ స్కోరు, ఈఎంఐ చెల్లింపులను కోల్పోయారనే వాస్తవ కారణంగా వేరే బ్యాంకులు మిమ్మల్ని అధిక రిస్క్ రుణగ్రహీతంగా పరిగణించి రుణ బ్యాలెన్స్ బదిలీ కోసం మీ రుణ బాధ్యతను తీసుకోవడానికి వెనుకాడతాయి. దీనివల్ల తక్కువ వడ్డీకి రుణం వేరే బ్యాంకు ఇస్తున్నప్పటికీ.. మీకు అర్హత లేని కారణంగా ఇంటి రుణాన్ని బదిలీ చేయలేరు.

**నాన్-పెర్ఫార్మింగ్ అసెట్..**
ఇంటి రుణానికి సంబంధించి మొదటి రెండు ఈఎంఐలు చెల్లింపులు ఆలస్యం అయితే, బ్యాంకు పేమెంట్ కోసం రిమైండర్లను పంపుతుంది. కానీ, చివరి చెల్లింపు జరిగిన 90 రోజుల తర్వాత కూడా బకాయిలను చెల్లించకుంటే, బ్యాంకు ఆ రుణాన్ని నాన్-పెర్ఫార్మింగ్ అసెట్ గా గుర్తిస్తుంది. ఎన్‌పీఏగా గుర్తించిన తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002 ద్వారా అనుమతించిన మీ బకాయిలను తిరిగి చెల్లించమని కోరుతూ రుణగ్రహీతకు చట్టపరమైన నోటీసును బ్యాంకు పంపుతుంది. ఈ నోటీసు అందిన 60 రోజుల్లోపు బకాయిలను చెల్లించవలసి ఉంటుంది. లేకపోతే, 60 రోజులు గడిచిన తర్వాత, బ్యాంకు తాకట్టులో ఉన్న ఆస్తి విలువ, దాని వేలం తేదీని పేర్కొంటూ డిఫాల్టర్‌కు నోటీసును జారీచేస్తుంది. వేలం తేదీ సాధారణంగా నోటీసు తేది నుంచి ఒక నెల తర్వాత ఉంటుంది. వేలంలో రుణ బకాయికి మించివచ్చిన బ్యాంకు రుణగ్రహీతకు ఇచ్చేస్తుంది.

**రుణగ్రహీత చేయాల్సినవి..**
సాధారణంగా బ్యాంకులు రుణగ్రహీత ఆస్తిని స్వాధీనం చేసుకుని వేలం వేయనవసరం లేకుండా పరిష్కారాన్ని రూపొందించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తాయి. రుణగ్రహీత కొంత కాలం పాటు రుణ ఈఎంఐలను తిరిగి చెల్లించడంలో ఇబ్బంది పడవచ్చని ఊహించినట్లయితే, కొన్ని చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. మీ బ్యాంకును 3-6 నెలల మారటోరియం, లేదా ఈఎంఐ రహిత వ్యవధిని కోరవచ్చు. అంటే, ఉద్యోగం కోల్పోయినా లేదా ఇతర ప్రత్యేక పరిస్థితుల్లో మళ్లీ ఉద్యోగంలో చేరేవరకు గడువును అడగవచ్చు. గతంలో మీకు మంచి రుణ చెల్లింపుల ట్రాక్ రికార్డు ఉంటే బ్యాంకు కొంత వెసులుబాటును అందిస్తుంది. రాబోయే 3-6 నెలల్లో మీ ఫైనాన్స్‌ను తిరిగి గాడిలోకి తీసుకురాగలరని బ్యాంకుకు నమ్మకం ఉంటే, రుణంపై కొన్ని నెలల పాటు మారటోరియం అందిస్తుంది. ఇంకా ఈఎంఐలను చెల్లించలేకపోవడానికి మీ ఆర్థిక ఇబ్బందులు కారణమైతే, రుణాన్ని పునర్నిర్మించమని బ్యాంకును అడగవచ్చు. బ్యాంకు రుణ కాలవ్యవధిని పెంచే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఈఎంఐ మొత్తం తగ్గి రుణగ్రహీతకు ఆర్థిక సౌలభ్యం పెరుగుతుంది. రుణగ్రహీత తన పనిచేసే కంపెనీలో పీఎఫ్ బ్యాలెన్స్ ఉంటే దాన్ని ఉపసంహరించుకుని రుణ బకాయిలను చెల్లించి కొంతవరకు ఆర్థిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

# అసలు మా జట్టుకు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే అర్హతే లేదు: కమ్రాన్ అక్మల్




**లాహోర్:** స్వదేశంలో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీని పాకిస్థాన్ ఘోర పరాభవంతో ప్రారంభించింది. న్యూజిలాండ్ తో జరిగిన మొదటి మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. దీంతో ఆ జట్టుపై మాజీ క్రికెటర్ల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. పాక్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ మరో అడుగు ముందుకేసి.. జింబాబ్వే-ఐర్లాండ్‌తో సిరీసుల్లో ఆడుకోవాలని వ్యాఖ్యానించాడు. అక్కడ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీలోకి రావాలని కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్‌కు అక్మల్ చురకలంటించాడు. "ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ జట్టు వైదొలగాలి. జింబాబ్వే, ఐర్లాండ్‌ల మధ్య జరుగుతోన్న సిరీస్‌లో పాల్గొనాలి. అందులో విజయం సాధిస్తేనే మా టీంకు ఛాంపియన్స్ ట్రోఫీలో పోటీపడే అర్హత ఉన్నట్లు. ఇలా అనడానికి కారణం ఉంది. మా జట్టు ఆటతీరు ఇలానే ఉంది. గత ఆరేడేళ్ల నుంచి మా జట్టు క్రికెట్ ప్రమాణాలు అతి ఘోరంగా పడిపోయాయి' అని కమ్రాన్ అక్మల్ వ్యాఖ్యానించాడు.

**కివీస్‌ను చూసి నేర్చుకోండి..**"పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కివీస్ నిలకడైన ఆటతీరును ప్రదర్శించింది. మూడు వికెట్లు కోల్పోయినా స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ ఆ జట్టు బ్యాటర్లు పరుగులు రాబట్టారు. తొలుత నెమ్మదిగా ఆడి.. మ్యాచ్ తమ నియంత్రణలోకి వచ్చిందని భావించాక దూకుడు పెంచారు. పరిణితి చెందిన జట్టు చేసే పని అదే. కనీసం కివీస్‌ను చూసైనా పాక్ నేర్చుకోవాలి. విల్ యంగ్, టామ్ లేథమ్ నిలకడగా ఆడి సెంచరీ సాధించారు" అని కమ్రాన్ అక్మల్ తెలిపాడు. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ పాకిస్థాన్ ముందు 320 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత ఛేజింగ్‌లో పాక్ విఫలమైంది. కివీస్ బౌలర్ల దెబ్బకు పాక్ జట్టు కేవలం 260 పరుగులకే పరిమితమైంది.

# 'ఎప్పటికైనా మీలా అవుతా'..

## జొమాటో సీఈఓకు 8 ఏళ్ల బాలిక లేఖ



**ముంబయి:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో.. ఫుడ్ డెలివరీతో పాటు తన యాప్ ద్వారా 'ఫీడింగ్ ఇండియా' కార్యక్రమానికి విరాళాలు సేకరిస్తుంటుంది. వీటి ద్వారా ఎంతో మందికి సాయం చేస్తుంటుంది. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం కింద 19 కోట్ల మంది ఆకలి తీర్చగలిగామని ఆ కంపెనీ సీఈఓ దీపిందర్ గోయల్ తెలిపారు. యూజర్ల చొరవతోనే ఇదంతా సాధ్యమైందంటూ కొనియాడారు. అంతేకాదు.. తాము చేస్తున్న కృషిని అభినందిస్తూ ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తనకు రాసిన లేఖను సైతం తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'రోజూ మా ఆకలి తీరుస్తున్న ఫీడింగ్ ఇండియా టీమ్‌కు ధన్యవాదాలు. మా గురించి కూడా ఆలోచించే వారు ఉండటం ఆనందం కలిగిస్తోంది. మాతో వ్యక్తిగతంగా పరిచయం లేకపోయినా చాలా సాయం చేస్తున్నారు. మీరు చేస్తున్న ఈ పని చాలా మంది జీవితాల్లో మార్పు తెచ్చింది. నేను బాగా చదువుకుంటున్నాను. ఏదో ఒక రోజు నేను కూడా మీలానే ఇతరులకు సాయం చేసి, ప్రేమను పంచే వ్యక్తిగా ఉండాలని కోరుకుంటున్నాను" అని ఆ విద్యార్థి తన లేఖలో రాసుకొచ్చింది. ఈ లేఖపై స్పందిస్తూ.. తాము చేస్తున్న పనికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ గోయల్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఎన్‌జీఓ గురించి మరిన్ని అప్‌డేట్‌లు త్వరలో అందిస్తామన్నారు. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం.. ఆకలితో అలమటిస్తున్న వారికి, పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించి వారి తీర్చేందుకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా నడుపుతున్న సంస్థే ఈ ఫీడింగ్ ఇండియా.



# 'నో కిస్.. నో ఇంటిమేట్ సీన్స్' పాలసీ పెట్టుకోవడానికి కారణమదే

'మార్కో'తో ఇటీవల విజయాన్ని అందుకున్నారు మలయాళ నటుడు ఉన్ని ముకుందన్. పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రాల్లో నటించడమే తనకు ఇష్టమని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తన సినిమాలను అన్ని వయసుల వారు వీక్షించాలనేది ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ కారణంతోనే దర్శక నిర్మాతలు ఎంత ఒత్తిడి తెచ్చినా.. తాను కొన్నింటిని ఎప్పటికీ అంగీకరించనని స్పష్టం చేశారు. ''సినిమాల్లోకి అడుగు పెట్టిన సమయంలోనే.. ముద్దు, ఇంటిమేట్ సీన్స్‌కు దూరంగా ఉండాలనే పాలసీ పెట్టుకున్నా. ఇప్పటివరకూ నటించిన అన్ని సినిమాల్లోనూ దానిని పాటించా. ప్రేక్షకులందరూ కలిసి కూర్చొని చూసేలా నా సినిమాలు ఉండాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. అలాంటి సీన్లలో నటించాలని ఎంతోమంది దర్శక నిర్మాతలు నాపై ఒత్తిడి తీసుకువచ్చారు. వేరే హీరోల సినిమాలను ఉదాహరణగా చూపిస్తూ మీరూ చేయొచ్చుగా అని అడుగుతుంటారు. ఒక జంట మధ్య రొమాన్స్ చూపించాలనుకుంటే.. ముద్దులు పెట్టుకోవడం ఒక్కటే మార్గం కాదనేది నా భావన. నా తోటి హీరోలు అలాంటి సన్నివేశాల్లో నటించడాన్ని నేను ఏమాత్రం తప్పుపట్టను. నేను అలాంటి వాటిల్లో నటించను. ఇది నాకు నేనుగా పెట్టుకున్నా పాలసీ'' అని ఉన్ని ముకుందన్ చెప్పారు. మలయాళంలో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఉన్ని ముకుందన్ 'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'ఖిలాడి', 'యశోద' వంటి తెలుగు సినిమాల్లోనూ యాక్ట్ చేశారు. ఆయన నటించిన 'మార్కో' బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఓటీటీలోనూ అందుబాటులో ఉంది. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'గెట్ సెట్ బేబీ' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# చిరంజీవి మాట.. నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది: సందీప్ కిషన్



**హైదరాబాద్:** 'మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటుడు సందీప్ కిషన్. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని అన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్ట్‌లు చేస్తున్నానని తెలిపారు.

''ఎవరి సపోర్ట్ లేకుండా నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. కెరీర్ పరంగా ఎత్తు పల్లాలు చూశాను. 'ఒక్క అమ్మాయి తప్ప' సినిమా ముందు వరకూ ఎంతోమంది దర్శక, నిర్మాతలు తమ కథలను నాతో పంచుకునేవారు. కథలపై నాకొక మంచి జడ్జిమెంట్ ఉంటుందని వారు నమ్మేవారు. కానీ ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. నా సినిమాలు వరుస పరాజయాలు అందుకోవడంతో నా జడ్జిమెంట్ సరైనది కాదని వారు భావించారు. కెరీర్‌లో వరుస అపజయాలు, రిలేషన్‌షిప్ బ్రేకప్.. జీవితంలో ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో బాధపడ్డా. రోజుకు అరకిలో ఐస్‌క్రీమ్, చాక్లెట్స్ తినేశా. నా బరువు 97 కిలోలకు చేరింది. ఆ సమయంలో నా స్నేహితుడు రూ.కోటి ఇస్తే 'నిను వీడని నీడను నేనే' చేసి రూ.6 కోట్లు రాబట్టా. అక్కడినుంచి జాగ్రత్తగా కథలు ఎంచుకుంటూ కష్టపడుతున్నా'' అని సందీప్ కిషన్ అన్నారు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. ''ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్ట్‌ల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలనుకుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా'' అని చెప్పారు.

# 'ఛావా'పై పోస్ట్ వివాదం.. విచారం వ్యక్తం చేస్తున్నా: స్వరా భాస్కర్

ముంబయి: 'ఛావా' చిత్రాన్ని ఉద్దేశించి ఇటీవల పరోక్షంగా పోస్ట్ పెట్టారు బాలీవుడ్ నటి స్వరా భాస్కర్. ఆమె తీరుపై నెటిజన్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆమె క్లారిటీ ఇచ్చారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ అంటే తనకెంతో గౌరవం ఉందన్నారు. "ఇటీవల నేను పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో చర్చకు దారి తీసింది. దానిని తప్పుగా అర్థం చేసుకున్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ పరిపాలన.. ముఖ్యంగా సామాజిక న్యాయం, మహిళల పట్ల గౌరవం విషయంలో ఆయన పాటించిన విధానాలను ఎంతగానో గౌరవిస్తుంటా. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మన చరిత్రను కీర్తించడం చాలా గొప్ప విషయం. కానీ, ప్రస్తుత కాలంలోని తప్పులు, వైఫల్యాలను కప్పి పుచ్చడానికి చరిత్ర వైభవాన్ని దుర్వినియోగం చేయకూడదనేది నా అభిప్రాయం. ప్రజలను ఏకం చేయడానికి చారిత్రక అంశాలను ఉపయోగించాలి. అంతేకానీ, ప్రజలను విభజించి, సమస్యలపై నుంచి దృష్టి మళ్లించడానికి కాదు. నా వ్యాఖ్యలు ఎవరి మనోభావాలనైనా దెబ్బతిస్తే.. అందుకు విచారం వ్యక్తం చేస్తున్నా" అని ఆమె రాసుకొచ్చారు. ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ జీవితాన్ని ఆధారంగా చేసుకుని 'ఛావా' సినిమా రూపొందిన విషయం తెలిసిందే. విక్కీ కౌశల్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించారు. ఇందులో చూపించిన విధంగా మొగల్ చక్రవర్తి ఔరంగజేబు.. శంభాజీ మహరాజ్‌ను తీవ్రంగా గాయపరిచి, గోళ్లు కత్తిరించి, కళ్లలో ఇనుప చువ్వలు దించి చిత్రహింసలకు గురిచేసి చంపారన్న విషయాన్ని స్వరా భాస్కర్ కల్పితమన్నట్లు వ్యాఖ్యానించారు. స్వరాభాస్కర్ అభిప్రాయంపై పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చరిత్రను మార్చే హక్కు లేదని ఆమెకు తెలియజేస్తున్నారు. "శంభాజీ మహరాజ్ ప్రాణత్యాగాన్ని తక్కువ చేసి మాట్లాడేందుకు మీకెంత ధైర్యం? కోట్లమంది భారతీయుల సెంటిమెంట్‌ను మీరు అవమానిస్తున్నారు" అని నెటిజన్లు మండిపడ్డారు.

# ఓటీటీలో వినోదం థ్రిల్ పంచుతున్న 'దక్షిణ'..

మరో ప్లాట్‌ఫామ్‌లో 'కథ కమామీషు'



ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు వినోదం పంచేందుకు తాజాగా మరో రెండు సినిమాలు విడుదలయ్యాయి. ఓ మూవీ.. థియేటర్లలో విడుదలైన ఐదు నెలలకు ఓటీటీలో రిలీజైంది. మరో సినిమా.. ఇప్పటికే ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుండగా తాజాగా మరో ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చింది. ఆ వివరాలివీ..

**సైకో కిల్లర్ vs పోలీస్**

రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'కబాలి'లో నటించి, అలరించిన నటి సాయి ధన్సిక . ఆమె ప్రధాన పాత్రలో 'మంత్ర' ఫేమ్ ఓషో తులసీరామ్ తెరకెక్కించిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'దక్షిణ'. ఓ మహానగరంలో సైకో కిల్లర్.. అమ్మాయిలను హత్య చేస్తుంటాడు. సంబంధిత కేసును ఏసీపీ దక్షిణ (సాయి ధన్సిక) టేకప్ చేస్తుంది. ఆ క్రమంలో ఊహించని విధంగా ఆమె జీవితం మలుపు తిరుగుతుంది. ఉద్యోగానికి రాజీనామా చేయడమే కాకుండా మద్యానికి బానిస అవుతుంది. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలేంటి? ఆ కిల్లర్‌కు, దక్షిణకు ఏమైనా సంబంధం ఉందా? సైకో కిల్లర్‌ను దక్షిణ పట్టుకుందా, లేదా? అన్న ఆసక్తికర అంశాలతో రూపొందిన ఈ సినిమా గతేడాది అక్టోబరు 4న బాక్సాఫీసు ముందుకొచ్చింది. ఇన్ని నెలలకు ఓటీటీ 'లయన్స్ గేట్‌ప్లే'లో శుక్రవారం రిలీజైంది.

**నాలుగు జంటల కథ**

ఇంద్రజ, దర్శకుడు కరుణ కుమార్ తదితరులు ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'కథా కమామీషు' . గౌతమ్-కార్తిక్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమా నేరుగా ఓటీటీ 'ఆహా' లో ఈ ఏడాది జనవరి 2న విడుదలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'సన్‌నెక్ట్స్ ' లోనూ స్ట్రీమింగ్ అవుతోంది. పెళ్లైన నాలుగు జంటల మధ్య సాగే కథ ఇది. వైవాహిక జీవితంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులేంటి? వాటినెలా అధిగమించారనేది క్లుప్తంగా ఈ సినిమా కథాంశం. పూర్తిస్థాయి మెలోడ్రామాగా కాకుండా కామెడీకి పెద్దపీట వేశారు. కెరీర్ పరంగా యువతకు ఓ సందేశం ఇచ్చే ప్రయత్నం చేశారు.

# ధనుష్ మేకింగ్ స్టైల్‌పై కీర్తిసురేశ్ ప్రశంసలు



చెన్నై: హీరో ధనుష్ మేనల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్' . ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు.

"ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్ నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది. పవిష్.. హావభావాలు, వాయిస్, యాక్షన్ ఇలా ప్రతి విషయంలో నువ్వు ధనుష్‌ని గుర్తుచేశావు. అద్భుతమైన చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టావు. మాథ్యూ థామస్.. నీ పాత్ర ప్రేక్షకులకు ఎంతగానో గుర్తుండిపోతుంది. ప్రియాంకా మోహన్.. నీ డ్యాన్స్ అదిరింది. టీమ్ అందరికీ అభినందనలు" అని ఆమె రాసుకొచ్చారు. ఇదే చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే పేరుతో విడుదలైంది. రొమాంటిక్ కామెడీ కథతో దీనిని సిద్ధం చేశారు. 'రాయన్' తర్వాత ధనుష్ దర్శకత్వం వహించిన చిత్రమిదే కావడంతో ప్రమోషన్స్ సమయంలోనే ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.

# పులిచింత ఆకులో దాగివున్న ప్రయోజనాలు తెలుసా..?

ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చు..!

మన ప్రకృతిలో ఉండే ఎన్నో మొక్కలు మనకు అనేక రకాలుగా ఉపయోగపడతాయి. ప్రకృతిలో లభించే ప్రతి మొక్కలోనూ ఎన్నో ఔషధ గుణాలు దాగి ఉంటాయి. అవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.. అటువంటి ఔషధ మూలికే పులి చింత కూడా. వర్షాకాలంలో ఈ మొక్క విరివిగా పెరుగుతుంది. మన ఇంట్లో పెంచుకుంటున్న పూల కుండీల్లోనూ ఈ మొక్క పెరిగి నిండుగా పాకుతుంది. ఈ ఆకులను పప్పు, పులుసు కూర వండుకుని తింటారు.. పులి చింత ఆకుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం...


ఈ తీగ జాతి మొక్క ఆకులు నమిలి తింటే పుల్లగా ఉంటాయి. అందుకే వీటికి పులి చింత అని పేరు. ఈ పులి చింత ఆకులను తినటం వలన ముక్కు, గొంతు, మలం ద్వారా పడే రక్తాన్ని నివారిస్తుంది. గొంతు సంబంధిత రోగాలను అరికడుతుంది. ఈ ఆకులను ముద్దగా నూరి రసాన్ని ఫైల్స్ ఉన్నచోట రాసుకుంటే అవి త్వరగా రాలిపోతాయి.



పులి చింత ఆకులను పప్పుగా వండుకొని తింటే కూడా చక్కటి ఫలితం ఉంటుంది. వాతం తగ్గిస్తుంది. ఈ ఆకులను, సొంటి, నెయ్యి, తేనె సమాన మోతాదు లో కలిపి తీసుకుంటే వాతం తగ్గుతుంది. ఈ ఆకులతో మూత్ర నాళాల రుగ్మతలకు చికిత్స చేస్తారు. శ్వాస సమస్యలను తొలగిస్తుంది. ఆహారంలో పులి చింతను చేర్చుకోవటం వల్ల నిద్రలేమికి మేలు చేస్తుంది. కండరాల బలాన్ని మెరుగుపరుస్తుంది. పులిచింత ఆకు రసంతో కాస్తంత సైంధవ లవణం కలిపి పూస్తే పులిపిర్లు రాలిపోతాయి. పులిచింత వేళ్లను నీటిలో వేసి కాచి, ఆ కషాయంతో 10 నిమిషాల పాటు పుక్కిలిస్తే కదిలే దంతాలు గట్టిపడతాయి. పులిచింత మొక్క వేళ్లను నీడన ఎండించి పొడి చేసి పండ్ల పొడిగా వాడినా చిగుళ్లు, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.

సైందవ లవణం చేర్చిన పులిచింత ఆకు రసాన్ని తేలు కుట్టిన చోట రుద్దితే చాలా త్వరగా విషం దిగిపోతుంది. పులిచింత ఆకులతో చేసిన పచ్చడిని తింటూ వుంటే ఆకలి పెరగడంతో పాటు ఆస్తమా తీవ్రత తగ్గుతుంది.

40 నుంచి 60 మి.లీ పులి చింతల ఆకు రసంలో పొంగించిన ఇంగువ కలిపి సేవిస్తే కడుపు నొప్పి తగ్గుతుంది. పదిహేను ఆకుల రసంలో పటిక బెల్లం కలిపి తీసుకుంటే ఒంట్లో వేడి తగ్గిపోతుంది. ఈ ఆకులను కూరగా, పచ్చడిగా వండుకుని తింటే ఆస్తమా నుంచి ఉపశమనం కలుగుతుంది.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com